నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 13-1-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 134 | పేజీలు: 8 | వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

కోవిడ్ టీకాలు
సుధారస సేవనం
మృత్యువు పరార్

ఆర్థిక మాంద్యం
మార్కెట్ డీలపడింది
ఖజానా ఖాళీ

గోడకు సున్నం
ముఖానికి రంగులు
నైజం మారదు.

మూడవ దయ్యం
తెరలేదా పీడనే
జ్ఞాని వినరా!

ఫీజుల వాత
విద్యాబంధువు లేదా
ఉచితం మేలు

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

దేశ మంత బాధితులే
సంక్రాంతి పండుగ !
ఒక్క దగ్గర కలుపుతుంది
ఒమైక్రాన్ నిండుగ !

తగ్గుముఖం పడితేనే
ప్రయాణాలు ముద్దు !
చీకటి కరోనా ఉంటె
పొడవదండి పొద్దు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

అక్సిజన్ నిల్వలు ఉండేలా చూసుకోండి-అన్ని రాష్ట్రాలకు లేఖ రాసిన 'కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి'

న్యూఢిల్లీ, జనవరి 12:కరోనాతో పాటు కొత్త వేరియంట్ ఒమిక్రాన్ లో లక్షణాలు, స్వల్ప తీవ్రత కలిగి ఉన్నా ఈ వేరియంట్ పట్ల నిర్లక్ష్యం వద్దని, అందరూ తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు వెల్లడించారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు లేఖ రాశారు కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్. అన్ని రాష్ట్రాలు మెడికల్ ఆక్సిజన్ నిల్వలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. 48గంటల పాటు ఆక్సిజన్ బఫర్ లభ్యత ఉండేలా చూసుకోవాలని సూచించారు. లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ ట్యాంకులను తగినంతగా నింపాలన్నారు. అదే విధంగా ఆక్సిజన్ సిలెండర్లను ఎప్పటికప్పుడు రీ ఫిల్లింగ్ చేస్తూ ఉండాలని, ఇది నిరంతరాయంగా జరుగుతూ ఉండాలని చెప్పారు.

దేశవ్యాప్తంగా ఉన్న పీఎస్ఏ (ఖూం) ప్లాంట్లను బలోపేతం చేయాలని అన్నారు. అవి పూర్తిగా పని చేస్తున్నాయో లేదో నిర్ధారించుకోవాలని చెప్పారు. దేశంలోని అన్ని జిల్లాలు కూడా ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు తగినంత సంఖ్యలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. బ్యాకప్ స్టాక్‌లు, పటిష్టమైన రీఫిల్లింగ్ సిస్టమ్‌లతో పాటు ఆక్సిజన్ సిలిండర్‌లను తగినన్ని ఇన్వెంటరీగా ఉండేలా చూసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించారు. అన్ని రాష్ట్రాలు లైఫ్ సపోర్ట్ పరికరాల లభ్యతను నిర్ధారించుకోవాలని, అలాగే ప్రైవేట్ హెల్త్ సెంటర్స్ తో సమన్వయం చేసుకుంటూ ఉండాలని చెప్పారు. ఆక్సిజన్ సంబంధిత సమస్యలు, సవాళ్లను సత్వరంగా పరిష్కరించేందుకు గతంలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ కంట్రోల్ రూమ్‌లను తిరిగి ప్రారంభించాలని ఆదేశించారు.

లాక్‌డౌన్ ఉండదు- ఆందోళన వద్దు..

న్యూఢిల్లీ, జనవరి 12: దేశ రాజధాని ఢిల్లీలో కోవిడ్ కొత్త కేసుల విస్తృతి ఆందోళనకర స్థాయిలో పెరుగు తోంది. కేసు పాజిటివిటీ రేటు ఇప్పటికే 25 శాతం దాటింది. అంటే టెస్టు చేయించుకుంటున్న ప్రతి నలుగురిలో ఒకరు కరోనా పాజిటివ్‌గా తేలుతున్నారు. 24 గంటల వ్యవధిలో 23 మరణాలు కూడా చోటుచేసు కున్నాయి. గత 8 నెలల కాలంలో ఇదే అత్యధిక సంఖ్య. సోమవారం సమావేశమైన ఢిల్లీ డిజాస్టర్ మేనే జ్మెంట్ అథారిటీ, మంగళ వారం మరికొన్ని ఆంక్షలు విధిస్తూ ఆదేశాలు జారీచేసింది. దాదాపుగా లాక్‌డౌ న్‌ను తలపించే ఆంక్షలే నగరంలో అమలవు తున్నప్ప టికీ, లాక్‌డౌన్ ఉండబోదని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

లాక్‌డౌన్ భయంతో దినసరి కూలీలు, కార్మికులు నగరాన్ని వీడి తమ స్వస్థలా లకు వెళ్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. కఠిన ఆంక్షలతో కోవిడ్ థర్డ్ వేవ్‌ను కట్టడి చేయాలన్న ఆలోచనలో ఆయనున్నారు.

వారం రోజుల పాటు కేసుల ఉధృతి బాగా పెరుగుతుందని, ఆ తర్వాత తగ్గుముఖం పడుతుందని ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యేంద్ర జైన్ అభిప్రాయ పడ్డారు. ఢిల్లీలో యాక్టివ్ కేసుల సంఖ్య 75 వేల మార్కును చేరుకోగా, అందులో రెండొంతుల మంది హోమ్ ఐసోలేషన్లో ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి.

కఠిన ఆంక్షలు తప్పవని ముందే హెచ్చరించిన 'ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ (డీడీఎంఏ)', ఆ మేరకు ఇప్పటికే అమలవుతున్న ఆంక్షలకు అదనంగా మంగళవారం మరికొన్ని ఆంక్షలు విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బార్లు, రెస్టారెంట్లను పూర్తిగా మూసివేయాలని ఆదేశాల్లో పేర్కొంది.

కేవలం పార్శిల్ సర్వీసులు (టేక్ అవే), ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ కొనసాగించుకోవచ్చునని మినహాయిం పునిచ్చింది. ఇకపోతే అత్యవసర, నిత్యావసర సేవల విభాగాలకు చెందిన శాఖలు మినహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఇప్పటికే మూసేసిన డీడీఎంఏ, తాజాగా నగరంలోని అన్ని ప్రైవేట్ కార్యాలయాలను మూసివేయాల్సిందిగా ఆదేశించింది. 'వర్క్ ఫ్రమ్ హోం (ఇంట్లోనే నుంచే పని)' విధానంలో తమ తమ కార్యాకలాపాలు కొనసాగించుకోవాలని సూచించింది. అయితే డీడీఎంఏ గుర్తించిన మినహాయింపు జాబితాలోని ప్రైవేటు కార్యాలయాలకు మినహాయింపు ఉంటుందని ఆదేశాల్లో పేర్కొంది. నగరంలో రాత్రిపూట కర్ఫ్యూతో పాటు వారాంతాల్లో కర్ఫ్యూ అమలవుతున్న సంగతి తెలిసిందే.

కరోనాని అంతమొందించలేం - అమెరికా అంటువ్యాధుల నిపుణులు 'ఆంటోనీ ఫౌచీ'

న్యూఢిల్లీ, జనవరి 12:దేశంలో కరోనా కేసులు విపరీతంగా పెరుగుతున్నాయని, ఆసుపత్రుల్లో చేరుతోన్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని అమెరికా అంటువ్యాధుల నిపుణుడు ఆంటోనీ ఫౌచీ తెలిపారు. కరోనా వైరస్ తో జీవించే స్థాయికి అమెరికా చేరిందని ఆయన చెప్పారు.

సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సమాజం నుంచి కరోనాను అంతమొందించలేమని స్పష్టం చేశారు. ఒమిక్రాన్ లాంటి వేరియంట్లు ప్రతి ఒక్కరికీ సోకుతాయని అన్నారు. కాబట్టి కరోనా అంతమవ్వడమన్నది అసాధ్యమన్నారు. కరోనాతో మరిన్ని వేరియంట్లు పుట్టుకొస్తూనే ఉంటాయని, వ్యాక్సిన్లు వేసుకోని వారిలోనే అవి పురుడు పోసుకుంటాయని ఆయన స్పష్టం చేశారు. వ్యాక్సిన్ వేసుకున్న వారికి ఎన్ని వేరియంట్లు వచ్చినా తీవ్రత తక్కువగానే ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం దేశంలో కరోనా కేసులు పెరిగిపోతున్నాయని, ఎక్కువ మంది దాని బారిన పడి ఉంటారు కాబట్టి.. సహజ రక్షణ లభిస్తుందని ఫౌచీ చెప్పారు. ప్రస్తుతం రోజూ పది లక్షల కేసులు నమోదవుతున్నాయని, లక్షన్నర మంది ఆసుపత్రుల్లో చేరుతున్నారన్నారు.

రైతాంగం నష్టాల్లో ఉంది - ప్రధాని మోడీకి , సీఎం కేసీఆర్ లేఖ

హైదరాబాద్, జనవరి 12:ప్రధాని నరేంద్ర మోడీకి సీఎం కేసీఆర్ లేఖ రాశారు. 90రోజులుగా ఎరువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. 50నుంచి వంద శాతం ధరలు పెరిగాయని కేసీఆర్ తెలిపారు. రైతాంగం ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉందని చెప్పారు. డీజీల్ ధరల పెరుగుదలతో రైతులు నష్టాల్లో ఉన్నారని తెలిపారు. వ్యవసాయ ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని కేంద్రం చెబుతోందన్నారు. కానీ వ్యవసాయ పెట్టుబడి రెట్టింపయ్యేలా కనిపిస్తోందని అన్నారు. రైతుల పెట్టుబడి మొత్తాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని కేసీఆర్ లేఖలో రాశారు.

ఏపీలోని సినిమా థియేటర్ల సమస్యలపై ఆ రాష్ట్ర మంత్రులతో నేను మాట్లాడతాను

హైదరాబాద్, జనవరి 12:ఏపీలో సినిమా టికెట్ల ధరలు తగ్గించడంపై వివాదం రాజుకున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో ఏపీ మంత్రి పేర్ని నాని చర్చలు జరిపినప్పటికీ అవి ఫలించలేదు. ఈ నేపథ్యంలో ఏపీలోని సినిమా థియేటర్ల సమస్యలపై ఆ రాష్ట్ర మంత్రులతో తాను మాట్లాడతానని తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రోజు తలసాని మీడియాతో మాట్లాడుతూ? ఇటీవల విడుదలైన బాలకృష్ణ అఖండ సినిమాతో పాటు అల్లు అర్జున్ పుష్ప మూవీ మంచి విజయాలు సాధించడంతో సినీ పరిశ్రమ మళ్లీ పుంజుకుందని ఆయన చెప్పారు. తాము తెలంగాణలో ఇప్పటికే సినిమా టికెట్ల ధరలు పెంచామని ఆయన గుర్తు చేశారు. అంతేగాక, థియేటర్లలో ఐదో ఆటకు అనుమతులు కూడా ఇచ్చామని చెప్పారు. తాము సినీ పరిశ్రమకు ఎల్లప్పుడూ అండగా ఉంటున్నామని తెలిపారు.

సినీ పరిశ్రమకు హైదరాబాద్ హబ్ గా ఉండాలని భావిస్తున్నామని తలసాని చెప్పారు. సినిమాకు కులం, మతం, ప్రాంతాల భేదాలు ఏవీ ఉండవని హితవు పలికారు. అది వినోదాన్ని అందించే సాధనమే అని చెప్పారు. ఇండస్ట్రీలోని సమస్యలపై తాము వెంటనే సానుకూలంగా స్పందిస్తూ పరిష్కరిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో సినీ పరిశ్రమపై ఆధారపడి వేలాది మంది బతుకుతున్నారని, ఇక్కడి ప్రభుత్వం సినీ పరిశ్రమపై బలవంతంగా నిర్ణయాలు తీసుకోదని ఆయన స్పష్టం చేశారు. తాము సాధారణంగా సినిమా థియేటర్లపై ఎలాంటి ఆంక్షలు పెట్టబోమని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అయితే, కరోనా సమయంలో మాత్రం పరిస్థితులు ఆందోళనకరంగా ఉంటే పలు నిబంధనలను తప్పవని చెప్పారు. త్వరలోనే ఆన్‌లైన్ టికెట్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కాగా, సినిమా టికెట్ల ధరలు తగ్గించి థియేటర్లను నడపడం తమ వల్ల కాదని కొందరు ఏపీ థియేటర్ల యజమానులు స్వచ్ఛందంగా వాటిని మూసివేసిన విషయం తెలిసిందే.

ఎస్సీ గురుకుల విద్యార్థులకు ల్యాప్ టాప్స్,చెక్కులు పంపిణీ చేసిన మంత్రి కొప్పుల

హైదరాబాద్, జనవరి 12: అన్ని వర్గాల వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే మహాదాశయంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద సంఖ్యలో గురుకులాలను ప్రారంభించారని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఎస్సీ గురుకులాలలో చదివి ఎంబీబీఎస్,బీడీఎస్, ఐఐటి,ఎన్ఐటిలలో సీట్లు పొందిన విద్యార్థి,విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హైదరాబాద్ మంత్రుల నివాసంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి మంత్రి 100 మంది విద్యార్థులకు ల్యాప్ టాప్స్,చెక్కులను పంపిణీ చేశారు.

2018-19,2019-20 విద్యా సంవత్సరాలలో ఐఐటి, ఎంబిబిఎస్ కోర్సుల్లో సీట్లు పొందిన వారికి 50 వేలు,ఎన్ఐటి,బిడిఎస్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు 40 వేల చొప్పున మంత్రి చెక్కులు అందజేశారు. ఐఐటి విద్యనభ్యసిస్తున్న వారికి ల్యాప్ టాప్స్ పంపిణీ చేశారు.విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహకంగా 92 లక్షల 40 వేలు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. అన్ని రంగాలతో పాటు ఉన్నత విద్యలో కూడా తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దాలనే మహాదాశయంతో ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకులాలను పెద్ద సంఖ్యలో ప్రారంభించారని మంత్రి తెలిపారు. తెలంగాణ గురుకుల విద్యార్థులు పదవ తరగతి,ఇంటర్,డిగ్రీ ఫలితాలతో పాటు జాతీయ పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపుతున్నారని మంత్రి వివరించారు.

సింగరేణిలో 9 మంది కార్మికులకు కరోనా పాజిటివ్

వరంగల్ జనవరి 12:: భూపాలపల్లి సింగరేణి ఏరియాలో కరోనా కలకలం రేపింది. ఓపెన్ కాస్ట్ లో పనిచేస్తున్న కార్మికుల్లో 14 మంది కరోనా పరీక్షలు చేసుకోగా? 9 మందికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ఓపెన్ కాస్ట్ లో పనిచేస్తున్న ఇద్దరు కార్మికులు, సింగరేణి ఏరియా హాస్పిటల్ లో పని చేసే ఇద్దరు వర్కర్లకుతో పాటు మిగతా వారు ఏరియా హాస్పిటల్ క్వారంటైన్ లో ఉన్నారు.

దేశంలో 153.80 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్ డోసుల పంపిణీ

హైదరాబాద్: దేశంలో కోవిడ్ వ్యాప్తి నివారణకు ప్రభుత్వం పెద్దయెత్తున వ్యాక్సినేషన్ ప్రక్రియను కొనసాగిస్తోంది. ఈ మేరకు బుధవారం నాటికి దేశంలో 153.80 కోట్ల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసినట్టు కేంద్ర ఆరోగ్యశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గడిచిన 24 గంటల్లో 85 లక్షల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసినట్టు తెలిపారు. దేశంలో రికవరీ రేట్ 96.01 శాతం కాగా గడిచిన 24గంటల్లో కొత్తగా 1,94,720 కేసులు నమోదయ్యాయి. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 9,55,319 కాగా పాజిటివిటీ రేట్ 9.82శాతంగా అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్ లో అగ్ని ప్రమాదం

హైదరాబాద్, జనవరి 12: సికింద్రాబాద్ రాణిగంజ్‌లోని ఫిలిప్స్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. సమాచారం అందిన వెంటనే మహంకాళి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని ఐదు ఫైరింజన్లతో మంటలను అదుపు చేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది.

బీజేపీ ప్రభుత్వం పచ్చి రైతు వ్యతిరేకి: సీఎం కేసీఆర్

హైదరాబాద్, జనవరి 12:రైతుల ఆదాయాన్ని 2022 కల్లా రెట్టింపు చేస్తామని గొప్పలు చెప్పిన కేంద్ర ప్రభుత్వం.. ఎరువుల ధరలు విపరీతంగా పెంచి దేశ రైతాంగం యొక్క నడ్డి విరిచిందని సీఎం కేసీఆర్ మండిపడ్డారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పిన కేంద్రం ఉల్టా వ్యవసాయ ఖర్చులు రెట్టింపు చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. బీజేపీ ప్రభుత్వం పచ్చి రైతు వ్యతిరేక ప్రభుత్వం అని నిర్ధారణ అయిందని స్పష్టం చేశారు. దేశ రైతాంగాన్ని బతకనిచ్చే పరిస్థితి లేదన్నారు. కరెంటు మోటార్లు బిగించి బిల్లులు వసూలు చేయడం? ఔఖీఉఇని వ్యవసాయానికి అనుసంధానం చేయ మంటే చేయకుండా నాన్చడం విపరీతంగా ఎరువుల ధరలు పెంచడం రైతులు తాము పండించిన ధాన్యాన్ని కూడా కొనకుండా దుర్మార్గపు చర్యలకు పూనుకోవడం వెనక కుట్ర దాగి వుందన్నారు.రైతులను వారి పొలాల్లో వారినే కూలీలుగా మార్చే కుట్ర లను ఎదుర్కోవాలన్నారు. గ్రామీణ వ్యవసాయ రంగాన్ని, అనుబంధ వృత్తులను నిర్వీర్యం చేసి, గ్రామీణ ఆర్థిక రంగాన్ని చిన్నా భిన్నం చేసి వ్యవసాయాన్ని, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతున్న బిజెపి పార్టీ ని కూకటివేళ్లతో పెకలించి వేయాలని దేశ ప్రజలకు రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎరువుల సబ్సిడీలను ఎత్తివేసి రైతులను వ్యవసాయం చేయకుండా చేస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వంపై దేశ రైతాంగం నాగండ్లు ఎత్తి తిరగబడితే తప్ప వ్యవసాయాన్ని కాపాడుకొలేని పరిస్థితులు దాపురించాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ కేంద్రానికి బుద్ధి వచ్చేదాకా ఎక్కడి కక్కడ నిలదీయాలని ప్రజలకు సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. కేంద్రం తక్షణమే పెంచిన ఎరువుల ధరలను తగ్గించకపోతే దేశవా ప్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. కేంద్రం కుట్రలను రాష్ట్ర రైతాంగం అర్థం చేసుకుని బీజేపీ ప్రభుత్వం పై ధరలు తగ్గించే దాకా సాగే పోరాటంలో కలిసిరావాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు.

రిటైర్డ్ గెజిటెడ్ అధికారులు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు

హైదరాబాద్: రిటైర్డ్ గెజిటెడ్ అధికారులు తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని, వారి సేవలు మరువలేనివని శ్రీనివాస్ గౌడ్ కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అమలు చేయడంలో పెన్షనర్లు సహకరించాలని కోరారు. తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం రూపొందించిన సంఘ వెబ్ సైట్, పెన్షనర్ల హ్యాండ్ బుక్,నూతన కేలండర్ ను మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు తనకు తెలుసునని, వారి సమస్యలు, పెన్షనర్లకు రావాల్సిన డీఆర్లను, పెన్షనర్లకు ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటుకు సంబంధించిన అంశాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉద్యోగుల ఆరోగ్యపథకం పకడ్బందీగా అమలుచేయడానికి 1శాతం బేసిక్ పెన్షన్ లో మినహాయించుకుని నగర రహిత ఆరోగ్య చికిత్సను అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలుచేయడానికి ప్రభుత్వం కట్టుబడి వుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో

తెలంగాణ రిటర్డ్ గెజిటెడ్అధికారుల సంఘం ప్రెసిడెంట్ మోహన్ నారాయణ, ప్రధాన కార్యదర్శి నరసరాజు, సంఘం నాయకులు రవీందర్, యాదయ్య గౌడ్, విష్ణువర్ధన్ రావు, జయభారతి తదితరులు పాల్గొన్నారు.

చైనా కుయుక్తులకు గట్టిగానే బుద్ధి చెబుతాం.. ఆర్మీ చీఫ్ నరవణె

న్యూఢిల్లీ, జనవరి 12:భారత సైన్యం తూర్పు లడఖ్ లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీతో కఠినంగానే వ్యవహరిస్తోందని, ఈ ప్రాంతంలో హై లెవల్ లో బలగాలను మోహరించినట్టు ఆర్మీ చీఫ్ జనరల్ ఓ.ఓ. నరవణే చెప్పారు. ఆర్మీ డేకి ముందు జరిగిన మీడియా మీట్ లో జనరల్ నరవాణె మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో పాక్షికంగా ఎంగేజ్మెంట్ జరిగినప్పటికీ ఏ విధంగానూ ముప్పు తగ్గలేదన్నారు.దీంతో అత్యున్నత స్థాయి కార్యాచరణకు నన్నాహాలు చేస్తున్నామన్నారు. అదే సమయంలో చైనీస్ ఖఒంతో మాట్లాడేందుకు రెడీగా ఉన్నట్టు తెలిపారు. చైనా యొక్క కొత్త భూ సరిహద్దు చట్టంతో తలెత్తే సమస్యలను ఎదుర్కోవడానికి భారత సైన్యం తగినంతగా సిద్ధంగా ఉందని ఆర్మీ స్టాఫ్ చీఫ్ చెప్పారు.సరిహద్దుల వెంబడి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, అభివృద్ధి చేయడం గురించి కూడా ప్రస్తావించారు ఆర్మీ చీఫ్ నరవణె సరిహద్దు ప్రాంతాల్లోని అన్ని ద్వంద్వ-వినియోగ మౌలిక సదుపాయాలను ఉపయోగించుకునేలా చూడడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. యథాతథ స్థితిని తమకు అనుకూలంగా మార్చేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలకు బలగాల ప్రతిస్పందన కూడా అదే స్థాయిలో ఉందని చెప్పారు. కాగా, డిసెంబర్ 4న నాగాలాండ్ కాల్పుల ఘటనపై ఒకటి, రెండు రోజుల్లో నివేదిక అందుతుందని, దాని ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని జనరల్ నరవానే చెప్పారు.

తెలంగాణలో పలు చోట్ల వర్షాలు

హైదరాబాద్, జనవరి 12: తెలంగాణలో పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజుల నుంచి పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. తాజాగా వాతావరణ శాఖ మరో అలెర్ట్ జారీ చేసింది. వచ్చే మూడు గంటల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందిన హైదరాబాద్ వాతారవణ కేంద్రం హెచ్చరించింది. సిద్దిపేట, జనగామ, యాదాద్రి, ఖమ్మం, మెదక్, సూర్యాపేట, సంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో మోస్తారు వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది. గంటలకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. కాగా, నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి నెలకొంది. సముద్రమట్టానికి 1.5కి.మీ. ఎత్తులో ద్రోణి నెలకొంది. ఈ మేరకు ఉత్తర,దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

అదుపుతప్పి పత్తి లోడు లారీ బోల్తా

వరంగల్, జనవరి 12ఫపత్తి లోడుతో వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి బోల్తాపడిన ఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకుంది. వరంగల్ జిల్లా ఉర్సు గుట్ట ప్రాంతంలో పత్తి లోడ్ ఉన్నటువంటి లారీ అదుపుతప్పి బోల్తాపడిన ప్రమాదంలో డ్రైవర్ కి తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతన్ని సమీపంలో ఉన్నటువంటి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

"నవతరంలోనూ అలిశెట్టి ఆవేశం" - పురస్కార గ్రహీత ఉదారి

సత్యం కోసం నిలబడుతోన్న నేటి నవతరంలోనూ అలిశెట్టి ప్రభాకర్ ఆలోచన, ఆవేశం, అభివ్యక్తి ప్రవహిస్తున్నాయని ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణ అన్నారు.తెలంగాణ రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఫిలింభవన్‌లో అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారాన్ని నారాయణ స్వీకరించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శాలువా, పుష్ప గుచ్చాలు, జ్ఞాపికలతో నిర్వాహకులు సత్కరించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయ విద్యార్థిగా వున్నప్పటి నుంచే అలిశెట్టి ప్రభాకర్‌తో తనకు ఆత్మీయ అనుబంధాలున్నాయని నారాయణ గుర్తు చేసుకున్నారు. ప్రజాపక్షం నిలిచినవాడే నిజమైన కవి కాగలడని ముఖ్య అతిథి నగునూరి శేఖర్ అభిప్రాయపడ్డారు. అలిశెట్టితో అనుబంధమున్న ఆచరణవాది ఉదారికి పురస్కారమివ్వడం ఎంతో సముచితమని అభిప్రాయపడ్డారు. అలిశెట్టి ప్రభాకర్ ఆశయాలను, కవిత్వాన్ని సజీవంగా నిలిపేందుకే ప్రతి ఏటా ఆయన పేరిట పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నామని తెరవే రాష్ట్ర అధ్యక్షుడు గాజోజు నాగభూషణం తెలిపారు. తెరవే కరీంనగర్ అధ్యక్షుడు కందుకూరి అంజయ్య అధ్యక్షతన జరిగిన సభలో కవులు సీవీ కుమార్, కూకట్ల తిరుపతి, అన్నవరం దేవేందర్, బూర్ల వేంకటేశ్వర్లు, తోట నిర్మలారాణి, విలాసాగరం రవీందర్, సనీరుద్దీన్, పెనుగొండ బనవేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

ఉదారి నారాయణ దంపతులను సత్కరిస్తున్న అతిథులు.

కళాకారులకు పుట్టినిల్లు వర్ధన్నపేట

మౌనశ్రీమల్లిక్, నవీన్‌గౌడ్‌లకు ఘన సన్మానం

కళాకారులను వర్ధన్నపేట పుట్టినిల్లు అని, ఇక్కడి కళాకారులు జాతీయ స్థాయిలో రాణించి పట్టణానికి కీర్తిప్రతిష్టలు తీసుకొచ్చారని వరంగల్ మాజీ మేయర్, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఎర్రబెల్లి స్వర్ణ-వరదరాజేశ్వర్‌రావు దంపతులు అన్నారు. పట్టణంలోని లక్ష్మి గార్డెన్‌లో శనివారం వర్ధన్నపేటకు చెందిన సినీగేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, సంగీత దర్శకుడు మోటపోతుల నవీన్‌గౌడ్‌ను కాంగ్రెస్ సీనియర్ నేత ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు ఆధ్వర&ంయలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికంలో పుట్టిన మల్లిక్, నవీన్‌గౌడ్‌లు మొక్కవోని దీక్షతో కళారంగంలో రాణించి వర్ధన్నపేటలో జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడం గర్వకారణమన్నారు. కవితలతో పాటు సిరియళ్లు, సినీమాలకు పాటలు రాస్తూ సుమారు 25 అవార్డులు పొందారన్నారు. నవీన్ ఎంఏ, ఎల్ఎల్ఎం పూర్తి చేసి న్యాయవాద వృత్తి చేపట్టారని, సంగీతంపై మమకారంతో సినీ పరిశ్రమ వైపు వెళ్లారని తెలిపారు. సంగీత దర్శకుడిగా ఉన్నతంగా రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేటపై మౌనశ్రీమల్లిక్ రచనలోనవీన్ సంగీత దర్శకత్వంలో రూపొందించిన 'ఆకేరు తీరాన విరిసిన పూదోట వర్ధన్నపేట' అనే పాటను ఆవిష్కరించారు. మల్లిక్, నవీన్‌గౌడ్ మాట్లాడుతూ కళారంగంలో ఆసక్తిగలవారికి అవకాశాలు కల్పించేందుకు అకాడమీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోలు అరుణ, వైస్‌చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు చీటూరి అశోక్, బోంపెల్లి దేవేందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఎద్దు సత్య

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 13-1-2022

నేటికవిత-కవిత్వ విశ్లేషణ

-శ్రీదాసం లక్ష్మయ్య
అధ్యక్షుడు, నేటికవిత
9440155240

నేటికవితలో ఈ వారం: 'రెక్కలు తొడిగిన ఉత్సాహం' అనే అంశంపై వచ్చిన కవితల్లోంచి ఓ మూడు కవితలపై విశ్లేషణ

-దాసం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

రహస్య దినుసు

ఆగి ఆగి కురిసే వానకోసం
చూపులను వీధిలోకి విసిరేసి
నింగినీ నేలనూ మూతవేయని రెప్పలతో
కలయచూడటం ఎంత బాగుంటుందో.
ముకుపుటాలను సుతిమెత్తగా
పలకరించే మట్టివాసన ఆస్వాదిస్తూ
ఒక్కటొక్కటిగా కూడుకుంటూ
ఆకు రెక్కలనుంచి జారిపడే బిందువులను
దీక్షగా చూడటం నాకో తీరని కోరిక.
నిండు గర్భిణిలా భారమైన
మబ్బులు కమ్మినప్పుడే
ఎండబెట్టిన మిరపకాయలు తీసెయ్
ఆరబెట్టిన బట్టలు లోనికి పట్టుకెళ్లు
రెక్కలు విప్పిన ఆనందాన్ని
కత్తిరించే అమ్మ పొలికేక
మనసుకు అర్థం పడుతూ
బాల్యపు ఊహాపాయసంలో మిళితమైన
చేదు గుళికలు.
కొబ్బరిచెట్టు ఆకులు వింజామరలుగా
ఊగుతూ రాల్చిన
యవ్వనపు ముత్యాలవాన సొగసులను
నాన్న అదిలింపులకు నేలన ఇంకిపోయాయి.
అపార్ట్‌మెంట్ అగ్గిపెట్టె నుంచి
కనబడని మబ్బు తునకను అన్వేషించే
ఇప్పటి బందిఖానాకు అప్పుడప్పుడు
నేలను తాకని జల్లులు ఎదురుపడతాయి
భర్తమాటున వంటింటి కుస్తీలో
ఉత్త బాగోగుల పలకరింపుకే తృప్తిపడతాను.
ఇంతకీ చినుకులు కట్టే కాలువను
కళ్లారా చూడనేలేదు
ఒక్కొక్కదానిపై చినుకులు చేసే శబ్దాలు
చెవులారా ఆలకించనే లేదు.
నా సంతోషానికో పద్ధతి ఉంది
అదే వాయిదాల పద్ధతి
ఇప్పటికీ ఇదే నా సీక్రెట్ ఇంగ్రేడియంట్.
అది గుర్తుకొచ్చినప్పుడల్లా
రెక్కలు తెగిన ఉత్సాహమే నాది
కొత్త రెక్కలకై చేసే గద్ద తపస్సునాది
కథల్లోని ఫీనిక్స్ నాకు ఆదర్శం

-నస్రీన్‌ఖాన్
హైదరాబాద్

హైదరాబాదుకు చెందిన కవయిత్రి నస్రీన్‌ఖాన్ గారు రెక్కలు తొడిగిన ఉత్సాహం అంశంపై రహస్యదినుసు శీర్షికతో రాసిన కవితలో తమ ఆకాంక్షలను అక్షరాల్లో ఆవిష్కరించారు. ఉత్సాహంతో ఆగి ఆగి కురిసే వానకోసం చూపులను వీధిలోకి విసిరేసి నింగినీ నేలనూ కనులార్పకుండా కలియ చూడాలని ఉందని పేర్కొన్నారు. మట్టివాసనల గుబాళింపులను ఆస్వాదిస్తూ ఆకుల రెక్కలపై సుతారంగా సంతకం చేస్తూ జారిపడే చినుకులను చూడాలన్న తమ ఆకాంక్షలను ప్రకటించిన తీరు బాగుంది. ఇంకా బాల్యంలోని మధుర జ్ఞాపకాలను ఏకరువు పెట్టారు. చిన్నప్పుడు ఆనందంతో కేరింతలు వేసేవేళ.. మధ్యలో అమ్మచెప్పే పనులను .. బాల్యపు ఊహాపాయసంలో మిళితమైన చేదు గుళికలుగా వివరించారు.

కొబ్బరిచెట్టు ఆకులు వింజామరలుగా ఊగుతూ రాల్చిన యవ్వనపు ముత్యాలవాన సొగసులను నాన్న అదిలింపులకు నేలన ఇంకిపోయాయని వాపోయారు. అపార్ట్‌మెంట్ ఆవాసం నుంచి అప్పుడప్పుడు నేలను తాకని జల్లులు ఎదురుపడతాయని చెప్పడం బాగుంది. భర్తమాటున వంటింటి కుస్తీలో ఉత్త బాగోగుల పలకరింపుకే తృప్తిపడతానని పేర్కొన్నారు. ఇంతకీ చినుకులు కట్టే కాలువను కళ్లారా చూడనేలేదనీ.. ఒక్కొక్క దానిపై చినుకులు చేసే శబ్దాలను చెవులారా ఆలకించనే లేదని కొనసాగించిన తీరు బాగుంది. తమ సంతోషానికి ఓ పద్ధతి ఉందనీ.. అదే వాయిదాలపద్ధతి.. ఇప్పటికీ ఇదే అంటూ కవయిత్రి తమ మదిలో కదలాడే భావాలను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.

ఇలా గుర్తొచ్చినప్పుడల్లా రెక్కలు తొడిగిన ఉత్సాహమే నాది... కొత్త రెక్కలకై చేసే గద్ద తపస్సునాది .. కథల్లోని ఫినిక్స్ నాకు ఆదర్శం అంటూ మంచి ముగింపునిచ్చారు కవయిత్రి నస్రీన్‌ఖాన్ గారు ఈ కవిత ద్వారా రెక్కలు తొడిగిన ఉత్సాహంతో బాల్యంలో అనుభవించిన అనుభవాలను ముఖ్యంగా వాన చినుకులతో తాను పొందిన అనుభూతులను కవితాత్మకంగా కవిత్వీకరించారు. బాల్యం లోని అనుభవాలు ఎవ్వరికైనా ఆనందాలను పంచేలా ఉంటాయని నర్మగర్భంగా కవయిత్రి అంశం వెలుగులో తమ భావాలను చక్కగా ఆవిష్కరించారు.

ఆనాటి రోజుల్లోనే

వెనుక చూపులు లేని
కాలంతో పోటీపడి
చక్రాలు కట్టుకున్న కాళ్లను
ఎప్పుడూ నిలిపే ప్రయత్నం
చేయ సాహసించక...
ఉరుకల పరుగుల జీవితాన్ని
ఉగ్గుతోనే ఒంట బట్టించుకొని
ఎందుకు ఏమిటి అన్న
ప్రశ్నలను కూకటి వేళ్లతో సహా
పెకలించి అవతల పారేసి
సాధించిన జీవితపు ఆనవాళ్లలో...
మనల్ని మనం వెతుక్కున్నప్పుడు
అందమంతా ఆవిరైన మోములో
ముడుతలు పలకరించి
ఎలా ఉన్నావు అంటుంటే...
తెల్లబడిన జుట్టు నన్నెందుకు
ఇలా చేశావ్ అని ప్రశ్నిస్తుంటే
సమాధానం లేని నిర్వేదపు నవ్వుతో..
తనను తాన అద్దంలో చూసుకుంటూ
అందాల లోకం కనులకు స్వర్గంలా కనిపిస్తూ
సమ్మోహనపు స్వరాలతో మైమరచిపోయిన
నాటి యవ్వనపు రోజులలోకి
ఉత్సాహపు రెక్కలు తొడుక్కుని ఎగిరిపోతే
ఎంత బాగుండు అన్న మనసుకు....
జీవితం అంటే తామరాకుపై
నీటిబొట్టే అని చెప్పాలని ఉంది
కాలంలో కనుమరుగైన నాటి రోజులను
వెనక్కి తెచ్చుకునే విద్య ఉంటే
ఎంత బాగుండేది అనిపిస్తోంది.

-పత్తిపాటి రూపలత,
తిరుపతి, చిత్తూరు జిల్లా

తిరుపతికి చెందిన కవయిత్రి పత్తిపాటి రూపలత గారు రెక్కలు తొడిగిన ఉత్సాహం అంశంపై ఆనాటి రోజుల్లోకి శీర్షికతో రాసిన కవితలో జీవితం అంటే తామరాకుపై నీటిబొట్టే అని చెప్పాలని ఉందంటూ గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తనను తాను అద్దంలో చూసుకుంటూ అందాలలోకం కనులకు స్వర్గంలా కనిపిస్తూ సమ్మోహనపు స్వరాలతో మైమరచి పోయిన నాటి యవ్వనపు రోజులలోకి ఉత్సాహపు రెక్కలు తొడుక్కుని ఎగిరి పోతే ఎంత బాగుండు అన్న మనసుకు .. కవయిత్రి జీవితమంటే తామరాకుపై నీటు బొట్టువంటిదని సర్దిచెప్పుకునే ప్రయత్నం చేశారు.

వెనుకచూపులులేని కాలంతో పోటీపడి చక్రాలు కట్టుకున్న కాళ్లను ఎప్పుడూ నిలిపే ప్రయత్నం చేసే సాహసం చేయలేక ఉరుకుల పరుగుల జీవితాన్ని ఉగ్గుతోనే ఒంటబట్టించుకొని ఎందుకు ఏమిటి అన్న ప్రశ్నలను కూకటివేళ్లతో సహా పెకలించి అవతల పారేసి.. సాధించిన జీవితపు ఆనవాళ్లతో మనల్ని మనం వెతుక్కున్నప్పుడు అందమంతా ఆవిరైన మోములో ముడుతలు పలకరించి ఎలా ఉన్నావు అంటుంటే.. అన్న పంక్తులు కవితలో ఒదిగిపోయాయి. గత జ్ఞాపకాలు గుర్తుచేస్తున్న క్రమంలో గతమే గొప్పదన్న భావం స్ఫురించేలా కవయిత్రి తమ భావాలను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. అద్దంలో మనలో మనం చూసుకుంటున్న క్రమంలో ఇప్పుడు తెల్లబడిన జుట్టు నన్నెందుకు ఇలా చేశావ్ అని ప్రశ్నిస్తుంటే నిర్వేదపు నవ్వే సమాధానమవుతుందని చెప్పడం బాగుంది.

మనల్ని మనం అద్దంలోచూసుకుంటూ అందాల లోకం కనులకు స్వర్గంలా కనిపిస్తూ సమ్మోహనపు స్వరాలతో మైమరచిపోయిన నాటి యవ్వనపు రోజుల్లోకి ఉత్సాహపు రెక్కలు తొడుక్కుని ఎగిరిపోతే ఎంత బాగుందంటూ మనసు

ఉవ్విళ్లూరడం సహజమని తేల్చిచెప్పారు. కనుమరుగైన కాలాన్ని తెచ్చుకోలేమని జీవితమంటే తామరాకుపై నీటిబొట్టులా తాత్కాలికమే అన్న విషయాన్ని నొక్కి చెబుతూ కవయిత్రి కవితావస్తువును విశ్లేషించే ప్రయత్నం చేశారు. గడచిన నాటి రోజులను వెనక్కి తెచ్చుకునే విద్య ఉంటే ఎంత బాగుండేదనిపిస్తోందంటూ చమత్కరించారు. అలతి అలతి పదాలను ప్రయోగిస్తూ కవయిత్రి కవితను తీర్చిదిద్దిన తీరు బాగుంది. భావాలను కూర్చడంలో వాటిని పంక్తుల్లో పేర్చడంలో ఇంకా సమన్వయం పాటిస్తే మరింత బాగుండేది.

అందమైన నక్షత్రం

నీలిరంగు ఆకాశంలో
అందమైన నక్షత్రంలా ఉండాలని
రెక్కలు తొడిగిన ఉత్సాహంతో
ఉవ్విళ్లూరుతున్నది నా హృదయం..
తొలిసంధ్యవేళలో..
భూపాళరాగం ఆలపిస్తూ
మది దోచిన చెలి తలపులలో తేలిపోవాలని
ఆరాటపడుతున్నది నా ఎద.
ప్రియ నెచ్చెలితో కలిసి
చక్కని ఊసులతో
ఊహలపల్లకిలో ఊరేగుతూ
నా ఊపిరికే ఊపిరైన
నా సౌగంధిక సన్నిధిలో..
అనురాగలతకు పందిరిలా
అనుబంధసీమకు మహారాజులా
ఉండిపోవాలని అనుకుంటున్నాను
చిలుకమ్మకై వేచిన గోరింకలా..

-కె.లలిత
ధర్మపురి

జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన కవయిత్రి కె.లలిత గారు రెక్కలు తొడిగిన ఉత్సాహం అంశంపై అందమైన నక్షత్రం శీర్షికతో రాసిన కవిత ఆద్యంతం రమణీయ భావాలతో కొలువుదీరింది. రెక్కలు తొడిగిన ఉత్సాహంతో నీలిరంగు ఆకాశంలో అందమైన నక్షత్రంలా మెలుగొందాలని ఉవ్విళ్లూరే హృదయాన్ని ఎత్తుగడలోనే కవయిత్రి అంశానికి బలం చేకూర్చేలా తమ భావాలను పొందుపరిచారు.

కవితావస్తువును విభిన్న కోణాల్లో ఆవిష్కరించే క్రమంలో కవయిత్రి ప్రయోగించిన పదబంధాలు చక్కగా కవితలో ఒదిగిపోయాయి. రెక్కలు తొడిగిన ఉత్సాహంతో తొలిసంధ్యవేళలో భూపాలరాగం ఆలపిస్తూ మది దోచిన చెలి తలపులతో ఆరాటపడుతున్నది నా ఎద అంటూ రాసిన పంక్తులు కవితాత్మకంగాఉన్నాయి. ప్రియనెచ్చెలితో కలిసి చక్కని ఊసులతో ఊహల పల్లకిలో ఊరేగుతూ నా ఊపిరికే ఊపిరైన సౌగంధిక సన్నిధిలో అనురాగలతకు పందిరిలా అనుబంధసీమకు మహారాజులా ఉండిపోవాలని ఉందని చెప్పడం బాగుంది.

కవయిత్రి శిల్పం విషయంలో చూపిన శ్రద్ధ ప్రశంసనీయంగా ఉంది. ఆకాశంలో అందమైన నక్షత్రంలా ఉండాలనీ.. తొలిసంధ్యవేళలో భూపాలరాగాన్ని ఆలపిస్తూ మది దోచిన చెలి తలపులలో తేలిపోవాలని ఆరాటపడే ఎదను కవితలో చక్కగా ఆవిష్కరించారు. చిలుకమ్మకై వేచిన గోరింకలా అనురాగలతకు పందిరిలా.. అనుబంధసీమకు మహారాజులా ఉండి పోవాలని ఆరాటపడుతున్న హృదయాన్ని అందంగా అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. కవితావస్తువు యింకా విశ్లేషిస్తే బాగుండుననిపించినప్పటికీ చిన్ని చిన్ని పదాలతో ఔచిత్యవంతమైన భావాలతో కవితావస్తువును కవితామయం చేయడంలో కవయిత్రి లలిత గారు సఫలీకృతులైనారు. సూక్ష్మంలో మోక్షంలా అక్షరాల కూర్పు చేసి అందరినీ అలరించడం అభినందనీయం.

నీడ

అస్తిత్వ చిరునామాగా
తనను తాను
ప్రకటించుకుంటుంది.
నీ వెంటే ఉంటూ
కదలికల జాడలను
గమనిస్తుంది.
కొన్ని సార్లు
దాని అంగలు
దూరాలను తాకుతుంటుంది.
మరికొన్ని సార్లు
ముడుచుకుపోతుంటుంది.
ఇంకొన్ని సార్లు
పాదాల కిందే నక్కుతుంటుంది.
బంధాలు
అనుబంధాలు
గెట్టు దాటేంత వరకే.
నీడే కదా! నీకు తోడుగా
మట్టిలో మట్టయ్యేంత వరకు.
జీవన నాటకంలో
ఈ పాత్రలన్నీ
ఎప్పుడో ఒకప్పుడు
అదృశ్య మవ్వక తప్పదు.
నీ వాళ్ళు కూడా
కాని వాళ్లు కావొచ్చు కొన్నిసార్లు.
ఒక్క నీడే నీ అసలైన నేస్తం.
జీవంలోనే కాదు
నిర్జీవంలోనూ
తన ఉనికిని చాటుతుంటుంది.
ఆశావహం
దానికి ఆరో ప్రాణం.
కష్టసుఖాలుకా
పడికుండలే కావొచ్చు!
ఎత్తుపల్లాలు సహజమే
అయ్యుండొచ్చు!
ఆనందంలో పొంగని
విషాదంలో కుంగని
స్థిర చిత్తం ఒక్క నీడదే.
ఎవరు ఎక్కడ దాకో
చెప్పలేకున్నా...
ఒకటి మాత్రం నిజం.
నమ్ముకున్న నీడ
వమ్ము చేయదెప్పుడు.

- డా॥పోరెడ్డి రంగయ్య
సెల్: 9948049864

జగిత్యాల మట్టిని పిడికిట వదలని కవి

'చరిత్రకు రక్తపాతమే ఉపోద్ఘాతం
చరిత్రకు చెమటబొట్టే ఆధారం
చరిత్రకు ఆకలే ప్రేరణ'

'కొమ్మ ఉండీ ఊగని
కొలిముండీ మండని
జీవితాలెందుకని'

'స్వయంగా శవాలే/ రాబందుల వద్దకి నడిచొస్తుంటే/ అంతకంతకూ పెరుగుతున్న అజ్ఞాన పర్వతం/ చిన్న బ్యాలెట్ పెట్టెలో ఇమిడి పోతే/ మళ్లీ కోటీశ్వరుడి పుట్టలోంచి/ బుస కొట్టేదే ఈ దేశపు ప్రజాస్వామ్యం'

'తమ్ముడూ పిడికెడు కల్లోలిత ప్రాంతాల మట్టిని తీసుకురా.. నాకు జగిత్యాల గుర్తొస్తుంది... జైత్రయాత్ర నను కలవరపెడుతోంది'– పట్నం వస్తున్న తమ్ముడితో అంటున్న అలిశెట్టి ప్రభాకర్ కవితా పంక్తులివి. బతుకు 'సిటీలైఫ్' లో చక్కర్లు కొడుతున్న మనసంతా పుట్టినూరు, కలం చేతిలో పెట్టినూరుతో నిండి ఘోషిస్తోంది. ఎక్కడున్నా అదే బాటలో ఎదుగుతూ ఎగదోస్తూ కల్లోలిత జగిత్యాల మట్టి మహత్తును తన కవితలకద్ది, తెలుగు నేలపై వెదజల్లాడు. ఆ వేడి చల్లారకుండా చూడమని అగ్నిగోళంలా మండుతూ అంతర్ధానమైనాడు. జనవరి 12 , 1954 నాడు పుట్టి నడీడునైనా చూడకుండానే అదే జనవరి 12 న 39 ఏళ్ల వయసులో మరణించాడు. మనిషిగా, కవిగా సగం రాసి సగం వదిలేసిన పుస్తకంలా తన కవిత్వాభిమానులకు ఎంతో వెలితిని మిగిల్చి వెళ్ళిపోయాడు.

వ్యక్తిగా ప్రభాకర్ చాలా చురుకైనవాడు. ధైర్యశాలి, స్నేహశీలి, హాస్యప్రియుడు. ఆయనలోని ధీరత్వం, చెడును నిలదీసే గుణం, విలువల కట్టుబాటు అన్ని కలగలిసి ఆయన మూర్తిమత్వానికి విలక్షణమైన వన్నె తెచ్చాయి. . బక్కపలచని శరీరమైనా అది భయమెరుగనిది. మనిషిని హోదాల కోణంలో తూకమేసి అవసరానికి మాట, మర్యాద మార్చడం, నటించడం ఆయనకు పరమ అసహ్యాలు. మనిషిలోని మంచిని, శ్రమని, గుణగణాలను గౌరవించడం ఆయనకిష్టం. ఈ లక్షణాల వల్ల కవిగా నిలబడక ముందు నుంచే ఆయనకు స్థానిక యువజనుల మధ్య ఓ ప్రత్యేక గుర్తింపు వ్యక్తిత్వపరంగా ఏర్పడింది. కవిత్వంలోనూ ఇవే లక్షణాలు ప్రస్ఫుటమై అక్షరాల్లోనూ తానే కనబడతాడు. ప్రభాకర్ వ్యక్తిగా కవిగా వేరు కాదు. అక్షరాల్లో తనను తాను చిత్రించుకున్నాడు. కవిగా గుర్తింపు కోసమో, నలుగురి మెప్పు కోసమో ఎన్నడూ తాపత్రయపడక, తన తల్లడింపును దింపేసుకోవడానికే కవిత్వాన్ని ఆశ్రయించాడు. వ్యక్తిగా ఎంతటి స్నేహశీలియో అదే రీతిలో కవిత్వం ద్వారా కూడా పాఠకుల గుండెలను తాకాడు. ఆయన అక్షరాలకు పలకరింపు తెలుసు. సాధారణ పాఠకుడిని సైతం పెనవేసుకొనిపోతాయి. ఈ కవిని చూడాలి కలవాలి కరచాలనం చేయాలి అనే ఆసక్తిని అవి కల్పిస్తాయి. అమెరికా తెలుగువాళ్లలోని సాహిత్యాభిలాషులు సెలవులపై ఇంటికి వచ్చినపుడు



హైదరాబాద్ లో అలిశెట్టి ప్రభాకర్ ను కలవడం వారి ఎజెండాలో ఒక అంశంగా ఉండేదని 'కౌముది' కిరణ్ ప్రభ అన్నారు. అక్కడ కూడా అలిశెట్టి సంస్మరణ సభలు జరుగుతుంటాయి.

తొలి అక్షరం నుండి శ్రామిక పక్షాన నిలుస్తూ వచ్చిన ఆయన కవిత్వానికి జగిత్యాల జైత్రయాత్ర సైద్ధాంతిక పునాదినిచ్చింది. అప్పటి నుండి తన అక్షరాల సాలును ఈ త్యాగాల పోరుకు జోడించాడు. **'చరిత్రకు రక్తపాతమే ఉపోద్ఘాతం/ చరిత్రకు చెమటబొట్టే ఆధారం/ చరిత్రకు ఆకలే ప్రేరణ'** అని గళమెత్తాడు. తుపాకీ మొన మీద జగిత్యాల ఉన్న రోజుల్లో సైతం **'కొమ్మ ఉండీ ఊగని/ కొలిముండీ మండని/ జీవితాలెందుకని'** తెగువతో ప్రశ్నించాడు. 'పీడితుల పక్షాన నిలిచి పోరుతున్న క్రమంలో నిస్సంకోచంగా నా కలమూ కుంచె రెండూ ఉంటాయ్' అని ప్రకటించి మాటకు కట్టుబడి బతికాడు.

ప్రభాకర్ దృష్టిలో కవిత్వం ప్రతిభా ప్రదర్శనో, పాండిత్య ప్రకర్షణో కాదు. అదో భావజాల వాహకం, యుద్ధ సన్నాహం. ఎప్పుడైతే ఆయన తన అక్షరం ఉద్యమానికి ఉత్ప్రేరకం అనుకున్నాడో అప్పుడే ఆయనలో ఓ తాపసి జనించాడు. ఈ గమనంలో కష్టాలు కంటకాల్లా తగులుతాయని తెలిసినా, ఈ ప్రయాణంలో అలసి సొలసి ఎక్కడ రాలిపోయినా బతుకు పోరులో భాగమే అనుకున్నాడు. కాలక్రమంగా ఆయన ఆస్తి, ఆరోగ్యం తరిగిపోగా కవిత్వం దేదీప్యమానమైంది. ఆ క్రమంలో అత్యంత స్పష్టత, పారదర్శకతలతో దేశ రాజకీయాల్ని నగ్నంగా నిలబెట్టాడు.

'స్వయంగా శవాలే/ రాబందుల వద్దకి నడిచొస్తుంటే/ అంతకంతకూ పెరుగుతున్న అజ్ఞాన పర్వతం/ చిన్న బ్యాలెట్ పెట్టెలో ఇమిడి పోతే/ మళ్లీ కోటీశ్వరుడి పుట్టలోంచి/ బుస కొట్టేదే ఈ దేశపు ప్రజాస్వామ్యం' అనే పంక్తులు నేటి దేశ రాజకీయ పరిస్థితుల నిగ్గు తెలుస్తాయి. యువత నిర్వీర్యత, మహిళ నిస్సహాయత, నేతల దుష్టపాలన ఆయన కావ్య క్షేత్రాలు. ఛీత్కారం, వేదన, సాహసం ఆయన అస్త్రాలు. మరో ప్రపంచమే ఆయన రాజీలేని స్వప్నం. ఆ సాధనలో నిర్విరామ సంగ్రామి అలిశెట్టి.

19 వ ఏటనే కలం పట్టి కవిత్వమే తన సామాజిక కర్తవ్యమని నమ్మిన ప్రభాకర్ పూర్తిగా దానికే అంకితమైనాడు. తన ఇరువై ఏండ్ల కవితా ప్రస్థానంలో ఎన్నడూ ఎక్కడా తన వ్యక్తిగత జీవన ప్రస్తావన తేలేదు. అయితే తన చివరి రోజుల్లో మాత్రం భార్య భాగ్యం ముఖంలోకి చూసి ప్రభాకర్ ఆవేదన చెందాడు. లంచ్ బాక్స్ లో తోటి విద్యార్థులు ఏమేమి తెచ్చుకుంటారో పిల్లలు చెబుతుంటే కళ్ల తడిని ఒత్తుకున్నాడు. తట్టుకోలేని మనోభారంతో తన మరణానికి ఆరు నెలల ముందు వచ్చిన 'సిటీలైఫ్' సంపుటిలో ముందుమాటగా తన ఎలిజీని తానే రాసుకున్నాడు. చావువేలు పట్టుకొని వెళుతున్న మనిషి చివరిమాటగా ఛిద్రమైన తన జీవితాన్ని ఇందులో చిత్రించాడు.

'నానాటికి దరిద్రమనే ఊబిలో దిగబడి, బహుశా ఏ పౌరుడూ పాత్రికేయుడూ పడనన్ని కష్టాలతో చితికిపోయిన నన్ను చివరకు హృదయం విప్పి నాలుగు మాటలు చెప్పుకోనివ్వండి.

ఒకప్పుడు పచ్చగా బతికినవాణ్ణి. ఇప్పుడు పత్రహరితం కోల్పోయి పిచ్చిమొక్కలా.. అస్థిపంజరంలా.. మందులు కొనుక్కోలేని నిర్భాగ్యపు నగరంలో ఊపిరితిత్తుల్లో క్షయ రాజుకోవడం వరిపాటైంది. నాలోని అరాచకం, క్రమశిక్షణారాహిత్యం వల్ల ఆరునెలల్లో అవలీలగా నయం చేసుకోవలసిన వ్యాధి అంచెలంచెలుగా ఎదిగి రెండు ఊపిరితిత్తులను పాడు చేసింది. ఆపాదమస్తకం నా దేహమే ఒక ఆసుపత్రి రోదనగా మారిపోయింది. పుట్టినగడ్డ నుండి ఇక్కడికి రావడమే పొరపాటైంది.'

ఇలా ఏ మాత్రం దాపరికం లేకుండా పంచుకున్న తన హృదయఘోషలో తప్పొప్పుల ప్రస్తావన ఉంది. నడమంత్రాన ముగియబోతున్న తన జీవితానికి తానూ ఒక కారణమేననే వేదన ఉంది. పదాల్లో నిజాయితీ, చిత్తశుద్ధి ఉన్నాయి.

నిజానికి ప్రభాకర్ అనారోగ్య దుస్థితికి ఆయన నిర్లక్ష్యం ఎంతుందో ఆకాశమంత ఆయన ఆత్మాభిమానం అంతకన్నా ఎక్కువుంది. మరోవైపు నీడలా నిలువెత్తు నిబద్ధత, పట్టు సడలని పట్టింపుల వల్ల సినిమావాళ్లు ఇంటికొచ్చి అడిగినా రాయను పొమ్మన్నాడు. ఇప్పటికే రాసినవి వాడుకుంటామన్నా కుదురదన్నాడు. 'ఎర్రని తేలు కుట్టిన మంటలాంటిది ఆకలి' అని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు గాని గీసుకున్న గీత దాటలేదు. ఎంత దగ్గరివారినుంచైనా సహాయం తీసుకొనేవాడు కాదు. 1990 లో అనుకుంటాను, ప్రభాకర్ తో కలిసి ఓసారి బజారుకెళ్ళినపుడు ఆయన కిలో బియ్యం కొంటున్నప్పుడు నాకు కళ్ళలో నీళ్లు తిరిగాయి. నోరు తెరిచి నేను పది కిలోలు కొంటాను అంటే ఆయన మళ్లీ జీవితంలో నా ముఖం చూడడేమోనన్న భయం నోట మాటను పెగలనీయలేదు. ఆయన నిర్ణయాలు ఎంత నిర్దయగా, పాషాణంలా ఉంటాయో స్వయంగా చూసిన అనుభవం నాది. రాంనగర్ లో తమ ఇంటికి దగ్గరగా ఉన్న ప్రభాకర్ ను వ్యక్తిగా, కవిగా గమనించిన ప్రసిద్ధ కవి ఎన్.గోపి ఒకే మాటలో 'ప్రేమలో దేవదాసులా వాడి జీవితం 'రెవల్యూషనరీ రొమాంటిసిజం' అని అప్పుడప్పుడు వాత్సల్యంగా గుర్తు చేస్తుంటారు. ఈ వాక్యం నిజంగానే ప్రభాకర్ కు సరిపోతుంది. కఠోర పర్యవసానాలను ఇష్టంగా భరించడమే కదా ఏ ప్రేమైనా!.

తెలుగులో ఇంత శక్తివంతమైన కవిత్వం ఇంగ్లీషులోకి అనువాదమైతే బాగుంటుందని పోయినేడు అలిశెట్టి సంస్మరణ వ్యాసంలో ఇదే పత్రికలో నేను ప్రస్తావిస్తే చాలామంది మద్దతుగా మాట్లాడారు. ఆ ఆశ కార్యరూపమయ్యేలా ప్రముఖ అనువాదకులు కె దామోదర్ రావు వందకుపైగా ప్రభాకర్ కవితల్ని ఆంగ్లీకరించారు. తెలుగేతర పాఠకులకు చేరేలా అలిశెట్టి మిత్రులు ప్రణాళికారచన చేస్తున్నారు.

చివరగా – చాలామంది మరిచిపోకుండా వేసే ప్రశ్న ప్రభాకర్ కుటుంబం ఎలా ఉందని. ప్రస్తుతానికైతే తెలుగు యూనివర్సిటీలో ప్రభాకర్ భార్య భాగ్యం ఒప్పంద ఉద్యోగం సర్వీసు ఇంకో నాలుగేళ్లు ఉంది. ఇద్దరు కొడుకుల్లో పెద్దోడు సంగ్రామ్ సంగీతం మాస్టారు. చిన్నోడు సంకేత్ సాఫ్ట్ వేర్ ఉద్యోగం. తల్లికి చేదోడుగా ఉంటున్నారు. ఈ మధ్యనే నగర శివారులో ఓ ఇల్లు కట్టుకుంటూ అందులోకి మారారు. 'ఒకప్పుడు పచ్చగా బతికిన వాణ్ణి..' అని బాధగా రాసుకున్న ప్రభాకర్ లేని ఆయన కుటుంబం మళ్లీ చిగురిస్తోంది. దశాబ్దాల పొడూతా దుఃఖం, విషాదాల్ని ఈదిన కుటుంబం ఒడ్డున పడుతోంది.

-బి.నర్సన్,
9440128169
(జనవరి 12 అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి)

సంక్రాంతి సందడి

పంటకోసిన చేలవలె
పట్టణాలన్నీ బోసిపోతున్నాయి
తననుచేరిన కుటుంబాలతో
విరగగాసిన చెట్ల వలె
పల్లెలన్నీ కళకళలాడుతున్నాయి
ఇంటికీచేరిన ధాన్యపు రాశులను
చూసిన రైతుఆనందం
అంబరాన్నంటింది
ఆకసాన మెరిసే చుక్కలన్నీ
చందమామలాంటి పాపాయి
శిరసున భోగిపళ్ళయినాయి
హేమంత హిమపాతానికి
ముడుచుకుంటూ ముంగిట
రంగవల్లులలో కన్నెపిల్లలు
పెట్టే అందాల గొబ్బిళ్ళతో
ఆడపిల్లలు అలంకరించే
బొమ్మలకొలువులతో
ఇంటికి వచ్చిన కొత్తఅల్లుళ్ళ సందళ్ళతో
పోటిపడి ఎగురవేసే పతంగుల కోలాహలంతో
బావా మరదళ్ళ సరసాల ఛలోక్తులతో
అమ్మచేసిన అరిసెలవాసనలతో
వాకిటముందు సందడిచేసే గంగిరెద్దులతో
హరిదాసుపాడే హరినామకీర్తనలతో
ఎటుచూసిననా హడివిడిగాసాగే జనం
తిరుప్పావై ప్రవచనాల భక్తిభావంతో
ఇంటింటా ఊరంతా
సంబరాల సంక్రాంతి సందడిచేస్తున్నది.

-డా.మైలవరపు
లలితకుమారి
9959510422.

స్వర్ణ సంక్రాంతి

ప్రకృతి మమైకం అయ్యి
వైజ్ఞానికంగా విలీనము అయ్యి సంస్కృతి తో
సౌరభాలు వేదజేల్లే పండుగ మన సంక్రాంతి
ఆకాశం లో పిల్లల ఎగరవేసే పాతంగులు
భూమి పై అతివలు వేసే ముగ్గులు
పౌషకలు మెండుగా నిండిన పిండివంటలు
గంగిరెద్దుల విన్యాసాలు
హరికథ కుల జీవమర్మం
ధర్మరాజు జూదాన్ని గుర్తు చేసే పండుగలు
బొబ్బెమ్మలు..ఎద్దులాటలు
తెలుగు తనం ఉట్టిపడే వస్త్రధారణ..
పాపాలను దాహించి వేసే బోగిమంటలు..
రైతుల ఇంట ధాన్యాసిరులు
సంఘజీవన సౌరభాలు ఇంటి ఇంటి ఆనంద డోలికలు
మంచిని పెంచి అనుబంధాలు విలువలు పెంచి
కరోనా ను కాపాడిన మన సంస్కృతి కొనసాగిద్దాం
ఉత్తరాయణ పుణ్యకాలంలో మానవతా పరిమలించి
కరోనా ఖతంఅయ్యి
బంగారు కాంతి కావాలి మన సంక్రాంతి

-వి.శేషారావు
9440408080

చక్కనైన సంక్రాంతి

రంగు రంగుల హంగులతో
సక్కనైన సంక్రాంతి సంబరాలు...
అంబరాన్ని తాకుతున్నాయి...
ప్రతి పల్లె పులకించింది....
సుదూరంలో వున్న కన్న బిడ్డల
మృదువైన పాదాలను
సుతారంగా ముద్దాడుతుంది
'పల్లె' మల్లోక్కమారు..!
ఊరికి ఉత్సవాలను చేసేందుకు
వస్తున్న కన్న బిడ్డలను చూచి
నేల తల్లి పరవశించింది
కనుమ కడుపరా కనువిందులిచ్చింది
పల్లె గాలి సోకగానే
చిన్ననాటి చిలిపి అల్లర్లు
మదికి మధురానుభూతినిస్తున్నాయి..!
అల్లంత దూరన చెట్టుపై...
కోకిలల కూ కూలు..
పక్షుల కిలకిలారావాలు..
పచ్చదనాన్ని పరుచుకున్న..
పొలాల పైరు గాలితో...
మంచు తూపరులు...
తనవుకు తాకి తన్మయత్వం చెంది
నూతనోత్సహంతో
ఉరకలు వేస్తుంది ఈ సృష్టి
ఓ జనసంద్రమై..!
'సంక్రాంతి' ప్రతి ఒక్కరికీ
తెలుగు హారతి.!
నూగు నూగుగా
తెలతెలవారే పొగమంచులు....
మయిమరిపించే జ్ఞాపకాలు
మదిని ముంచేస్తున్నాయి..!
పొద్దు పొడవక ముందే
పొగమంచులో భోగి స్నానాల
భోగములు.. అతివలు
ముద్దు ముద్ద

సంకురాత్రి

చుట్టలేని చాపను కప్పుతూ నల్లకప్పుల యవనిక
కమ్ముకున్న చీకటిలో మిణుగురుల మెరుపులు
దిగుడుబావిలో రెటీనా చుక్కలలో మెరిసిన తళుకులు
ధరణి గర్భంలో దాగిన రెక్కలు కప్పుకున్న పక్షి
తడిముద్దలతో రెక్కలు ఎదిగి నేల చీల్చుకు వస్తుందని
అణగారిన మనసులో మేరుగిరులంత ఆశలు
జాలిలేని వాయువు జవనాశ్వమయింది
నల్లని తెరను నలుదిక్కులకు విసరివేసింది
ఆకాశగంగ ఎగిరి శివుని సిగలోకి చేరింది
తన కడుపు కట్టుకుని పరాయి కడుపులు నింపే మనిషి
పూడిన బీజం తలెత్తుకోలేదని వేదనపడ్డాడు
కన్నీటితో కలసిన చెమట అవని మీదకు జారింది
వానతో తడవలేని నేల రైతు స్వేదంతో తడిసింది
చాలీచాలని బిందువులతో విత్తు వాడిపోయింది
కునుకు పట్టని కన్ను తిరిగి కలల తోరణాన్ని తొడుక్కుంది
నిన్నను మరచి, నేటిని వదిలి, రేపటికి నాగలి ఎత్తుకుంది
అవనికున్న సహనమే తన వారసత్వమంది
అంబుధి గుండెల సుడులే తనలోనూ దాగున్నాయంది
ప్రశాంతతనే కవచంగా చేసుకుని తల్లికి మ్రొక్కింది
కన్నబిడ్డ మీద ప్రేమను చంపుకోలేని నేలతల్లి
తన గుండెను నాగేటి పోటుకు ఎదురొడ్డింది
అలుపెరుగని అన్నదాత మరో ప్రయత్నం రూపుదిద్దుకుంది
ఆకలి తెలిసిన మనిషికి ఆకాశం సహకరించి
చిరుజల్లుల చిత్తడిని వరమిచ్చి
భూమిలోని బీజాన్ని నేలపైకి తెచ్చి
కంకుల కట్టలు కురిసి గాదెలు నిండితే చాలు
అదే మనకు వెలుగులిచ్చు శుభరాత్రి
మన కర్షకుని నవ్వే మనకు సంకురాత్రి

-శింగరాజు శ్రీనివాసరావు
-9052048706

అలుకుడు బోనం

అయ్య నాగలి కట్టిండు
వలపడ దాపడ దంచిడు
పొలం ఇరువాలు సాలు దున్నిండు
ఎత్తు మిర్రలు ఒత్తిండు
అవ్వ కొత్త బియ్యం తట్టన తెచ్చింది
పొయిరాళ్ళు రాజేసింది
కుండన బొనం వండింది
గులకరాళ్ళు, పువ్వులు పేర్చింది
అందరిని రమ్మని పిల్చింది
పచ్చనాకున నైవేద్యం పెట్టింది
పంటలు పండాలని మొక్కాము
అయ్య మొలక మండెను విప్పిండు
మొలకలను తట్టన నింపిండు
అలుకుడు నెమ్మదిగా చల్లిండు
పచ్చబువ్వ పరమాన్నం తిన్నాము
పదపదమంటూ ఇంటిదారి పట్టాము

-ఉంద్రాళ్ళ రాజేశం
9966946084

కుటుంబమే కోవెల

విశ్వ మానవాళికే యూనిట్
ప్రతి ఒక్కరి శాంతి నివాసం
సామరస్యాల స్వర్గధామం
షేరింగ్ అండ్ కేరింగ్‌కే చిరునామా
ప్రేమానురాగాల కోవెల కుటుంబమే !

అనుబంధాల సుగంధ పువ్వులు
ఆనందాలు విరబూసే చిరునవ్వులు
బాలల స్వేచ్ఛలకే అమృత తావులు
బాధలకు విడ్కోలు పలికే లేపనాలు
ఆదిగురువులే కొలువైన స్వగృహాలు !

కుటుంబాల అకారణ విచ్ఛిన్నాలు
కన్నీటి వరదల తీవ్ర ప్రవాహాలు
అశాంతి అగ్ని రవ్వల ఇంధనాలు
మనసును కలిచేసే అశుభాలు
కుటుంబాల ఉనికికే ప్రమాదాలు !

బేషరతు స్వచ్ఛంధ సహకారాలు
మానవీయ నిధుల ఆలయాలు
ఆప్యాయతల ఆశావహ దృక్పథాలు
వసుధైక కుటుంబ భావనలు
ఏకత్వ సాధన కేంద్రాలు ఫ్యామిలీలే !

నూతన సంవత్సర శుభ వేళలు
కొత్త ఆశలు చిగురించే ఘడియలు
ఏడాది ప్రగతి ప్రణాళికా రచనలు
పరస్పర సహకార మనో వికాసాలు
అందరికీ ఆధారమైన కుటుంబాలు !

ఒకే జీవితం, ఒక్కటే కుటుంబం
ఒకే అమ్మ, ఒక్కడేగా నాన్న
ఫ్యామిలీ ఆరోగ్యమే సర్వదా..
సమాజాభివృద్ధికి పునాదులు
శాంతియుత జీవన పుణ్యక్షేత్రాలు !

-మధుపాళీ
9949700037

ప్రేమాభివందనం

పుస్తక సమీక్ష

యెల్లి సుదర్శన్‌గారు ముంబాయిలో గొప్ప వాపారవేత్త సుప్రసిద్ధ బొంబాయి తెలుగు కవి. వ్యకిగా సుదర్శన్‌గారు పరోపకార పరాయణులు, స్నేహశీలి, అందరికీ ఆత్మీయులు.

'ప్రేమాంజలి' సామాజిక నవల అన్నారు రచయిత. ఇందులో అనాధగా పెరిగిన అంజలిని ఆ గ్రామంలో అందరూ తమ కూతురిలాగే ప్రేమించి ఆదరించారు. అంటే అంజలి వ్యక్తిత్వం ఎంత ఆదర్శప్రాయమైందో పాఠకుడికి అర్థమవుతుంది. ఆ గ్రామ సర్వతోముఖాభివృద్ధికి అంజలి చేసిన కృషి చెప్పాలంటే ఆ గ్రామమే మాట్లాడాలి.

రైల్లో ఒకే సీటులో ఇద్దరు సర్దుకు కూచోడంతో కథ మొదలై చివరికి ఆ ఇద్దరూ ఒకరితో ఒకరు సర్దుకుంటూ జీవితంలో ఒకటవటంతో ముగుస్తుంది.

ఇది ప్రేమ కథ కాదు. ఆదర్శప్రాయులైన యువతీ యువకుల జీవిత ప్రస్థానం. సుదర్శన్‌గారు సంభాషణలు ఎంత అద్భుతంగా రాస్తారో ఈ నవల చదివితే తెలుస్తుంది.

"ఇబ్బందులున్న వారికి సహాయ పడటం నా హాబీ (మానవత) అని అన్నాడు తను. "అవును జీవితంలో అలసిపోయిన నాకు మీరు కలువగానే ఒక రకమైన చైతన్యం కలిగింది. ఎన్నటికీ న్యాయం, ధర్మం, నశించదు. భగవంతుని నమ్ముకున్న ప్రతివారికి మంచే జరుగుతుంది' అంది ఆమె.

అతని పేరు ప్రేమ్ ఆమె పేరు అంజలి. ఇదే 'ప్రేమాంజలి' నవల. బాల్య వివాహానికి బలైన అంజలి, దుఃఖంతో గుండె జబ్బుతో మరణించిన తల్లి గ్రామ పెద్దలు అంజలిని అనాధశరణాలయంలో చేర్పించారు. అంజలి గ్రామ ప్రగతే లక్ష్యంగా, గొప్ప సేవా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు నిర్వహించారు. ఈ నవలలో మరో పాత్ర పెద్దమ్మ, మిలటరీలో చిన్న నౌకరి చేసి భర్త, కొడుకు సముద్రంలో కొట్టుకుపోవటంతో, ఒంటరిదై, అంజలికి అండదండగా, పెద్దదిక్కుగా, అంజలి దగ్గర ఉండిపోయింది.

సుదర్శన్‌గారు ఈ నవలని ఎంత బాగా నడిపించారు. పాఠకులు పుస్తకం మూయకుండా చివరిదాకా ఒకే బిగిని చదువుతారు. అలా చదివించేదే మంచి రచనకి నిదర్శనం.

అలనాడు సముద్రంలో కొట్టుకుపోయిన బాలుడు ప్రేమ్‌గా అంజలితో పాటు రైల్లో ఒకే సీటులో సర్దుకున్న యువకుడే ఈ పెద్దమ్మే అతని తల్లి అని చివరలో గుర్తించటం నవలలో మలుపు.

అంజలికి ఎందరో స్నేహితులు వారంతా విదేశాలలో స్థిరపడి కోట్ల



కొలది ధనం అంజలికి అందిస్తే దాన్నంతా గ్రామ పురోభివృద్ధికి వ్యయపరిచిన నిస్వార్థ సేవా పరాయురాలు అంజలి. నేటి యువతరానికి ఆదర్శంగా ఆ పాత్రని తీర్చిదిద్దారు సుదర్శన్‌గారు.

ఈ నవలలో సుదర్శన్‌గారి గొంతు చాలాచోట్ల వింటాం మనం. మన మంచి తనమే మనసు కాపాడుతుంది. మన సేవలు మన కిర్తీ చిరస్థాయిగా వుంటాయి. తల్లితండ్రులను, గురువులను గౌరవించాలి. మన మాతృభూమికి తనవంతు ఏమైనా చేయాలి.

"ఎక్కడ స్వార్థం అంతమో అక్కడ మానవీయత ప్రారంభం"

"నేను బాగున్నాను అన్నది ఆత్మ విశ్వాసం, నేనే బాగున్నాననేది అహంకారం"

తుల్జాపూర్ భవాని మాత సాక్షిగా ప్రేమ్, అంజలిల వివాహం జరిగింది. ఈ జంట సేవా కార్యక్రమాలు పరోపకార పరాయణత, మానవీయత ప్రధాన లక్ష్యాలు. జీవితం సాగించటానికి సిద్ధపడిన ఆదర్శప్రాయమైన భార్యభర్త లయ్యారు.

సుదర్శన్‌గారుగొప్ప మంచి మాట చెప్పించారు. ప్రేమ్ నోటంట. మనుష్యులకు మానవీయ విలువలు తెలియాలంటే భారత దేశానికి భగవంతుని వరప్రసాదం భగవద్గీత"

'ప్రేమాంలి' కన్నముందు మాధవి ఐ.పి.ఎన్. నవల రాసిన సదుర్శన్‌గారు నవలా రచయితగా సుప్రసిద్ధులే. వీరి కలం నుంచి ఆదర్శప్రాయమైన మరెన్నో రచనలు వెలువడాలని, పాఠకులకు బొంబాయి తెలుగు రచయితగా యెల్లి సుదర్శన్‌గారు సుపరిచితులై, కీర్తి ప్రఖ్యాతులు పొందాలని శుభాకాంక్షలు ఆశీసులు అందిస్తున్నాను.

ప్రతులకు:
యెల్లి సుదర్శన్ పద్మశాలి
302, బి వింగ్, గాంధారి టవర్స్
ఆఫ్- సాయాని రోడ్, ప్రభాదేవి
ముంబాయి-25. మహారాష్ట్ర
సెల్: 098924 11067

-ముత్తేవి భారతి
సెల్:9989640324

ఎవరికి సొంతం?

కన్నీరు కాదు ఎవరికీ సొంతం
మగ ఆడ తేడా లేదు ఏమాత్రం
మనసు గాయపడితే పొంగుతుంది కన్నీరు
మనసు ఎగసి పడితే కురుపిస్తుంది పన్నీరు
నది అయినా కడలి అయినా ఒక్కటే జలాశయం
దుఃఖమైనా సంతోషమైన ఒక్కటే కన్నీటిరూపం.
ఆకలి కడుపుకు తెలుసు కన్నీటి విలువ
అభిమానం దెబ్బతిన్న
మగవాడికి తెలుసు కన్నీటి విలువ
అనగద్రొక్క పడ్డ ఆడదానికి తెలుసు కన్నీటి విలువ
అత్యాచారానికి గురి అయిన
ఆడపిల్లకి తెలుసు కన్నీటి విలువ
వృద్ధాశ్రమంలో బ్రతికే వృద్ధులకు తెలుసు కన్నీటి విలువ
చెత్తకుప్పలో పడేసిన పసికందుకి తెలుసు కన్నీటి విలువ
ప్రేమించే హృదయానికి తెలుసు కన్నీటి విలువ.
కన్నీరు కాదు మానవునకు శాపం
కన్నీరు మనిషికి ఒక గొప్ప వరం
ఆ కన్నీరే,మదిలో తొలగిస్తుంది మనోభారం
మనశ్శాంతికి ఒక గొప్ప సాధనం
భావ ప్రకటనకు ఒక సాయుధం
మౌన పోరాటానికి గొప్ప ఆయుధం
అవ్యక్తమైన అభిమానానికి నిదర్శనం
అంతులేని ఆవేదనకు అదే సాక్ష్యం
ప్రతి మనిషికి తోడునీడైన నేస్తం
కన్నీటి విలువ తెలిసిన
జీవితమే జీవితం.

-కందాళం రజనీకృష్ణ
9487708043

తెర మరుగులోకి తెలుగు...

ఈ మాట యెందుకంటున్నానంటే నాప్రసంగవ్యాసం చదివింతర్వాత మీరే వివేకిస్తారు. ఆంగ్లమాధ్యమంలో చదువుకున్న వారికి విదేశాల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా వుంటాయని, తెలుగు మాధ్యమం నిరుపయోగమనే దురభిప్రాయం పెద్దల్లో ను పిల్లల్లోనూ నాటుకున్నది. సామాన్యుడు కూడా తన పిల్లలు చిన్నప్పటినుండి ఆంగ్ల మాధ్యమంలో నడుపుతున్న పాఠశాలలోనే చదవాలనే అభిలాష పడుతున్నాడు ఆలోచిస్తే విదేశాలలో ఉద్యోగం సంపాదించడానికి, ఇక్కడ ఒకటో తరగతి నుండి ఆంగ్లంలో అభ్యసించాలా లేక ఇంటర్ నుండి ఆంగ్లములో అభ్యసించాలా అనేదానికి సంబంధం లేనేలేదు. పదో తరగతి దాకా తెలుగు మాధ్యమంలో చదివిన తర్వాత ఇంటర్ నుండి ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్న ఎంతోమంది ఆంగ్లములో పట్టు సాధించి విదేశాలలో ఉద్యోగాలు చేస్తున్న వారు ఉన్నారు. అట్లని ఆంగ్ల మాధ్యమంలో చదివిన ప్రతివాడు అమెరికాలో ఉద్యోగం సంపాదించడమూలేదు. సామర్థ్యమే ముఖ్యం. అందుకు పట్టుదల ఉండాలి.

ఏ దేశంలో కూడా ప్రాథమిక విద్య మాతృభాషలో తప్ప వేరే భాషలో జరగడం లేదు. ఎందుకంటే ప్రాథమిక స్థాయిలోనే మాతృభాషను దూరం చేసుకుంటే ఆపైన ఎంత కష్టపడినా అది పర భాష లాగా నేర్చుకోవడానికి, మాట్లాడడానికి కష్టమవుతుంది. గాంధీజీ, రవీంద్రల వంటి మేధావుల అభిప్రాయం కూడా ఇదే. మాతృభాషలో విద్యాబోధన వల్ల గ్రహణ సామర్థ్యం ఉంటుందని, మాతృభాష తల్లిపాల వంటిదని, పరభాష పోత పాల వంటిదని వారు చెప్పిన మాటల్లో ఎంతో వాస్తవం ఉంది. అందుకే అభివృద్ధి పొందిన ఏ దేశములోనైనా మాతృభాష లో తప్ప మరో భాషలో ప్రాథమిక విద్య నేర్పటం లేదు.

ఇప్పటికే ఆధునిక పోకడలు అంటూ, ఆంగ్లం మీద అభిరుచి పెంచుకొని, మాతృభాషల స్వరూప స్వభావాలనే మార్చేసుకుంటున్నాము. ఆంగ్ల పదాలు ఎక్కువగా తెలుగు భాషలోకి చొరబడనాయి. పరదేశంలో ఉంటున్న ఇద్దరు తెలుగువారు కలుసుకుంటే, మాతృభాషలో పలకరించుకుంటారు కానీ, మాతృభూమిలో ఉండి కూడా మాతృభాషలో పలుకరించు కోడానికి మాత్రం న్యూనతగా భావిస్తున్నారు విద్యాధికులైన తెలుగువారు. ప్రముఖ రంగాలలో పేరెన్నికగన్న తెలుగు వారు కూడా వివిధ ప్రసార మాధ్యమాలలో పాల్గొనేటప్పుడు, బుల్లి తెరమీద ఇంటర్వ్యూలు ఇచ్చేటప్పుడు అరకొర గా ఆంగ్ల పదాలనే ఉపయోగిస్తుంటారు. ఆటల్లో, ఆటల మాటల్లో ఆంగ్ల పదాలే చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికీ ఆఫీసు కార్యాలయాల్లో తెలుగులో ఎవరితో సంప్రదించినా తక్కువగా చూస్తున్నారు. ఆంగ్లంలో మాట్లాడితే గౌరవిస్తారు. అందుకే అంటున్నాను తెలుగు వ్యవహారములొసగం చచ్చిపోయిందని.

ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి పేరుతో ఆంగ్లాన్ని అందలమెక్కించి, తెలుగు మాధ్యమాన్ని వద్దని, ఆంగ్ల మాధ్యమానికి ఆహ్వానం పలికినట్లు యితే తెలుగు పూర్తిగా తెరమరుగై పోతుంది.

ఇదే జరిగితే ఒకటి రెండు తరాల తర్వాత ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో యోచించమంటున్నాను. ఇంటా బయటా అన్ని వ్యవహారాల్లో, అన్ని స్థాయిల్లో, అన్ని వృత్తుల వారిలో, అందరి మధ్య, ఆంగ్లమే వ్యవహార భాషగా తయారవుతుంది. ఎప్పుడైతే తెలుగువాడు మాట్లాడే తెలుగు తెరమరుగవుతుందో, అంతటితో తెలుగు వాడు తాను తెలుగు వాడినని చెప్పుకునే అవకాశమే ఉండదు సరికదా తెలుగు వాడు అడ్రస్ లేని వాడు అవుతాడు. ఏజాతి ఉనికైనా దాని భాషతోనే ముడిపడి ఉంటుంది. భాషే జాతికి రూపం. తెలుగు నుడి తెరమరుగై, తెలుగు బడి తెరుచుకోనప్పుడు తెలుగు అనేదే ఉండదు. అభ్యసనమే ఆగిపోయినపుడు తెలుగు గ్రంథాలయాల గడప తొక్కే వాడుండడు. తెలుగులో కొత్త తరం రచనలు, ఆవిష్కరణలు, అంతర్జాతీయ సాహితీ సదస్సులు ఆగిపోవడమే గాకుండా, పాతతరం పుస్తకాలు పునర్ముద్రణకు నోచుకోవు. తెలుగు వైభవాన్ని చాటే ఆశు కవితలు, అవధానాలు, పద్య కవితలు, పద కవితలు, నవరసాలొలికే కావ్య ప్రక్రియలు కనుమరుగవుతాయి. జాతిని జాగృతం చేసే శతక సాహిత్యం, జానపదుల జావళీలు జనానికి దూరమయి పోతాయి. పసిడి పలుకులతెలుగు సామెతలు, ప్రబంధ సాహిత్య గొలుసు కథలు అదృశ్యమవుతాయి. ఉండినా వీటిని వినగలిగిన, చదవగలిగిన చేవ ఎవడికుంటుంది. ఆంగ్లమాధ్యమంతో ఇకపై ప్రతి తెలుగమ్మ తెలుగు వొడి, ఆంగ్ల వొడిగామారి పోతుంది. జోల పాటలు కూడా ఆంగ్లంలో పాడుతుంది. మాతృభాష మరణిస్తే ,మనమెవరికి వుట్టావో చెప్పుకోలేని అనాధ సంతతిగా మిగిలిపోతాము.

ఈ పరిస్థితి రాకూడదని విద్యావిధానంలో ప్రాథమిక స్థాయి నుండి పట్టభద్ర స్థాయి దాకా బోధనా భాషగా తెలుగు మాధ్యమం ప్రవేశపెట్ట బడింది. గ్రంథాలయ అకాడమీలు సాహిత్య అకాడమీ లు ఏర్పరచబడినాయి. ప్రజలభాషలోనే రాష్ట్ర పాలన జరగాలనేది ప్రజాస్వామ్యానికి అవసరమని భావించి అధికార భాషగా తెలుగును 1968సం. లోనే చట్టం చేసినారు. 1974లో అధికార భాషా సంఘం ఏర్పడింది. ఏళ్ళ తరబడి పోరాడి తెలుగుకు ప్రాచీన హోదాను సాధించు కున్నాము. మాతృభాషకు సముచిత స్థానం ఇవ్వడానికి భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినాయి. అయినా కూడా తెలుగుకు ఆదరణ తగ్గిపోతోంది. తెలుగు ఎప్పటికీ బ్రతికి ఉండాలనే ఆలోచనతోనే గిడుగువారు వ్యవహారిక భాషోద్యమానికి శ్రీకారం చుట్టారు. దేశంలోని ఇతర రాష్ట్రాల జనం వారివారి భాషల మనుగడకు, జాతి మనుగడకు ఇబ్బంది కలగకుండా కాపాడుకుంటూ అన్ని విధాలా పరభాషల ఆధిక్యాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుంటే, అలాంటి దృఢసంకల్పం, తెగువ, తెలుగు వాళ్లకు లేకపోవడం దురదృష్టకరం. ఆంగ్ల భాష అంతో ఇంతో అందరికీ అవసరమే కావచ్చు. అంతర్జాతీయ వ్యవహారాలల్లో ఆంగ్లం అవసరమనుకున్నా, అదే ప్రాధాన్యంగా తీసుకుని మాతృభాషనే మాయం చేసుకునే స్థాయికి ఏ జాతి దిగజారకూడదు . వ్యవహారంలో తెలుగు ఎలాగూ సన్నగిల్లుతోంది కదాయని పరన భాషగా కూడా లేకుండా చేసుకుంటే తెలుగజాతికి గుర్తింపు ఉండదు. ఆధునికత క్రిందనో ఉపాధి క్రిందనో నేర్చుకున్న పర భాష తెలుగునే మింగేసే స్థాయికి ఎదిగింది. కారణాలు అందరికీ తెలుసు. సరిదిద్దుకొని సఫలత పొందడం లోనే విఫలమవుతున్నాము. స్వార్థ ప్రయోజనమే ముఖ్యమనుకుని, వ్యక్తిగత ప్రయోజనానికి ప్రాముఖ్యతనిస్తూ, తెలుగు జాతి మనుగడకు భంగం కలిగించేటట్లుగా, తెలుగు భాషా వికాసాన్ని,దాని ప్రాచీన వైభవాన్ని,విచ్ఛిన్నం చేసుకుంటున్నాము.

సంస్కృత,ప్రాకృత పదాలతోబాటు అన్య భాషా పదాలనెన్నిటినో తనదైన వ్యాకరణ శైలిలో కలుపుకొని, తన బలాన్ని పరిపుష్టం చేసుకున్న తెలుగు, స్వతంత్ర సౌందర్య ప్రతిపత్తిని నిలుపుకుంటూపై కెదుగుతూ ప్రపంచంలోనే తీయనైన భాష గా గుర్తింపు పొందిన తెలుగు మనమాతృభాష. పలుకుబడులకు నుడి కారాలకు పుట్టినిల్లు మన భాష .కృష్ణరాయల అభిమానాన్ని చూరగొని, దేశ భాషలన్నింటిలో తెలుగు లెస్స అనిపించుకున్న భాష. భువన విజయ సాహిత్య సభను పాలించిన భాష తెలుగు భాష. గండపెండేరము తొడికించుకున్న భాష తెలుగు భాష. తెలుగు పాటలో సంగీతం, తెలుగు మాటలో మాధుర్యం, తెలుగు పద్యంలో నవరస నాట్య సరళి, ఇవన్నీ కూడా తెలుగు అజంత భాష గా ఉండబట్టే సాధ్యమైంది అందుకే "ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ "అని పొగడబడింది. బ్రౌను దొర అంకముమీద కొలువు తీరింది. ఇంతప్రాశస్త్యముతో పేరెన్నిక గన్న భాష గాబట్టే ,మనదేశంలో హిందీ తర్వాత తెలుగుకే గుర్తింపు లభించింది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే 9.3 కోట్ల మందికి ,స్థానికంగా చూస్తే 7.4 కోట్ల మందికి మధ్య వ్యవహార భాషగా ఉంటున్నది. ఆధ్యాత్మిక జ్ఞాన సంపత్తిని విశదంగా వ్యక్తం చేయడానికి, అనువైన, అర్థవంతమైన పదజాలము తో అర్హత సంపాదించిన భాష తెలుగు భాష. మత ప్రచారం కోసం మహమ్మదీయులు క్రైస్తవులు తెలుగు నే తేలికైన భాషగా అందమైన భాషగా ఎన్నుకొని,తెలుగు వాళ్ళ కంటే కూడా తీయగా ఆలపిస్తున్నారు. ప్రవచనాలిస్తున్నారు.

అన్ని భాషల కంటే విశిష్ట బాణీ కలిగిన విలక్షణ వాణి తెలుగు. ఇంతగా గుర్తింపు పొందిన మన తెలుగును మనం నిలబెట్టుకోకుండా నిర్లక్ష్యం చేస్తే, మన కన్ను మనమే పొడుచుకు న్నట్టు,మన నెత్తిన మనమే మన్నే సుకున్నట్టు అవుతుంది.

చిన్న పొట్ట నింపుకోవడం కోసం పేరాశ కల్పించుకొని, పెనుముప్పును తెలుగు జాతి మొత్తం మీద మోపడం భావ్యముకాదు. తెలుగుభాష భవితవ్యాన్ని బలితీయడం ధర్మం కాదు. ఇంగ్లీషు నేర్చుకోవద్దని ,నేర్పవద్దని ఎవరూ అనరు. కానీఏస్థా యినుండి మొదలుపెట్టి ఏస్థాయి వరకు ఆంగ్లంనేర్పితే తెలుగు మనుగడకు యిబ్బంది కలుగకుండా వుంటుందో ఆలోచించు కోవాల్సిన విషయం.

పాఠశాల స్థాయిలో ఇపుడున్న స్థితిని యిలాగే కొనసాగించి తెలుగు ఉనికిని దెబ్బతీయకుండా ఆంగ్లాన్ని కూడా అభ్యసింపజేయవచ్చు. మనసుంటే మార్గమూ వుంటుంది. అదనంగా ఆంగ్ల భాషను అభ్యసించాలని అభిలాష కల్గిన అట్టడుగు వర్గాల వారికిగాని మరెవ్వరికైనగాని,అదనపు సమయంలో అదనపు తరగతులు నిర్వహించే బోధకులను అదనంగా నియమించి తే సరిపోతుంది. ఆవిధంగా అనుకున్నవా రికి ఆంగ్లంపై పట్టు కల్గించవచ్చు. మనమూ మనప్రభుత్వం సవ్యంగా స్పందించి ఆలోచిస్తే పరిష్కారం చిక్కుతుంది. ఉచితానుచితాలు ఆలోచించకుండా తెలుగుజాతి ఉనికికే ఎసరుపెట్టే ఉపద్రవాన్ని తలకెత్తు కోకుండా తీర్మానించుకుందాము.

మాతృభాషను పరిరక్షించుకోవడానికి అన్ని దేశాలు అన్ని ప్రభుత్వాలూ ఆరాట పడుతున్నాయి . తెలుగు భాష పరిరక్షణ కోసం తెలుగు ప్రభుత్వం కూడా కంకణం కట్టుకొని, భాష పోషణ విషయములో జాగ్రత్తపడాలి. తెలుగు సాహిత్యకారులను ప్రోత్సహించి సభలు జరిపించి పుస్తకావిష్కరణలు చేయించి సన్మానిస్తుండాలి. అంతర్జాతీయ సాహితీ సదస్సు లకు, ప్రాంతీయ సదస్సులకు ప్రోత్సాహకమందించాలి.

తెలుగు ప్రాచీన సాహిత్య గ్రంథాలను కంప్యూటరీకరింపజేయాలి. తెలుగు రాష్ట్రానికి ఇరుగు పొరుగు రాష్ట్రాలలో కూడా తెలుగును బోధనావిషయంగా బోధించేటట్లు చేసి, వారి భాషలను కూడా తెలుగు రాష్ట్రంలో ప్రవేశ పెట్టాలి. డిగ్రీలతో సంబంధం లేకుండా హిందీ విశారద పరీక్షలాగా తెలుగు యూనివర్సిటీ నుండి ఒక సర్టిఫికెట్ కోర్సును నిర్వహింప చేసి అది కలిగి ఉన్న వారికి, ఉద్యోగ ఇంటర్వ్యూల సమయంలో కొన్ని మార్కులు జోడించే ఏర్పాటు కలుగ చేయాలి. మైసూరులోని తెలుగు అధ్యయన కేంద్రం లాగా తెలుగు రాష్ట్రంలో ఒక అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయాలి. ఇందుకోసం ప్రజలలో, ప్రభుత్వంలో, ప్రతిభావంతులలో సంకల్పంతో బాటు సన్నద్ధత ఉండాలి. అందరం తెలుగు వాళ్ళంగా తెలుగును, తెలుగు జాతిని ఉద్ధరించు కోవడం కోసం సన్నద్ధత చాటుదాం. తరతమభేదాలు లేకుండా కలిసి మెలుగుదాం.

-జై తెలుగు తల్లి
- జై తెలుగు వాణి

-కె.వి.రమణారెడ్డి.

అబల కాదు సబల (కథ)

ఎప్పటిలాగే సూర్యుడు ఉదయించే వేళ అయింది. కోయిలలు వాటి గానం మొదలు పెట్టాయి. చక్కని పైరు పై చల్లని గాలి వీస్తుంది. ఇలా ప్రకృతి తనదైన శైలిలో స్వాగతం చెపుతుంది. ఇంతలో ఒక పూరి గుడిసెలో నుండి ఒక పసికందు అరుపులు వినిపిస్తున్నాయి. జన్మనిచ్చిన తల్లి ఎంతో సంతోషంగా బిడ్డని ఆడిస్తుంది. ఇంతలో ఆ బిడ్డ తండ్రి వచ్చాడు. తనకు పుట్టింది ఆడపిల్ల అని తెలుసుకున్న అతడు భార్య మీద అలిగి వెళ్లిపోయాడు. ఆ తల్లి ఎంతో శోభించింది. కొద్ది సమయం తర్వాత తిరిగి తన మనస్సులో ధైర్యం నింపుకుంది. తన బిడ్డని ఆ తండ్రీ మెచ్చుకునేలా చేయాలని నిర్ణయించుకుంది.

ఇలా కాలం గడిచింది. ఆ పసికందు విత్తనం మొక్కైంది. ఆ మొక్క పరిమళించడం మొదలు పెట్టింది. ఆ తల్లి తన బిడ్డను ఆ గ్రామంలోని చిన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది. ఆ పాప పాఠశాలకు వెళ్ళటం మొదలు పెట్టగానే చుట్టుపక్కల కాకులు అరవటం మొదలుపెట్టాయి ". తిండికి గతి లేని కుటుంబానికి చదువుల ఆవసరమా ? అందులోను ఇంటి పని , వంట పని చేయలసిన అబలకి ఈ చదువులు ఎందుకు " అంటూ ఆ తల్లి బిడ్డల మనసులని బాణాలతో గుచ్చారు. కాని ఆ తల్లి ఏమాత్రం నిరాశ పడకుండా తన బిడ్డని చదివించుకుంది.

ఇప్పుడు ఆ మొక్క పెరిగి వృక్షమైంది. తన పై చదువుల కోసం పట్నం వెళ్లాలి. కాని చేతిలో చిల్లి గవ్వ లేని పరిస్తితి. అప్పుడు ఇంటి ప్రక్కనున్న సుబ్బారావు దేవుడిలా దిగివచ్చాడు. తన చదువులకు కావలసిన డబ్బులు సమకూర్చాడు. ఆ అమ్మాయి తన చదువులను పూర్తి చేసుకుంది. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ముందుకు సాగింది. ఇప్పుడు ఆ అమ్మాయి అందరి చేత సలామ్ కొట్టించుకునే స్థాయిలో ఉంది.

ఈ విషయం తెలుసుకున్న తండ్రి పరుగు పరుగున కూతురి దగ్గరికి వచ్చాడు .తనని క్షమించమని ప్రాధేయ పడ్డాడు .ఇప్పుడు ఆ కుటుంబం ఏ చీకు చింత లేకుండా సుఖ సంతోషాలతో వికసిస్తుంది. మళ్లీ ఎప్పటిలాగానే వారి జీవితాలో ప్రకృతి తనదైన శైలిలో స్వాగతం చెప్పడం మొదలుపెట్టింది .

సందేశం : ప్రతి ఒక్క ఇంట్లో ఒక సరస్వతి ఉంటుంది . వారిని మీరు గుర్తించి ప్రోత్సహిస్తే ఎన్నో విజయాలు సాధిస్తారు .

-దారం సరోజిని
7569162301

పూలే దంపతులు

చెట్టాలె ఎందరినో చేరదీశారు
గుట్టోలె అందరికీ గూడునిచ్చారు
ఆకులా అలములా ఆరోగ్య బందాలు..
బతుకమ్మ కొలువులా బంగారు తంగేడు
ఆడవాల్ల బతుకు తిప్పలు తప్పించు
హక్కుల్ని రక్షించి అందంగా మలిచారు
సంఘాలు స్థాపించి చైతన్య పరిచిరి
బల్లు తెరిపించి స్త్రీలల్లో భరోస నింపారు
ఇద్దరు కలిసి హితాన్ని కోరుతూ
అనాథ పిల్లలకు అండగా నిలిచారు
ఆటంక పరిచినా అనుకలే జనుకలే!
కులముకాదు గొప్ప గుణమని చాటుతూ
మంచిని పెంచి మమతను పంచారు
పోలె పోలె పూలే దంపతులు ఎటుపోలె!
పూలే పూలై
ప్రకృతి మాలై పరిమళిస్తున్నారు
ఆకాశంలో చుక్కల్లా వెలుగుతున్నారు
ఆరేసే బట్టలే సింగిడి చల్లే
అలుకే చినుకు!
మంచి గుండుమని అవ్వయ్యలా
మందలిస్తున్నారు!
పూలే బందం సంబంధం
అనుబంధం ఆదర్శం..



-దా పెరుక రాజు
7810032847

సరికొత్త ఊపిరి

సరైన గాడి లో పడేంతవరకే
బండి అయినా...బతుకైనా
గాలి నిండుగా ఉన్నంతవరకే
తిరిగేది చక్రమైనా...దేహమైనా

గతుకులు కుదుపులు లేనంతవరకే
కాలచక్రం సవ్యంగా తిరిగినంతకాలమే
బతుకైనా ప్రయాణమైనా సునాయాసంగా
ఎంతదూరమైనా సాఫీగా ఆనందంగా సాగే

బతుకే ఒక గాలి బంతుల ఆటయాక
ఊహకందని వ్యూహాలు మొదలయాక
గెలుపయినా ఓటమైనా పోరుసాగినంతకాల
వెన్నుచూపని ధైర స్థైర్యాలు కలిగుండాలి.

ఒకొక్కసారి మనిషి తలపులు
గోడకు కొట్టిన బంతులౌతాయి
ఎంతవేగంగా ముందుకెళతాయో
అంతే వేగంగా వెనుదిరుగుతాయి.

ఒక్కొక్కటిగా వస్తున్న కెరటాలు, భూతాలూ
భయపెట్టేవే బతుకును పక్కతోప పట్టించేవే
నిరాశా నిస్పృహలు దరి చేరనివ్వకకాలాన్ని
విపత్తులు దాటించమని స్వాగతించాలి

ఏవేవో ఆశలు సరికొత్త ఊపిరిని నింపి
ఏ దూరతీరాలకైనా,ఆశయాల దిశగానైనా
కొండంత బలాన్నిచ్చి ముందుకు నడిపిస్తాయి
స్వాగతం పూలబాటలో సాగటమే మనపని

-డాక్టర్ చక్రపాణి
యిమ్మిడిశెట్టి
9849331554

ర

ప్రోత్సాహం

మనిషి జీవితం మహోన్నతం
తప్పు ఒప్పులు జీవితంలో
కూడిక తీసివేతలు
వడ్డించిన విస్తరి కాదు
జీవితం
కష్టసుఖాల కలబోత
ఆనందం విచారం
వచ్చిపోయే బంధువులు
జీవితం ఓ సంఘర్షణ
ఉన్నత శిఖరం చేరాలంటె
కత్తి మీద సాము
చేయాల్సిందే!
జీవితం పూలపాన్పు
కాదెవ్వరికి
కష్టపడుతు కన్నకలలు
నెరవేర్చుకోవాలి
ఒక్కో మెట్టును అధిగమించాలి
ఉన్నత శిఖరాలకు
చేరుకోవాలి
కరుడుగట్టిన క్రమశిక్షణ
ఆత్మవిశ్వాసంతో
అడుగులు వేయాలి!

తప్పు చేయని వాడు
ఎవడుంటాడు లోకంలో
తప్పును దిద్దుకున్న వాడే
ఉత్తమ గతుల పొందును
నింద మనిషిని అచేతన
స్థితిలో జారవిడుస్తుంది
అర్థం కాని పాతాలంలోకి
నెడుతుంది
ఒక ప్రశంసా వాక్యం
ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది
అనుకున్నది సాధించే
మార్గాన్ని చూపెడుతుంది
అసాధ్యాలను సుసాధ్యం
చేసి చూపెడుతుంది
మనిషిలో సృజనాత్మకత
మేల్కొలుపుతుంది!

-కోణం
పర్శరాములు
9959524585

కామాదాహాన్ని కడిగేయాలి..!

ఎన్నో ఆశలను
మరెన్నో ఆశయాలను
గుండెగదిలో నింపుకొని
రెక్కలు తొడిగిన
నూరేళ్ల జీవితాన్ని
మొగ్గలోనే చిదిమేసే
కామపిశాచాల
కర్మ భూమా! మన దేశం..!

ఏ రాష్ట్ర మేగినా
ఎందు కాలిడినా
తోడేళ్ళ మందలా
మేకవన్నె పులుల్లా
నోరులేని పసివాళ్ళను
బలి తీసుకునే
కామాంధుల
వేద భూమా! నా దేశం..!

గుడిలో,బడిలో
బంధువుల ఒడిలో
కాల నాగులా
కాల యముడులా
పసి జీవితాలను
కాలరాస్తున్న
మానవ మృగాలు నడియాడే
పుణ్యభూమా! ఈదేశం..!

దేశం దుష్మీర్తిని
పోగొట్టాలన్నా
గోముఖ వ్యాఘ్రాలు పంజాలోని
చిన్నారులను కాపాడాలన్నా
ఆసేతు హిమాచలం
బడుల్లో,ఇంటింటా
విలువల విత్తులు నాటి
కీచకుల కామాన్ని కడిగేయాలి..!

-పిల్లి.హజరత్తయ్య
9848606573

జీవితం ఒక ప్రణయ గీతం

జీవితం ఒక ప్రణయ గీతం
ఈ పాట ప్రతి ఒక్కరు పాడాలి
జీవితం ఒక దుఃఖసాగరం
చిరునవ్వుతో ఆవలి ఒడ్డుకు చేరాలి.

జీవితం ఒక అందమైన భావన
విరిగి ముక్కలైన మనసుకు ఆలంబన
జీవితం ఒక అరణ్యవాసం
సహనంతో పూర్తి చెయ్యాలి
వనవాసం.

జీవితం ఒక దరహాసం
బాధాతప్తమైన మనసు పరిచయం
జీవితం ఒక అతిథి లాంటిది
ప్రపంచం వదిలి
వెళ్లాల్సిందే మనం.

జీవితం ఒక్కోసారి
నమ్మదగినదికాదు
అయినవారు
ఒక్కోసారి విడిచిపెట్టిపోతారు
వారు మనని వదిలిపెట్టినా కానీ
వారి జ్ఞాపకాలను
మోసుకుంటూ బ్రతకాలి
జీవితం ఒక ప్రణయ గీతం
ఈ పాట ప్రతి ఒక్కరు పాడాలి.

-అరుణ డేనియల్
9000606889

"నాన్న మాటను కాదన లేక పోయా" (కథ)

-దారం గంగాధర్
సెల్:9848384777

ఎంతో కష్టపడి నాన్న నన్ను ఉన్నత చదువులు చదివించారు. దాని ఫలితంగానే నేనీనాడు మంచి ఉన్నత స్థాయిలో ఉన్నాను.

మాకు ఆర్థిక ఇబ్బందులేమీ లేవు. అయినా నాన్న రాత్రనక పగలనక పనిచేయడం నాకంతగా ఇష్టమనిపించడం లేదు. పైగా నాన్నకు అరవై సం॥రాల వయసొచ్చేసింది. వృద్ధాప్యం వస్తోంది. దీనికి తోడు నా మిత్రులు శ్రేయోభిలాషులు నన్ను హేళన చేస్తున్నారు. "ఎందుకబ్బా! ఇంకా ఆశ. ఎంత కూడ బెట్టినా కట్టుకు పోలేంగా" ఇలా వారి మాటలు నా మనస్సును కలవరపెడుతున్నాయి.

మనసుండ బట్టలేక నాన్నతో పని మానేయమని చెపుదామనుకున్నాను. "నాన్న! నీవేం పని జేస్తున్నావ్. రాత్రి పగలు ఈ షిఫ్టులేమిటి? ఇంకా ఈ వృద్ధాప్యంలో ఎందుకు? మానేయ రాదా? మనకు ఆర్థికంగా ఇబ్బందులేమి లేవు కదా! ఇలా అనేక ప్రశ్నలనడిగి తన డ్యూటీని మాన్పించ అడగాలనే ఆత్రుత రోజు రోజుకు నాలో పెరిగిపోతోంది.

ఆనాడు యథావిధిగా చేతిలో సంచిని పట్టుకొని డ్యూటీకి బయలు దేరాడు నాన్న. ఎంతో తెగింపు చేసి అడగాలనుకున్నా తీరా తన ముందరికెళ్లేసరి కెందుకో నాలోని ఆ తెగింపు చచ్చుబడి అడగలేక పోయా. కానీ కనీసం తన డ్యూ టెక్కడో? ఏమిటోనైనా తెలుసుకుందామని పించి తన వెనకాలే మెల్లగా నాన్నకు తెలియకుండా చాటుగా బయలు దేరా..

తన వడివడి నడకతో ముందు కెళ్తూ ఓ సంధు మలుపు దగ్గరకెళ్లి, వెంటనే ఆటో రిక్షా ఎక్కి వెళ్లి పోయాడు దాంతో. తనను చేరుకోలేక నిస్పృహతో వెనుదిరి గొచ్చేశ ఇంటికి.

నాలో ఏదో పోగొట్టుకున్న తపన చెప్పలేని వెలతి, ఆవేదన, దీంతో అదే వేడితో ఇంట్లో అడుగు పెడ్తూనే "అమ్మా! అమ్మా" అని కాస్త చిరాకుగానే పిలిచా అమ్మని.

"ఏం బిడ్డా! ఏమైంది.." అని అడిగింది అమ్మ.

"ఏం లేదు. నాన్న రోజూ పొద్దునే ఎక్కడి కెల్తున్నాడు?" అని అడిగా "అదేం బిడ్డా! ఎన్నడూ లేంది ఈ యాల్ల గట్ల కొత్త గడగవడ్తివి. రోజూ ఎల్లే డ్యూటీకే.."

"అదే అదే ఆ డ్యూటే ఏం టటా! మనకేం తక్కువైందని నాన్ననింకా పనికి వెళ్లటం అవసరమా? వయసు మీద పడ్తోంది. నా స్నేహితులు సూటిపోటీ మాటలతో నన్ను ఎగతాళి చేస్తున్నారు. ఏరా నీ వైనా మీ నాన్నకు చెప్పలేవా? పని మానేయమని.." నా మాటలు పూర్తవక ముందే..

"అది కాదు బిడ్డా! నేను సుత సాన సార్లు జెప్పిన "సాలయ్య! సాలు. పని మానెయిండ్రి. మనకెందరున్నరు. ఒక్కగానొక్కడున్నడు. చేతికొచ్చిన కొడుకైండు వాడు గూడా సంపాదిస్తున్నడు. మనకు లేన్నాడంటే లేకపాయె గిప్పుడున్నా నీ మనసుకు కుదేం జేస్కోని ఆరాంతోని ఉండరాదయ్యా!" అని నేనంటే "ఓసి పిచ్చి రమణమ్మ! మనం లేమి తనంతో ఉన్న రోజుల్లో మనకు అండగా నిలిచిన ఈ పనిని మానేస్తే ఎట్లానే. గీ పనే కదా మన చిన్నాకు పెద్ద సదువులకు ఆసరాగా నిలబడింది. మన చిన్నాకు పెద్ద ఉద్యోగం రావడానికి తోవ చూపించింది. నేంజేసే గీ పని మనందరికి తల్లసుంటిదే. అయినా నే జేస్తున్నది ఏ తప్పుడు పని కాదు. నల్గురికి సేవజేసే పని. ఆత్మతృప్తితో చేస్తున్నది. నా ఒంట్లో సత్తువ ఇంకా ఉంది." అని గిట్ల పెద్ద మాటలు జెప్పే సరికి నాకేం అర్థం గాక గమ్మగున్నానుబిడ్డా".

"అది కాదమ్మా! చాలు ఇంకెన్నాళ్లు జేస్తాడు. మానేయ్యమని చెప్దామని..అంతే"

"ఏమో బిడ్డా! మీ నాన్న సాన మొండోడు. తాననుకున్నది తప్పక జేస్తడు. ఎవరు జెప్పినా వినడు. నీవు పుట్టంగానే పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయిద్దామన్నాడు. గానీ మీ నాన్నమ్మ, తాతయ్య, సుట్టాలు, బంధువులంతా "ఒద్దు బిడ్డా! ఒక్క కొడుకు కొడుకు గాడు, ఒక్క కన్ను కన్ను గాదని, ఆ ఉన్న ఒక్క కొడుక్కు ఆయుష్షు నిండి పోతే.." గిట్ల మస్తు తీర్ల సముదాయించిండ్రు. కానీ మొండి కేసి ఆఖరికి మీ నాన్ననే ఎవరికి తెల్వనీయకుండా తానే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నడు. తన మొండి తనం తనదే వితండవాది. అందరికీ ఒక్కటే జవాబు. "భూమొక్కటి కాదా? సూరుడొక్కడే కాదా? దేవుడొక్కడే కాదా? మా అమ్మనాన్నకు నేనూ ఒక్కణ్ణే కాదా?" గిట్ల పది తీర్ల సంగతులు చెప్పి అందరి నోర్లు మూయించిండు. గిదే కాదు అన్ని సంగతులకు తన మాటనే కావాలంటడు. గాయనని సముదాయించుడు నా వల్ల కాదు ఖన్నా!".

అమ్మ కూడా నాన్నకు వత్తాసు పలకడంతో చేసేదేమి లేక మిన్నకుండి పోయా. కానీ నాలో నాన్న చేసే పనేమిటో తెలుసుకోవాలనే ఆరాటం ఎక్కువైపోసాగింది రోజు రోజుకుఆలోచించి ఆలోచించి ఒక నాడు కాస్త పెందలాడే ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి నాన్న రాక కోసం ఎదిరిచూస్తున్నాను. రాగానే అడుగుదామనే గట్టి నిర్ణయంతో.

ప్రెషప్ అయి వరండాలో కొచ్చి కూచున్నాను. అమ్మ టీ ఇవ్వగానే చిప్ చేస్తున్నాను. అంతలోనే నాన్న వస్తున్నది అల్లంత దూరం నుంచే కనబడుతోంది. రెండు చేతుల్లో రెండు బరువైన సంచులు పట్టుకొని వస్తున్నాడు.

ఇది గమనించిన నేను తాగుతున్న టీని పక్కన పెట్టి నాన్న కెదురుగా వెళ్లి ఒక చేతిలోని బ్యాగ్ తీసుకుంటు "ఇదేంటి నాన్న ఇంత బరువు.." నా మాట పూర్తవక ముందే

"చిన్నా! ఈ రోజు మా పెళ్లి రోజురా.."

అన్న మాట వినీ వినకుండానే చిన్న పిల్లాడిలా గంతులేస్తు గబ గబ అమ్మదగ్గరి కెళ్లి "అమ్మా! ఈ రోజు మీ పెళ్లి రోజంటా.."

"ఓ అట్లానా నా కైతే ఏం యాది లేదు బిడ్డా.." అమ్మ జవాబు.

"సీతమ్మ పెళ్లి కూతురాయెనే. రామయ్య పెండ్లి కొడుకాయెనే" అని కూని రాగాలు తీస్తూ వరండాలోకొచ్చేశా. నాన్న సంగతి ఇవ్వాల తాడో పేడో తేల్చుకుందా మనుకున్నా కానీ ఇంత సంతోషకరమైన రోజు అడగటం భావ్యం కాదేమోనని నాకు నేను గానే ఆలోచించుకొని సైలెంట్ అయిపోయి, హాల్లో ఉన్న టీవీని ఆన్ జేసుకొని కూచున్నాను.

ఓ పదినిమిషాల్లోనే నాన్న స్నానం చేసివస్తూ "చిన్నా! మేము గుడికెళు న్నాం. నీవొస్తావా?" అని నాన్న అడుగుతుంటే

"లేదు నాన్న! మీరెల్లి రండి" అంటూ ముక్తసరిగా జవాబిస్తూ మళ్లీ టీవీ చూస్తు ఉండిపోయా.

నా జవాబులోని ఆంతర్యం గమనించినట్టు లేదు నాన్న. ఆ తర్వాత వాళ్లిద్దరూ కొత్త బట్టలు ధరించి కొత్త పెళ్లి జంటలా తయారయ్యారు. ఎప్పుడూ ప్యాంటు వేసుకొనే నాన్న చక్కగా పంచె, కుర్తా కండ్వాతో బాటు నుడుట బొట్టు పెట్టుకున్నాడు. అమ్మ పట్టు బట్టలేసుకొని పచ్చల హారాన్ని మెడలో వేసుకొని ముక్కెరను ధరించి సాక్షాత్తు లక్ష్మీ దేవిలా కనబడుతోంది. అమ్మా నాన్నలి ద్దరూ ఆది దంపతుల్లా కనబడ్తున్నారు.

అలా వారు గుడికి బయలు దేరి వెళ్లగానే టీవీలో వస్తున్న వరల్డ్ కప్ క్రికెట్‌ను చూస్తూ టీవీలో మునిగిపోయా. అంతలోనే అమ్మానాన్నలు తిరిగి రానేవచ్చేశారు. తీరా చూస్తే వారు వెళ్లి అప్పటికే గంట దాటి పోయినట్టుంది. టీవీలో మునిగిన నాకు గడిచిన టైమే ఏర్పడలేదు.

వాళ్లు వచ్చీ రావడంతోనే హాల్లో ఉన్న మా నానమ్మ-తాతయ్యల ఫొటోలకు మొక్కుకొని లోపలికెళ్లారు.

> "ఏం లేదు. నాన్న రోజూ పొద్దునే ఎక్కడి కెల్తున్నాడు?" అని అడిగా "అదేం బిడ్డా! ఎన్నడూ లేంది ఈ యాల్ల గట్ల కొత్తగడగవడ్తివి. రోజూ ఎల్లే డ్యూటీకే.."

అమ్మ ఏదో కమ్మని వంటకం చేసినట్టుంది. ఆ మధురమైన వాసనతో నా ముక్కు పుటలు ఎగిరి పడుతున్నాయి. ఆ రుచిని చూడ నాలుక ఉ వ్వీళ్లూరుతోంది. ఆత్రంగా డైనింగ్ టేబుల్ దగ్గరి కెళ్లి కూచ్చున్న. నాకు పాతికెళ్ల వయసొచ్చిన అమ్మ దగ్గర నేనిప్పటికి అమ్మకూచినే. నేనోగారాల బిడ్డను.

అంతలోనే నాన్న కూడా టేబుల్ దగ్గరికొచ్చి కూచ్చున్నాడు. తొందరగా వడ్డించమన్నట్లు. అలా ముగ్గురం డైనింగ్ టేబుల్ ఆక్రమించేసుకున్నాం భోజనం ఆరగించడానికి.

ముందుగా అమ్మ చేసిన స్పెషల్ పాయసం తింటున్నాం. నేను ఓ రెండు ముద్దలైనా తిన్నానో లేదో నాన్న నా వైపు తిరిగి చూస్తూ, "చిన్నా! నీ కేదో అనుమానమొచ్చిందట! ఏం చిన్నా! ఏందది! నాన్న ఇంకెన్నాళ్లు పనిజేస్తాడు? ఇంకా ఎందుకు కష్టపడటం? ఇలా ఇంకేవేవో అడగాలనుకున్నావట" అనుకోకుండా ఎదురైనా ఈ సిచ్చివేషన్‌కు నేను విస్తుపోయా.

నాన్న మాటలు నా నోట్లో వెలక్కాయ పడ్డట్టైపోయి. గొంతులో ఉన్న ముద్ద బయటకు రాక లోపలికి పోక మధ్యలో ఆగి దగ్గొచ్చేసింది.

ఇది గమనించిన అమ్మ వెంటనే నీటి గ్లాసును పెదవుల కందించింది. ఆ నీళ్లు తాగి గొంతు సవరించుకుంటూ **"అవును నాన్నా! నేను సంపాదిస్తున్నానుగా, మీరింకెన్నాళ్లు కష్టపడ్తారు. నాకు నెల జీతం బాగానే ఉంది. మనది చిన్న కుటుంబం, ఏ చింతలు లేని కుటుంబం కదా! మీకా వయస్సు మీద పడ్తోంది. ఇంకా ఈ వయస్సులో కూడా మీ నాన్నను పనికి పంపిస్తున్నావా?" అని నా మిత్రులు నన్ను ప్రతిసారి అడుగుతున్నారు, వారి ప్రశ్నలకు జవాబునివ్వలేక పోతున్న నాన్నా!...."**

> "ఏం లేదు. నాన్న రోజూ పొద్దునే ఎక్కడి కెల్తున్నాడు?" అని అడిగా "అదేం బిడ్డా! ఎన్నడూ లేంది ఈ యాల్ల గట్ల కొత్తగడగవడ్తివి. రోజూ ఎల్లే డ్యూటీకే.."

నా మాటలు పూర్తిగాక ముందే అందుకుంటు "చిన్నా! నీవడిగే దాంట్లో తప్పేమి లేదులే. కానీ మనం జేసే ఏ పనైనా మన కోసమే గాని మంది కోసం కాదు కదా! ముఖ్యంగా మన మనసుకు తృప్తి అనిపించే పనేదైనా చేయొచ్చు, ఎన్నాళ్లైనా చేయ్యొచ్చు. ఏ పని జేస్తే ఎంత డబ్బొస్తుంది. అని ఆలోచించే దాని కన్నా మనం చేసే పని పదుగురికి ఉపయుక్తమై, నచ్చినదై యున్నదైతే నిరంతరంగా చేయవచ్చు. నేను నౌకిరీ చేస్తున్నాననే దాని కన్నా నేనొక సేవ చేస్తున్నాననే భావన ఉండడం ముఖ్యం. దేశ సరిహద్దుల్లో రేయింబవళ్లు దేశ రక్షణకై చేస్తున్న సిఫాయి నౌకరీ అది నౌకరీగా చేయడం లేదు. మేము జాతి సేవ చేస్తున్నామనే భావన వారి నరనరాల్లో ప్రవహిస్తుంటుంది. అందుకే వారా వృత్తిని అంత అభిమానంగా ఇష్టంగా ప్రేమతో నిర్వర్తిస్తుంటారు. అలాగే జాతి నిర్మాతలైన ఉ పాధ్యాయులు, దైవ స్వరూపులైన వైద్యులు కూడా. ఇలా వీరందరి వృత్తి ఒక పవిత్రమైంది. వీరు చేసే వృత్తికి తగు పరిహారం దొరుకుతుందా లేదా అన్నది కాదు ముఖ్యం. వీరు సమాజాని కెలా ఉపయోగపడుతున్నారన్నదే ముఖ్యం.

అలాగే నేను చేసే పని కూడా నాకు పూర్తి ఆత్మ సంతృప్తిగా ఉంది. నాకెంతో ఆనందం కలిగించే దానిగా ఉంది. అందుకే వయస్సుతో నిమిత్తం లేకుండా నేనీ నౌకరీ చేస్తూనే ఉంట. లోకులు పలు కాకులు ఎవరికి తోచింది వారు మాట్లాడుతూనే ఉంటారు. ఎవరికేది తోస్తే అది అనేస్తారు. వాళ్ల మాటలు గనక మనం వింటే సమాజంలో బతకడం కష్టం చిన్నా!

అయినా నీవు నా క్షేమం గురించి ఇంతగా బాధపడ్తున్నావంటే నేను ఎంతో గర్వపడుతున్నాను. కన్నవాళ్ల బరువు బాధ్యతలు ఎరిగి వారి యోగక్షేమాలపై తపించే సంతానం నేడు చాలా తక్కువే చిన్నా!

రెక్కలు రాగానే ఎగిరిపోయే పక్షుల్లా ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి, పెంచి పెద్దజేసి, విద్యాబుద్ధులు నేర్పి ఒక మనిషిగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులను అనాథలుగా చేసి వదిలి వెళ్తే దిక్కులేని వయోవృద్ధులు ఎంతో మంది బిక్కు బిక్కు మని బతకడం లేదు జీవచ్ఛవాలుగా.

అయినా చిన్నా! నీ మనసునే మాత్రం బాధపెట్టను. నేను చేస్తున్న పనేమిటో నా నోటితో చెప్పను. నీవు నీ కళ్లతో స్వయంగా చూసిన తర్వాత "నాన్నా! నీవీ పని చేయ్యొద్దు అని అంటే అప్పుడు తప్పకుండా మారుమాట్లాడక మానేస్తా. నీవు గాక నా యోగ క్షేమాల గురించి ఆలోచించే వారు నాకెవ్వరున్నారు చిన్నా!

రేపు ఉదయమే నీవూ, నేనూ, మీ అమ్మ ముగ్గురం కలిసి వెళ్దాం. పాపం మీ అమ్మ కూడా అనేక సార్లు అడిగింది. నేను పని జేసే వివరాలు చెప్పమని. కానీ నేను సముదాయించగానే గమ్మునుండేది అమాయకురాలు. నీ అంత సాహసం చేసి అడగలేక పోయింది. నీవీ యాల్ల ఇంత ఖరాఖండిగా తెలుసుకోవాలన్న నిర్ణయానికి రావడంతో చెప్పక తప్పదు. అయినా నీలాంటి యువకులు తెలుసుకుని తీరాల్సిందే, ఆ పనేమిటో చూడాల్సిందే కూడ. నీవడిగినందుకు నాకెలాంటి బాధ లేదు , కోపం లేదు. పైగా చాలా సంతోషపడుతున్నాను. పైగా మంచి విద్యావంతుడివి. నీలాంటి వాడికి ఈ విషయాలు తెలియడం ఎంతో అవసరం కూడాను.

చిన్నా! రేపు ఉదయం భోజనం చేసే వెళ్దాం." నే జేసే పనేమిటో చూద్దువుగాని అని చెప్పి భోజనం కాగానే వెళ్లిపోయాడు నాన్న తన పడకగదివైపు మారు మాట్లాడకుండ.

నేను కూడా భోజనం ముగించుకుని లైవ్ క్రికెట్ వస్తుంటే టీవీ ఆన్ చేసుకుని చూస్తూ ఎప్పుడో నిద్రపోయా.

"చిన్నా! ఇంకా లేవలేదా" అన్న నాన్న పిలుపుతో గాని లేవలేదు. గోడకేసి ఉన్న గడియారం తొమ్మిది చూపిస్తోంది.

గబ గబ తయారై డ్యూటీ కెళ్దామని "అమ్మా! టిఫిన్ బాక్స్" అన్న నా మాట విని

"చిన్నా! ఇవ్వాళ్ల నీ డ్యూటీకీ మధ్యాహ్నం నుంచి వెళ్దువు గాని ఇప్పుడు నా డ్యూటీ వైపు. మీ ఆఫీసుకు ఉదయమే ఫోన్ జేసి చెప్పేశా" మా సాయి రాజాకు ఒంట్లో నలతగా ఉంది. మధ్యాహ్నం నుంచి వస్తాడని, అందుకని నీవు మధ్యాహ్నం నుండి వెళ్దువు గాని," అని నాన్న చెప్తుంటే.

"ఎందుకు నాన్న" అని నాన్న వైపు ప్రశ్నార్థకంగా చూశ ఇది గమనించి "అరే అప్పుడే మర్చిపోయావా ఇవాళ్ల నే పని జే.."

నాన్న మాటల కడ్డు చెప్తు" ఓ అదా! అది మళ్లెప్పుడైనా వెళ్దాం నాన్నా!"

''లేదు లేదు ఈ రోజే వెళ్దాం'' అని ఆజ్ఞాపించినట్టుగా నాన్న మాటలు నాకనిపించి

"సరే నాన్న మీ ఇష్టం" అంటు ముక్తసరిగా జవాబిచ్చ.

ఆ వెంటనే ముగ్గురం రెడీయై క్యాబ్ మాట్లాడుకొని నాన్న చెప్పిన అడ్రసుకు బయలుదేరాం.

చూస్తుండగానే ఓ ముప్పావు గంటలో ఆ అడ్రసుకు చేరుకున్నాం. దిగి క్యాబ్‌ను పంపించేసి చూద్దును కదా ఆ ప్రదేశమంతా ప్రశాంతంగా, ఎలాంటి శబ్ద కాలుష్యంగాని వాయు కాలుష్యం గాని లేకుండా ఉ ండటమే కాదు. ఆ ప్రదేశం పచ్చదనంతో పరవశింపజేస్తోంది. ఎత్తైన అశోక వృక్షాలు వాటికి పోటీ బడి పెనవేసుకున్న రంగురంగుల పూల తీగలు. ఎంతో విశాలంగ ఉంది ఆ ప్రదేశమంత. ఓ నాల్గడుగులు ముందుకు వెళ్లగానే అలనాటి కోట తలుపుల్లా పెద్ద ఎత్తైన గేటు. దాని ముందర పాత కాలపు జవాను లాంటి యూనిఫాంతో తుపాకిని చంకన వేసుకున్న గూర్ఖా, గేటు పైభాగం ఆర్చుపై త్రిభాషా సుత్రాన్ని పాటిస్తున్నట్లు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో పెద్ద పద్ద అక్షరాలతో వ్రాయబడ్డ బోర్డు, బోర్డుమీది అక్షరాలు "వయో వృద్ధుల ఆత్మీయ సదనం" అన్న అక్షరాలను చదువుతుండగానే

"నమస్తే లక్ష్మణ్ అన్నా" అని నాన్నను ఆ గూర్ఖా నమస్కరించగానే నాన్న కూడా అతినికి ప్రతి నమస్కారం చేశాడు. అలాగే అమ్మనూ నన్నూ కూడా పరిచయం ఉభయకుశ లోపరి, ఆతర్వాత లోపలికి ప్రవేశించాం.

లోపల అడుగు పెట్టీ పెట్టగానే నిండు వెన్నెల లాంటి పాలరాళ్లతో ఏర్పర్చిన కాలి బాట. ఆ బాట కిరువైపులా రంగు రంగుల, అనేక రకాల పూల మొక్కలు, అవి నిండుగా పూసి మెల్లగా వీస్తున్న గాలికి సుతారంగా ఊగుతూ ఉంటే రండీ రండీ అంటు తలలు వంచి స్వాగతం పలికే కొమ్మలుగా అనిపిసున్నాయి. లోపల ఆవరణలో కూడా ఏపుగా దట్టంగా లతలతో పెనవేసుకు పోయి ఉన్న వృక్షాల వరుసల మొక్కలు వింజామరలై చల్లగాలిని వీస్తున్నాయి. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఓ విశాలమైన హాల్లోకి అడుగు పెట్టాం.

లేత గులాబీ రంగుతో ఉన్న పెద్ద హాలు. అక్కడక్కడ గోడలకు నిలువెత్తు చట్రంతో బిగించి ఉన్న ఫొటోలు. మా అలికిడి వినగానే అందులో మంచాలపై ఉన్న వయోవృద్ధులందరూ ఒక్కసారిగా, ఎంతో వినమ్రతతో నమస్కారం, వణక్కం, గుడ్‌మార్నింగ్, నమస్తే, సలాం అంటూ పలు భాషల్లో నమస్కరిస్తున్నారు. దీన్ని బట్టి నాకర్థమైందేమిటంటే ఇక్కడ భాషా, ప్రాంతం, మతం అనే తేడా లేకుండా అన్ని వర్గాల వారున్నటున్నారని. వారు అలా తమ మాతృభాషల్లో మమ్మల్ని విష్ చేస్తుంటే నా హృదయం పులకరించి పోతోంది. అదేదో పెద్ద జాతీయ నాయకులకు స్వాగతం పలకినట్లుగా ఫీలైపోయాను. ఆ దృశ్యంతో నేను ఎంతో సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాను. ఈ స్థితిని చూస్తే నాన్నకు ఇక్కడ అపారమైన గౌరమున్నట్లు గోచరించిందినాకు.

ఏ ఒక్కనాడు కూడా ఇంటి దగ్గర గాని బయట గాని తన ఆహ భావాలను ప్రదర్శించలేదు. దీన్నే పెరిగిన కొద్దీ ఒదిగి ఉండటమంటారేమో. ఎంతో నిరాడంబరంగా ఎంతో సహనంగా ఉంటాడు. నాన్న వెనకాల అమ్మ నడుస్తుంటే ఒక మహాధి నేత ఇల్లాలిగా అనిపించింది అమ్మ. మాకు వెల్‌కం చెప్పే వాళ్లంతా కనీసం డెబ్బై సంవత్సరాలపై బడిన వృద్ధులే. ఆ దృశ్యాన్ని చూస్తుంటే నాకు తెలియకుండానే నా కళ్ల నుండి ఆనంద భాష్పాలు టపటప మని రాలుతూనే ఉన్నాయి.

ఆ కన్నీటి బిందువు లాపడానికి చేరుమాలు తీసి కళ్లనద్దుకొంటు మంత్ర ముగ్ధున్నై నాన్న ననుసరిసిస్తూనే ఉన్నాను. మారు మాట్లాడకుండా మౌనంగా. అలా ఓ అయిదు నిమిషాల తర్వాత ఆశ్రమ ఆఫీసు గది వైపు వెళ్లాం. అక్కడున్న వారు మమ్మల్ని చూసీ చూడక ముందే నమస్కారం చేస్తున్నారు వినయంగా. అక్కడి వారందరికి అమ్మను నన్ను పరిచయం చేశారు నాన్న. ఆశ్రమములోని అన్ని ప్రదేశాలను చూయిస్తూనే ఉ న్నాడు నాన్న. ఎక్కడ కూడా నన్ను పలకరివ్వకుండా అలా తను ముందుకు నడవడం. తన వెనుకాల అమ్మ నేను మాత్రం మంత్రించిన బొమ్మల్లా నాన్నను అనుసరిస్తూనే ఉన్నాం.

అలా వెళ్తున్న వాడినల్లా ఓ పెద్ద హాల్లో వేలాడదీసిన చిత్రాలు నా దృష్టిని మరల్చాయి. ఎంతో ఆకర్షనీయమైన అయిల్ పేంట్‌తో చిత్రించిన చిత్రాలు నజీవమైన ఆ చిత్రాలను కన్నార్పకుండా చూడాలనిపించింది. అందులో ఒకటి బాల యేసునెత్తుకొని నిలబడి ఉన్న మరియమ్మ ఆ ఫొటో కెదురుగా కరుణామూర్తి మధర్ థెరిస్సా, ఇంకో పక్కన పరుగెత్తుతున్న చిన్ని కృష్ణుడు ఆ బాలున్ని అందుకొన యత్నిస్తున్న యశోదమ్మ, ఆ ఫొటో పక్కనే వినీలాకాశంలో అర్ధచంద్రాకారంతో ఉన్న చంద్రుడు, ఆ చంద్రుని క్రింద రెండు చేతులెత్తి ప్రార్థిస్తున్న ఓ భక్తుడు. దీని కెదురుగా మౌన ముద్రలో కూర్చుని ఉ న్న గౌతమ బుద్ధిని చిత్రం. మరో చోట తన తల్లికి పాలు తాగుతున్న లేగ దూడా . మరో పక్కన తల్లి ఎదను హత్తుకుని ఉన్న ఓ పసిపాప. దాని పక్కే వృద్ధ దంపతులను కావడితో మోస్తున్న శ్రావణ కుమారుని ఫొటో. మరో చోట అందులను దివ్యాందులను రోడ్డు దాటిస్తున్న పాఠశాల విద్యార్థులు. మరో పక్క కుష్ఠు రోగులకు సేవలు చేస్తున్న దృశ్యాలు. ఇలా అనేక దయార్ద్ర కరుణా రసముట్టి పడే దృశ్యాలున్ను నిలువెత్తు ఫొటోలు ఫ్రేమ్‌లో బిగించి గోడలకు ఉన్నాయి. వాటిని చూస్తుంటే మరొకరు నోటితో చెప్పకుండానే కరుణా, దయ, ప్రేమ, అమృతనం కలిగి ఎంతటి కఠిన హృదయులైనా కరిగి పోగల దృశ్యాలు నా హృదయాంతరాలలోకి వెళ్లిపోయాయి.

అమ్మ నేను ఇద్దరం తదేకంగా ఆ చిత్రాలనే చూస్తూ, మాకు మేము మైమరిచి పోయాం. అంతలో ఆశ్రమ ఆఫీస్ బాయ్ వచ్చి, "కాఫీ సర్" అన్న పిలుపుతో గాని తేరుకోలేక పోయాం.

అలా కాఫీ తాగిన తర్వాత నేనొక్కణ్ణే హాల్లో ఉన్న వృద్ధులను పలకరించడానికని బయలు దేరా.

ముందుగా ఓ వృద్ధుని దగ్గరికెళ్లా నమస్కరిస్తూ "తాతయ్య! మీ పేరు.." అని అడిగా

"నా పేరా నా పేరు వనపర్తి శివరామయ్య"

"అది సరే తాతయ్య! మిమ్మల్ని కొన్ని విషయాలడుగుతాను చెప్తారా?"

"ఓ చెప్తా! ఏమడుగుతావో అడుగు.."

" ఏం లేదు తాత, మీరీ ఆశ్రమంలో ఎందుకున్నారు? మీకెవ్వరూ లేరా?"

నా మాట పూర్తవక ముందే "ఆ ఎందుకు లేరూ? ఉన్నారున్నారు. ఒక అబ్బాయి ఒక అమ్మాయి.."

"మరి.."

"అదే నే చెప్పబోతున్నా మా అబ్బాయిని ఉన్నత చదువుల కోసం స్టేట్స్‌కు పంపా. వాడిప్పుడు మంచి ఉద్యోగం సంపాదించుకొని అక్కడే స్థిరపడ్డాడు. అమ్మాయి కూడా మంచి చదువు చెప్పించి స్టేట్‌లోనే ఉండే అబ్బాయితో పెళ్లి చేశా. ఇప్పుడు నా ఇద్దరు పిల్లలూ స్టేట్స్‌లోనే ఉంటున్నారు. నాకేం తక్కువ. కోట్లకు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. నాకే...." అంటూ చెప్తున్న తాత

> "అదే నే చెప్పబోతున్నా మా అబ్బాయిని ఉన్నత చదువుల కోసం స్టేట్స్‌కు పంపా. వాడిప్పుడు మంచి ఉద్యోగం సంపాదించుకొని అక్కడే స్థిరపడ్డాడు. అమ్మాయికి కూడా మంచి చదువు చెప్పించి స్టేట్‌లోనే ఉండే అబ్బాయితో పెళ్లి చేశా. ఇప్పుడు నా ఇద్దరు పిల్లలూ స్టేట్స్‌లోనే ఉంటున్నారు. నాకేం తక్కువ. కోట్లకు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. నాకే...."

గొంతు జీరవోయింది.. తన కళ్లలో నీళ్లు నిండాయి. తన పరిస్థితి అర్థమైంది. ఇది గమనించి నేను ఓ నిమిషం నిశబ్ధంగానే ఉన్నా. ఆ తర్వాత తానే కలిగించుకుంటు " కానీ ఏం లాభం, అన్నీ ఉండీ ఏమీ లేని అనాథనయ్యా! నా అనే వారు నాకిక్కడ ఎవ్వరూ లేరు. కావాల్సినంత డబ్బు పంపిస్తారు. వీడియో కాన్ఫరెన్సులో పలకరిస్తారు. కానీ నా దగ్గరికి ప్రత్యక్షంగా వచ్చి నా నుదురు తాకి నన్ను స్పృశించి నా మనసును కుదుట పర్చే అదృష్టానికి నోచుకోలేను. టీవీ స్క్రీన్ మీద బొమ్మల్లా కనిపిస్తారే తప్ప వారితో మనసు విప్పి మాట్లాడిందే లేదు. నా లైఫ్ పార్టనర్

జీవితంలో వెలగాలంటే..!

ఆనందాలు ప్రవాహాలై
తనను చేరినా
కోరికలు గుర్రాలై
తనను పరుగెత్తించినా
గంభీర జీవనం సాగిస్తేనే
ఉత్తమ సాధకుడవుతాడు..!

కర్తవ్యమనే కార్ఖానాలో
కష్టాలు పలకరించినా
కార్యదక్షతనే నమ్మకంతో
లక్ష్యమనే శ్రమతో
అద్భుత ఉత్పత్తిని సాధిస్తే
స్థితప్రజ్ఞుడై వెలుగుతాడు..!

జీవిత పరిపూర్ణతకై
సంయమనం పాటిస్తూ
ఆత్మజ్ఞానం సాధిస్తే
జీవితం చరితార్థమై
శాంతి కుసుమాలను
అందుకో గలుగుతాడు..!

సముద్రపు అలలు వలె
ఎగిసి ఎగిసి పడకు
సముద్రం వలె
స్థిరంగా నిలిస్తే
లక్ష్యమనే గమ్యాన్ని
సాధించే స్థిరచిత్తుడవుతాడు..!

-పిల్లి.హజరత్తయ్య
9848606573

హైకూలు

పాత సంఖ్యలే-
కొత్తగా వాడుతూ
న్యూఇయర్

అర్ధరాత్రి
పుట్టిన రోజు కేకు
న్యూఇయర్

కొత్త సంవత్సరం
కోటి ఆశలు
కోరికలు తీరేనా

-చాపలమహేందర్
9949864152

నానీలు

అల్లికలలో
బహు ఇంటిలిజెంటు
మా ఇంటి
సాలె పురుగు.

రైతులపై
మొసలి కన్నీరెందుకు?
వారి హక్కులపై
ఉక్కు పాదం ఎందుకు?

-కయ్యూరు
బాలసుబ్రమణ్యం
9441791239

జీవనయానం

మిత్రమా....
మనిషి మనుగడ అంతులేని
ప్రయాణం,
సమాజంలో అడుగడుగునా
సమస్యల వలయాలే,
అవినీతి,అక్రమాలు,ఆక్ర
మణల బాటలే,
మహిళలపై లైంగిక వేధింపులు
అత్యాచార పెనుభూతాలు
సమాజం నిండా ....
వటవృక్షంలానాటుకొనున్నాయి,
ఓటుకోసం ఓటర్లకు నోటు చూపి
ప్రక్కదారి పట్టించే ప్రబుద్ధులు
తమ లక్ష్య సాధనకై
పరులను సైతం వేధింపులే,
నీ మనుగడ కోసం మరీ
ఇంతలా ప్రాకులాడి
స్వార్థంతో నడయాడకు,
నిప్పుతో ఆకలి మంటలు
తీర్చుకోవాలే గానీ
చితి మంటలు పేర్చుకోకు,
సగటు మనిషి మనుగడ
అంతంతమాత్రంగా ఉన్న
ఈ రోజుల్లో
నిత్యావసరాలధరల పెంపు
అమానుషం,
డిగ్రీలు చేతపట్టిన యువత తమ
మనుగడకై రోడ్లుపట్టి తిరుగుతున్నా
నిరుద్యోగసమస్యనుపరిష్కరించని
ప్రభుత్వ వైఖరి శోచనీయం,
తనయుల
నిరాదరణకులోనైన వృద్ధులకు
అనాథులకు,అభాగ్యులకు,
దయతో ఆశ్రయం కల్పించి
వారి మనుగడకై పాటుబడు.

-రాయవరపు
సరస్వతి
7989665525

హైకూలు

పాత సంఖ్యలే-
కొత్తగా వాడుతూ
న్యూఇయర్

అర్ధరాత్రి
పుట్టిన రోజు కేకు
న్యూఇయర్

కొత్త సంవత్సరం
కోటి ఆశలు
కోరికలు తీరేనా

-చాపలమహేందర్
9949864152

హేమంతహేల

మనసంత నిండుగ
మూడు రోజుల పండుగ
ముచ్చటైన పండుగ
కన్నులకు ఇంపుగ
హేమంత వేళ
పుష్యమాస ఉత్తరాయణంలో
మయూఖుడి మకరరాశి
ప్రవేశంతో వచ్చు పర్వం

ముత్యాల ముగ్గులు
రత్నాల రంగులు
ముంగిట మురియగ
భోగిమంటల వెచ్చదనంలో
బాలలకు భోగిపళ్లు పోయగ
హాయి గొలుపు భానుడి
కొంగొత్త కాంతి, సంక్రాంతి
సకల జనులకు క్రాంతి
పచ్చని పైరు,పాడిపంటలతో
పశు పూజే మలి
పండుగ కనుమగ
అలరారించు నిండుగ

నోములు నోతురు కొందురు
ఆహ్వానితులు ముత్తైదువ లందరు
వాయినాల వైనం
ఎంతో వైభవం

ప్రతి ఇంట జోరు
హరిదాసు కీర్తనల హోరు
గంగిరెద్దుల ప్రత్యక్షం
పిల్లల కెంతో ప్రత్యేకం
రంగుల పతంగులు
వినువీధి విహారం
అందరికెంతో ఆహ్లాదం

ప్రతిఇంట పాలపొంగు
ధాన్య సిరికి సూచిక
చెరుకు గడల తియ్యదనం
ప్రేమైక్య జీవనానికి సంకేతిక
కుటుంబ సభ్యుల కలయిక
ధనుర్మాస దండగ
ప్రకృతిలో పండుగ
సంక్రాంతి పండుగ

-సంధ్య సుత్రావె
9177615967

విచ్ఛిన్నమవుతున్న బంధాలను సరి చేసుకుందాం. మన జీవితాలను సమీక్షించుకుందాం!!!!!

ధరణి పై సర్వత్రా దయనీయమవుతున్న మానవ సంబంధాలను మసకబారనీయకుండా బలోపేతం చేసే దిశగా కుటుంబ బంధాలను సరి చేసుకుని, సమీక్షించుకొని, లోటుపాట్లను సవరించుకుని ధన్యులము అవుదామని మనసారా కోరుకుంటున్నాను.

ప్రపంచవ్యాప్తంగా మానవాళికి సంబంధించి మానవ సంబంధాలకు పునాది కుటుంబ సంబంధాలు .కుటుంబం అనే ఒక యూనిట్ ఎంత సవ్యంగా, సక్రమంగా, సంతోషంగా, సమన్వయంగా ఉంటే మానవాళి మనుగడ ప్రశ్నార్థకం కాకుండా ఆనందంగా గడిపే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది కానీ కుటుంబ బంధాల నే మరిచిపోయి స్వార్థ ప్రయోజనాలకు వ్యక్తిగత దాహానికి మనిషి బలి అవుతున్నాడు. అందుకే ఇప్పటికీ కుటుంబ దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన అటువంటి అనివార్యమైన పరిస్థితి ఏర్పడటం చాలా బాధాకరం.

కుటుంబం. లక్ష్యం సమాజ నిర్మాణం:-

మానవుడు సంఘజీవి అని అరిస్టాటిల్ చెప్పిన ప్రకారంగా సంఘజీవిగా మన కలగడానికి ఉండాలని విస్తృతం చేసుకోవడానికి కుటుంబమే ఒక పునాది. అందుకే దానికి విస్తృతమైన లక్ష్యాలు, వినూత్నమైన గమ్యాలు గమనాలు ఉన్నాయి. నిత్య జీవితంలో కుటుంబం యొక్క పాత్ర ప్రాధాన్యత లారా చూస్తున్న మనం చిన్ననాటి ఒకటి ,రెండవ తరగతి పుస్తకాల్లో కుటుంబం అంటే "ఒక ఇంట్లో ఉండేవారని కుటుంబం అంటారు,'' అనినిర్వచించిన విషయం గుర్తుండే ఉంటుంది.

ప్రేమానురాగాలకు ఆత్మీయత అనుబంధాలకు బీజం పడేది కుటుంబ వ్యవస్థలోనే. తద్వారా సమస్త మానవాళికి దాన్ని వర్తింప చేసే క్రమంలో మానవ సంబంధాలను కొనసాగిస్తున్నము.

ఒక చోట గండి పెడితే మిగతా అన్ని చోట్లా నష్టపోయినట్లు గా కుటుంబ బంధాలు విచ్ఛిన్నం అయితే మానవాళి మధ్య నుండి ఎటువంటి సజీవ సంబంధాలు కూడా దెబ్బతింటాయి దాని పర్యవసానమే నేడు ప్రపంచ వ్యాప్తంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాము.

కుటుంబ బంధాల విచ్ఛిన్నానికి కారణాలు

ప్రపంచ వ్యాప్తంగా ఉన్నటువంటి దుష్ట సంప్రదాయం యొక్క ప్రభావం మీరు భారతదేశంలో పడడం వలన తల్లి కొడుకు బిడ్డ కోడలు అనే బంధాలు క్రమంగా పలుచబడి పోతున్నాయి. రచ్చ దేశాలలో పిల్లలు ఎదిగిన తర్వాత తల్లిదండ్రులు పిల్లలు వేరుపడి పోవడం అనే సాంప్రదాయం తల్లికి పిల్లలు ఎవరో తెలియకుండా పోవడమే. అదే సాంప్రదాయం క్రమంగా భారతదేశం వంటి దేశాలకు కూడా విస్తరించడం వలన స్వేచ్ఛ విస్తరించి వ్యక్తిగత ఆకాంక్షలకు అవకాశం ఇవ్వడంతో సమిష్టి కుటుంబాలు వేస్ట్ కుటుంబాలుగా మారుతున్న దశలో ఆ అవకాశాలను స్వార్థపూరితంగా ఉపయోగించుకోవడం వలన ఉమ్మడి కుటుంబ సభ్యుల మధ్య కూడా సంబంధాలు లేనటువంటి దుర్మార్గపు పరిస్థితి నేడు భారతదేశంలో అందులో తెలుగు రాష్ట్రాలలో స్పష్టంగా కనబడుతున్నది.

కుటుంబ సభ్యుల మధ్య బలమైన ఎటువంటి సంబంధాలు లేకపోవడానికి ప్రధాన కారణం ప్రస్తుతం కొనసాగుతున్నటు విద్యా విధానము టివి సీరియల్స్ సినిమాలు సెల్ఫోన్ వ్యవస్థ వ్యక్తిగత పరిచయాలుకి దూరంగా ఉండటం కుటుంబసభ్యుల బంధాలను ఇష్టపడకపోవడం వృద్ధులు అయినటువంటి వారి పట్ల ఏహ్యా భావం ఇవన్నీ కారణాలుగా చెప్పుకోవచ్చు. ఇక ప్రధానమైనటువంటి కారణం తల్లి తండ్రి గా ఉన్నటువంటి ఆ కుటుంబ యజమానులు వృద్ధులైన తల్లిదండ్రులను పట్ల చూపవలసిన టువంటి జాలి దయ బాధ్యత కరుణ ఏమాత్రం చూపకుండా ఉంటది వాళ్లను చేసి హీనంగా చూడటం నేడు సమాజాన్ని కలవరపరుస్తున్న సమస్య. వృద్ధులైన తల్లిదండ్రులను పట్ల చూపుతున్న టువంటి వివక్షతకు కుటుంబ యజమాని తండ్రి 20 శాతం కారణమైతే స్త్రీ 80% పాత్రను పోషిస్తున్నది అనడంలో సందేహం లేదు.

తనకు నచ్చిన వారితోనే సంబంధాలు కొనసాగించడం తమ ఉన్నతికి కారణమైన టువంటి వృద్ధులైన అత్తమామలను అవమానించే ఒంటరి వాళ్లను చేయడం వాళ్ల సర్వత్రా ప్రతి కుటుంబంలోనూ కనబడుతున్న సమస్య.

అంతేకాకుండా కుటుంబంలో ఉన్న పిల్లలు తల్లి వైపు తండ్రి వైపు కొనసాగుతూ ఒక వర్గ దృక్పథాన్ని కొనసాగిస్తూ కుటుంబంలోనే రెండు వర్గాలను పెంచి పోషిస్తున్నటువంటి కుటుంబాలు అనేకం. కుటుంబంలో వృద్ధులైన వారిని అపరిచిత ప్రాంతాలలో విడిచిపెట్టి వచ్చి హాయిగా ఊపిరి పీల్చుకున్నటువంటి కుటుంబ యజమానులు కూడా ఎందరో? ఇలాంటి తప్పుడు పనులను పిల్లలు కూడా ప్రశ్నించకపోవడం మిగతా వారందరూ కూడా సమర్థించడం వలన కూడా కుటుంబ బంధాలు చిన్నాభిన్నం అవుతున్నవి. ఇది రక్షణ లేని సమాజానికి చుక్కాని లేని నావకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం నేపథ్యం:-

పైన చెప్పుకున్నట్లుగా పాశ్చాత్యదేశాల లోపల కుటుంబ సంబంధాలు బలంగా ఉండకపోవడం విడిపోవడం కారణంగా ఆ సాంప్రదాయాలు ప్రపంచంలోని ఇతర దేశాలకు గూడా విస్తరించడంతో కుటుంబ సంబంధాలు బలహీన పడినట్లే గా భావించి నటువంటి ఐక్యరాజ్యసమితి సమాజ ఉన్నతిని కుటుంబ బంధాలను మానవ సంబంధాలను ఆశించిన క్రమంలో 1993 మే 15వ తేదీన అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం ని ప్రకటించడం జరిగింది. నీరు గారి పోతున్నటువంటి మానవసంబంధాలను కుటుంబ సభ్యుల యొక్క బాధ్యతలను గుర్తింపు చేసే నేపథ్యంలో తోటి మనిషిని సాటి మనిషిగా చూసే ఒక ఉన్నతమైన ఆశయం ప్రపంచవ్యాప్తంగా కొనసాగాలనే ఐక్యరాజ్యసమితి ఆశయమే ఇందుకు కారణం అయ్యింది.

అప్పటి నుండి ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలలో ప్రతి సంవత్సరం ఒక్కొక్క అంశాన్ని ప్రధానంగా తీసుకుని కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలను పెంచే క్రమంలో కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నది.

భారతదేశం కొన్ని వివరణలు:-

కుటుంబ వ్యవస్థ బలంగా ఉన్నా సమాజానికి భారతదేశాన్ని గర్వంగా గొప్పగా ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పుకున సందర్భాలు గతంలో అనేకం. ప్రపంచ దేశాల యొక్క ప్రభావం భారత దేశం వ్యవస్థపై పడటం కారణంగా గత నాలుగైదు దశాబ్దాలుగా భారతదేశంలో కుటుంబ వ్యవస్థలో పగుళ్ళు ఏర్పడిన మాట పరిశోధకులు పరిశీలిస్తున్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో కూడా భారత దేశానికి దిగజారుడుతనం విస్తరించడం జరిగింది అనడంలో సందేహం లేదు.

విచ్ఛిన్న తను అరికట్టడం ఎలా:-

కుటుంబంలో వృద్ధులకు సంబంధించి రక్షణగా అనేక చట్టాలు వచ్చినప్పటికీ వాటిని అమలు లోపభూయిష్టంగా ఉన్న కారణంగా వారికి రక్షణ లేకుండా పోవడం వారిని వేయడం జరుగుతున్నది. దీని పట్ల ప్రభుత్వాలు మరింత శ్రద్ధ వహించాలి. చిన్ననాటి నుండే పిల్లలకు కుటుంబంలోని వ్యక్తులు ఇరుగుపొరుగు వారిని పరిచయం చేయడం ద్వారా తల్లిదండ్రులు చాలా క్రియాశీలకమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా కుటుంబ యజమానురాలు అత్తమామల పట్ల అతను వ్యవహరిస్తున్న విధానంలో వినూత్నమైన అటువంటి మార్పులను నేర్చుకోవలసిన అవసరం చాలా ఉంది తన తల్లిదండ్రుల లాగానే అత్తమామలను కూడా లని ఇంగిత జ్ఞానం లేని కారణంగా ఈ వివక్షత వల్ల ప్రతి ఇంటా వృద్ధులు కన్నీరు పెట్టక తప్పడం లేదు.

అవసరమైతే కుటుంబ సంబంధాలను బలోపేతం చేయడానికి తద్వారా మానవ సంబంధాలను విస్తృతంగా చేయడానికి ప్రభుత్వము ద్వారా మండల స్థాయిలో గ్రామస్థాయిలో చట్టబద్ధమైన కమిటీలను ఏర్పాటు చేస్తూ కుటుంబ మానవ సంబంధాలను సర్దుబాటు చేసే క్రమంలో అవసరమైతే చట్టము సహాయాన్ని కూడా తీసుకోవాల్సిన అవసరం ఉంది ఆ కమిటీకి చట్టబద్ధమైన ఎటువంటి అధికారాలు కూడా ఉండాలి.

ముఖ్యంగా మీడియా ఈ ప్రధానమైన పాత్రను పోషించాల్సిన అవసరం చాలా ఉంది అక్కడ అక్కడ జరుగుతున్నటువంటి కథనాలను తెలుపుతూనే మంచి కథనాలు రాయడం ద్వారా లేదా తగినటువంటి శిక్షలు లేదా వ్యాఖ్యలు చేయడం ద్వారా మంచి వ్యాసాలను రచనలను అందించడం ద్వారా కూడా మీడియా ఈ బాధ్యత నిర్వహించవలసిన అవసరం ఎంతగానో ఉన్నది.

టీవీ లో సీరియల్ లు సినిమాలు ప్రధానంగా కుటుంబ బంధాలు కేంద్రంగా కుటుంబ సంక్షేమం మానవ సంబంధాలు బలోపేతం చేసే దిశగా విప్లవాత్మకమైన మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉంది ప్రసారమాధ్యమాల్లో ఈ మార్పు ప్రభుత్వం కూడా తన యొక్క అధికారాన్ని ఉపయోగించవలసిన అవసరం ఎంతగానో ఉన్నది.

పాఠశాలల్లో ప్రధానంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రశ్నింప నేర్పడం ప్రశ్నించడం తమ అవసరాలను గుర్తింప జేయడం కుటుంబ బంధాల గురించి విలువైన విషయాన్ని సేకరించడం కథలు రచనలు పాటలు ద్వారా కుటుంబ సంబంధాల పట్ల వారికి సరైన అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతగానో ఉన్నది. అవసరమైతే ఉపాధ్యాయులు కుటుంబాలను సందర్శించి వారి ఇంటి లో ఉన్నటువంటి సాధకబాధకాలను పరిశీలించి తప్పుడు విధానాలకు పాల్పడుతున్న వారిని మందలించి చేయగలిగే విధంగా ఉపాధ్యాయులు కూడా సామాజిక బాధ్యత అధికారాన్ని కూడా ప్రభుత్వాలు ఇవ్వవలసిన అవసరం ఎంతగానో ఉన్నది.

ఎంత చట్టాలు ఉన్నా మనసున్న మనుషులుగా మానవత్వం ఉన్న వ్యక్తులుగా మనకు దిగజారుతున్న ఈ సంబంధాలను సమీక్షించుకోవలసిన అవసరం ప్రతి కుటుంబ సభ్యులపైన ఎంతగానో ఉన్నది. కేవలం సంపాదనకు మాత్రమే పరిమితమై కన్నవారిని గాలికి వదిలేసి బాధ్యతలు విస్మరించి మద్యపానం ధూమపానం ఇతరత్రా సామాజిక రుగ్మతల బారిన పడకుండా కర్తవ్యాన్ని నిర్వహించి ఈ క్రమంలో కుటుంబంలోని ప్రతి సభ్యుడు విద్యార్థులు వయసుమళ్ళిన వారు యువకులు తల్లిదండ్రులు యజమానులు అందరు కూడా తమ ప్రవర్తనను సవరించుకోవలసిన అవసరం ఎంతగానో ఉన్నది.

గత రెండు మూడు దశాబ్దాల క్రితం ఏ ఇంటికి వెళ్ళినా పెద్ద మనుషులు ఇంటిముందు కనిపించేవారు. ధైర్యాన్ని ఇచ్చేవారు. కథలు చెప్పేవారు. గతాన్ని విడమరిచి ధైర్యాన్ని నూరిపోసే వారు. ఇప్పుడు ఏ ఇంటికి వెళ్ళినా పిల్లలు మధ్య వయసు వాళ్లే కనపడుతున్నారు కనీసం మాట మాట్లాడడానికి కూడా సిద్ధంగా లేరు. అటువంటి పరిస్థితిలో పెద్దల సలహా తీసుకుంటామని, ఇంగిత జ్ఞానం లేని వ్యక్తులు ఉన్న ఈ సమాజంలో పెద్ద మనుషులను ప్రతి ఇంట్లో ఉంచుకుందాం వారిని వేరు చేయకుండా మనతోనే కలుపుకొని వాళ్ళ అనుభవాలను రంగరించి ఉందాం. మన జీవితాలను పదిల పరుచుకుందాం. ఫలవంతం చేసుకుందాము. ప్రతి ఒక్కరు ఈ వైపు అడుగులు వేస్తారని అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం వేల అందరికీ వినమ్ర విజ్ఞప్తి.

అంతర్జాతీయ కుటుంబ దినోత్సవ నేపథ్యంలో ...



-వడ్డేపల్లి మల్లేశము
9014206412

అల్లుడు

(సామాజిక కథ)

రాఘవయ్య కారుడోరు తీస్తూ అటువైపు చూడగా ఎవరో పెద్దాయన కూరగాయల సంచిని మోయలేక అవస్థలు పడుతున్నట్టుగా కనిపించి దగ్గరకు వెళ్ళి చూసి తన చేతిలోని సంచి తీసుకొని ఏమిటండీ ఈ వయసులో ఎవరి తోడు లేకుండ బయటకు వచ్చారు. పైగా ఇంత బరువు ఒక్కడివే ఎలా మోయగలరు రండి నా కార్లో కూర్చోండి మీ ఇంటి వద్ద దింపి వెళతాను అంటూ ఆప్యాయంగా పిలవడముతో కాదనలేక కారెక్కి ఇంటి దారి చూయించసాగారు. ఈ దారి మా ఇంటి దారెగదా అని మనసులో అనుకుంటూ ఇంటి వరకు చేరుకున్నారు తీరా చూస్తే ఈ మధ్యనే వారు ఎదురింట్లోకి అద్దెకు దిగిన వారుగా గుర్తించి మీకు వీలున్నప్పుడు మా ఇంటికి రండి ఇదే మా ఇల్లు అన్న రాఘవయ్యతో అలాగే బాబుగారు అని చెప్పి ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు.

రాఘవయ్య గారు ఒక సామాజిక కార్యకర్త.ఎదుటి వారికి సాయం చేయడంలో తనెప్పుడు ముందుటాడు. ఎవరినైనా ఇట్టే పలకరిస్తాడు. పరిచయం చేసుకుంటాడు. కానీ ఇప్పుడు దీనికి భిన్నంగా కారులో ఉన్నంత సేపు నిశబ్ద వాతావరణం నెలకొన్నది తనకు పిల్లలు లేరా ఉంటె ఎందుకు తనను ఒక్కరినే కూరగాయల మార్కెట్ కు పంపించారు ఇంత దూరం ఇంత బరువు ఒక్కడే నడుచుకుంటూ మోసుకొని ఎలా రాగలడు లాంటి ప్రశ్నలు తన మనసులో మెదులుతున్నాయి కానీ ఎందుకో అడిగే సాహసం చేయలేదు మరోసారి కలిసినప్పుడు పూర్తి వివరాలు తెలుసుకోవచ్చులే అనుకున్నాడు. మరునాడు ఉదయాన్నే కాస్త కాలక్షేపం కోసం అలా ఆరు బయట నడుస్తున్న రాఘవయ్యకు ఆ వ్యక్తి మరోసారి తారసపడ్డాడు భాగున్నారా అండి ఇంత పొద్దుగాళ్ళ ఎక్కడికి పోతున్నారు అనిఅడుగగా పెద్దాయన తన చేతిలోని టిఫిన్ చూపిస్తూ వేడి వేడి ఇడ్లీ అమ్మడానికి బయలుదేరానండి బాబుగారు అంటూ సమాధానమిచ్చాడు. మరి మా ఇంటికి కూడా రెండు ప్లేట్లు ఇడ్లీ పార్శల్ తీసుకురాగలవా అనగానే అలాగేనండి బాబుగారు ఇప్పుడు ఇవ్వమంటారా లేదా అలా ఊర్లోకి వెళ్లొచ్చి తీసుకురమ్మంటారండి. కాసేపు ఆగాకే తీసుకురా అని చెప్పి వెళ్లిపోయాడు.

గుమ్మం బయటనుండే బాబుగారండి... ఇదిగొనండి ఇడ్లీ తెచ్చానండి.... అంటు పిలుస్తున్న ఆ వ్యక్తిని లోపలికి రండి అంటూ తన ఇంట్లోకి పిలిచి కాసేపు అలా కూర్చోండి డబ్బులు తెచ్చి ఇస్తాను అనగానే వద్దు బాబుగారు మీరు నిన్న చేసిన సాయానికి ఏవిధంగా ఋణం తీర్చుకోవాలా అనుకుంటుంటే భగవంతుడు ఈవిధంగా మీ ఋణం తీర్చుకునే అవకాశం కల్పించిందుకు సంతోషిస్తున్నానండి మరోసారి తీసుకుంటాలెండి బాబుగారు అంటూ వెళ్ళబోతున్న పెద్దాయనతో మీ ఇంట్లో ఎవరు లేరాండి మీరే కనిపిస్తున్నారు మరెవరూ కనిపించడం లేదు ఈ పనులన్ని ఒక్కరే చేసుకుంటారా? అని రాఘవయ్య అడుగగా పెద్దాయన లేదండి బాబుగారు మా ఇంటావిడ అలాగే కొడుకు లాంటి అల్లుడు ఉన్నారండి నేను మార్కెట్ కు వెళ్ళి సామాను తెస్తే వారు వంట చేస్తారండి వాటిని నేను తీసుకెళ్ళి ఊర్లో అమ్ముకొస్తుంటాను వచ్చిన డబ్బుతో కుటుంబం నెట్టుకొస్తున్నాము అంటున్న అతని కళ్ళల్లో ఏదో తెలియని బాధ కనబడింది. మీ అల్లుడు ఉన్నారు అంటున్నారు మరి మీ అమ్మాయి ? మా అమ్మాయి లేదండి పెళ్ళైన కొన్ని రోజులకే మమ్ము విడిచిపెట్టి పోయింది. ఆ తరువాత మా అల్లుడే మాకు కొడుకుగా మారి మమ్మల్ని చూసుకుంటున్నాడు. విడిచిపెట్టి పోయిందా ఎక్కడికి ? ఎందుకు ? అదంతా చెప్పాలంటే పెద్ద కథ బాబుగారు. సరే చెబుతాను వినండి ..

ఇద్దరు వద్దు ఒక్కరు ముద్దు అన్నట్టు మేము ఒక్కరితోనే సరిపెట్టుకున్నాము. మాకు ఒక్కతే అమ్మాయి కాబట్టి అల్లారు ముద్దుగా పెంచాము చిన్నప్పటినుండి తను ఏది అడిగినా కాదనకుండా ఇప్పించాము చివరకు మా స్తోమతకు మించి కూడా ఇప్పించాము. అదే గారాబము తనలో మంకు తనాన్ని కూడా పెంచింది. ప్రస్తుతం పిల్లలు తల్లిదండ్రులు మందలించారనో ఉపాధ్యాయులు మందలించారనో తమ ప్రాణాలు సహితం తీసుకోవడానికి వెనుకంజ వేయడం లేదు కాబట్టి తను మా కళ్ళముందు ఉంటే చాలు అనుకొని సర్దుకుపోతు వస్తున్నాము. తను కాలేజి చదివే రోజుల్లో ఒకరోజు ఒక అబ్బాయిని ఇంటికి తీసుకువచ్చి నాన్న ఇతని పేరు రాము నేను ఇతడినే పెళ్ళి చేసుకుంటాను మీరు వేరే సంబంధాలు చూడవద్దు అని తెగేసి చెప్పేసింది. చేసేదేమి లేక కనీసం అబ్బాయి గురించన్న ఆలోచించాలి కదమ్మా అనగానే అబ్బాయి గురించి నాకు అంతా తెలుసు అయినా కాపురం చేసేది నేనా మీరా అని ప్రశ్నిస్తూ వాళ్ళ నాన్న గొప్ప బిజినెస్ మాన్ కోటీశ్వరుడు. వారికి నాలుగైదు కంపెనీలున్నాయి పైగా అబ్బాయి నాకు నచ్చాడు కాబట్టి ఇంక మీరేమి ఆలోచించవద్దు తొందరగా పెళ్ళి ముహూర్తాలు పెట్టించండి అని అబ్బాయిని తీసుకొని లోపలికి వెళ్ళింది. మాకు ఏమి చేయాలో తోచలేదు మాది పరువు గల కుటుంబం ఇతరులు ఎవరైనా చూస్తే బాగుండదని త్వరగా పెళ్ళి చేయాలని నిశ్చయించుకొని నిదానంగా అబ్బాయి గురించి ఆరా తీశాము అమ్మాయి చెప్పిన మాటలన్నీ నిజమేనని తెలిసినది. కానీ హోదాకు మించి వియ్యమందుకోడం ఎలా అని ఆలోచిస్తుంటే అబ్బాయి వారి తల్లిదండ్రులతో కలిసి ఒక రోజు మా ఇంటికి వచ్చి అంకుల్ మీరేమి ఆందోళన చెందకండి మీ అమ్మాయిని పైసా కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటాను అని భరోసా కల్పించాడు. కానీ నా మనసులో ఏదో తెలియని అలజడి అంత ఉన్నవారు మా అమ్మాయినే ఎందుకు చేసుకుంటున్నారో ఏమో. పైగా పైసా కట్నం లేకుండా చేసుకుంటానంటున్నారు. దీని వెనుక ఏమి మర్మం దాగిలేదు కదా అనుకుంటూ అంత భగవంతుడి దయ మంచే జరగాలి అని కోరుకుంటూ వియ్యమందుకోవడానికి సిద్ధపడ్డాము సరె ఇది బాగానే ఉంది కానీ వారి స్తోమతకు తగిన విధంగానైనా పెళ్ళి చేయాలి కదా, మరి దానికి ఎంత ఖర్చు అవుతుందో ఏమో అనే ఆలోచనలో పడిపోయాను. మరుసటి రోజు బాబు వచ్చి అంకుల్ మీరు పెళ్ళి ఖర్చు గురించి ఆలోచించకండి ఎందుకంటే పెళ్ళి ఎలాంటి హడావిడి లేకుండా రేపే రిజిస్టర్ ఆఫీసులో చేసుకుంటాము. అది కూడా కేవలం మన రెండు కుటుంబాల సమక్షంలోనే జరుగుతుంది అన్నాడు. అన్నట్లు వాటికి ఏర్పాట్లు చేసుకోవాలి మరి నేను వెళ్ళి వస్తానండి రేపు ఉదయం మీ అమ్మాయితో పాటు అక్కడికి రండి అని చెప్పి వెళ్లిపోయాడు.

మరుసటి రోజు ఉదయం పది గంటలకు అనుకున్నట్టుగానే రెండు కుటుంబాల సమక్షంలో రిజిస్టర్ ఆఫీసులో పెళ్ళి జరిగింది. అక్కడ నుండి మా ఇంటికి వచ్చాము ఏదో మా శక్తి మేరకు సారెతో మా అమ్మాయిని అబ్బాయికి అప్పగించాము. అలా వెళ్ళిన అమ్మాయి కనీసం మా ముఖం కూడా చూడడానికి తిరిగి రాలేదు. మేమే ఉండబట్టలేక ఒక రోజు చూడడానికి వెళ్ళాము కానీ మమ్ము పని మనుషుల కంటే ఎక్కువ హీనంగా చూసింది మాపై దొంగతనం అంటకట్టి మరీ అక్కడ నుండి పంపించి వేసింది. అత్తింటి వారు మంచి వారు కాబట్టి మమ్ము అర్థం చేసుకొని తననే మందలించారు. అది చూసి భరించలేక మా ఇంటావిడ మంచం పట్టింది ఆ రోజునుండి ఆవిడకు సేవ చేసుకుంటూ పెరట్లో పండిన కూరగాయలు అమ్ముకొని కొంతకాలం జీవనం గడిపాము కానీ తన ఆరోగ్యం రోజురోజుకు క్షీణించడంతో వైద్య ఖర్చుల కోసం ఇంటిని అమ్ముకోవలసి వచ్చింది అప్పుడే మా కుటుంబం వీధిన పడింది. మా అమ్మాయి కాపురం కొంతకాలం బాగానే జరిగింది ఆ తరువాత వేరు కాపురం పెట్టాలని పట్టు పట్టిందట వారికి ఒక్కడే అబ్బాయి కాబట్టి వారు అంగీకరించలేదు పట్టు పట్టి ఒత్తిడి తెచ్చి కంపెనీలు తన పేర రాస్తేనే వేరు కాపురం నిర్ణయం మార్చుకుంటానని చెప్పిందంట కన్న కొడుకును వదులుకోలేక కంపెనీలు వదులుకోవడానికి సిద్ధపడి అవి మా అమ్మాయి పేర రాశారంట అప్పటి నుండి క్లబ్బులు, పబ్బులు అంటూ తిరిగి కంపెనీలు నష్ట పోయేంత వరకు తెచ్చిందంట ఆ విషయం గురించే ఆలోచిస్తూ తన తండ్రి హార్టటాక్ తో చనిపోయారట ఆ దిగులుతో వారి అమ్మగారు మంచంపట్టి వారు ఈ మధ్యే కాలం చేశారట కంపెనీలు, ఇల్లు అమ్మిన అప్పులకే సరిపోలేదట. చిల్లి గవ్వ కూడా లేకుండ వారు రోడ్డున పడ్డారట డబ్బు పిచ్చితో అప్పటికైనా కళ్ళు తెరవని మా అమ్మాయి మరొకరితో వెళ్లిపోయిందట అల్లుడు మాత్రం చిన్న కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ ఒంటరిగానే ఉంటున్నాడట ఈ మధ్యే మేము గుడి మెట్ల దగ్గర తల దాచుకుంటుంటే అక్కడ మమ్మల్ని చూసి గుర్తు పట్టి ఇక్కడకు తీసుకువచ్చి ఎదురింట్లో అద్దెకు తీసుకుని మా కష్ట సుఖాలలో భాగం పంచుకుంటున్నాడు. ఉదయాన్నే ఆరు గంటల లోపే అన్ని పనులు చేసి వంటపని కూడా పూర్తి చేసి ఆఫీసుకు వెళ్ళి రాత్రి ఎనిమిది గంటల తర్వాత వస్తారు నేనేమో ఆ వంటలు అమ్మి వచ్చిన డబ్బుతో సరుకులు తెచ్చి మా ఆవిడకు సాయంగా ఉంటున్నాను. సరే బాబు గారు మీరు మాత్రమే కనిపిస్తున్నారు మరెవరూ లేరా ఆ..... ఆ..... గతంలో ఉండేవారు మీలాగే మాకు కూడా ఒక్కడే కొడుకు ఉండేవాడు. ఒక్కడే కొడుకు కదా అని గారాబంగా పెంచాము. ఆ గారాబము వలన చెడు వ్యసనాలకు లోనైనాడు ఎప్పుడు తాగుడు తిరుగుడే పనిగా పెట్టుకునేవాడు ఇంటికి ఎప్పుడు వస్తాడో ఎప్పుడు పోతాడో వాడికే తెలిసేది కాదు ఆ అలవాట్ల నుండి బయట పడేయడానికి పెళ్ళి చేయడమే మార్గం అనుకున్నాము. మా బంధువుల అమ్మాయి చిన్నప్పటి నుండి మావొన్ని ఇష్టపడిన అమ్మాయి బావను నాకు ఇచ్చి పెళ్ళి చేయండి నేను మార్చుకుంటాను అనడంతో సరేనన్నాము. కానీ ఒక రోజు ఎవరో అమ్మాయిని తీసుకొచ్చి తనే మీ కోడలు అన్నాడు ఏమి చేయాలో అర్థం కాక చేసేది లేక మేము కూడా అంగీకరించాము ఏదో రకంగా తనలో మార్పు వస్తదని ఆశించాము కానీ తనలో మార్పు రాకపోగా తరచు భార్యతో గొడవ పడేవాడు. కొన్ని రోజులకు కోడలు విసుగుచెంది విడాకులు ఇచ్చేసి మరో పెళ్ళి చేసుకొని వెళ్ళిపోయింది. అది తట్టుకోలేక ఇంకా ఎక్కువగా తాగి తాగి చివరకు మమ్ము విడిచిపెట్టి పోయాడు. కొడుకు తన కళ్ళ ముందే శివైక్యం పొందడం వలన బాధతో మా ఆవిడ మంచం పట్టింది. అప్పటినుండి నేను తనకు సేవ చేసుకుంటూ ఉన్నదానితో జీవితం గడుపుతున్నాము. అయితే మన ఇద్దరిది ఒకటే కథ అన్న మాటలేదు... లేదు.. మిమ్ము ఆదుకోవడానికి మీకు అల్లుడు ఉన్నాడు కానీ.... మాకు ఎవరు ఉన్నారు చెప్పండి. సరేలెండి మన విషయం పక్కకు పెట్టండి ఇకనైనా సమాజంలో మన మాదిరిగా ఇంకెవరూ పిల్లలపై అధిక ప్రేమ చూపి పిల్లలను దూరం చేసుకొని చివరి దశలో ఒంటరిగా ఉండకూడదని ఆశిద్దాం. అల్లుడు అంటే అదనపు కట్నం కోసం అత్తా మామలను తిడుతూ కొడుతూ చంపుతున్న సంఘటనలు కూడా అక్కడక్కడా చూస్తున్నాము. కానీ మీ అల్లుడు దీనికి భిన్నం ఇతడిని చూసైనా అలాంటి వారిలో మార్పు రావాలని కోరుకుందాం.

సమాజంలో మన మాదిరిగా ఇంకెవరూ పిల్లలపై అధిక ప్రేమ చూపి పిల్లలను దూరం చేసుకొని చివరి దశలో ఒంటరిగా ఉండకూడదని ఆశిద్దాం.

-చింతరెడ్డి
భాస్కర్ రెడ్డి
9701295200

కవితా

నేడు మనం భుజిస్తున్నా..

ఆహారమంతయు కల్తాయెను..
ప్రతి రోజును తాగుతున్నా..
పాలు కూడ కల్తవుతుండెను.
అన్నదమ్ముల అనుబంధము..
చెప్పలేనంతా కల్తాయెను..
ఆత్మీయుల ఆప్యాయతల్లో..
కనిపించని కుట్రలుండేను..
ఇరుగు పొరుగు వారి ముచ్చట్లో..
ఇసుమంత ప్రేమ లేకుండెను..
ఇచ్చి,పుచ్చుకున్నదే లేదు..
విలువలన్ని కల్తవుతుండెను..
మంచి మనిషులు లేకుండే..
స్వార్థమన్నది పెరుగుతుండెను.
నీతీ నిజాయితీ గాడితప్పె..
నియమాలేమో నీరుగారెను..
ప్రేమలన్నియు తక్కువైయె..
పగ ప్రతీకారలెక్కువాయెను..
ఉన్న ప్రేమలు కల్తవుతూ..
ఒకరినొకరు చంపుకుంటుండెను..

-పసుల.శంకర్
9542181301

కవినెట్టెతా

అక్షరాలను అల్లుకొని
పదాలను జుర్రుకుంటూ
నాల్గు వ్యాఖ్యలు రాస్తే
నేను కవినెట్టెతా..?
పొగడ్తలకు పొంగిపోక
విమర్శలకు కుంగిపోక
ఓటమి రుచిపాఠాలంలో
నిర్భయంగా చూడకపోతే
నేను కవినెట్టెతా...?
శూన్యం నుండి అనంతరం వరకుస
అమ్మ గర్భం నుండి అంతిమం వరకు
ఆర్థిక మత్తులో మొద్దుబారిన
మెదళ్ళను తట్టి లేపకపోతే
నేను కవినెట్టెతా...?
పురిటినుండే జ్ఞానాన్ని చూడలేని
ఆ కనులకు చిన్న దీపాన్నైనా ఇచ్చి
అఖండజ్యోతి వైపు
మార్గం చూపకపోతే
నేను కవినెట్టెతా..?
పెయినిండా పేరుకుపోయిన
స్వార్థంచ అశాంతి అహంకారాన్ని
ఇప్పటికైనా వదిలిపెట్టకపోతే
నేను కవినెట్టెతా..?

భోగిపళ్ళు

భోగిపళ్ళు పోయగ భామలార రారండి
సంధ్యా సమయమున సుదతులార రారండి.

సక్కని సేతులలో సూరీడంటి రేగిపళ్ళు
సిన్నారి తలలపై సిందులేయు భోగిపళ్ళు
బంతిపూలు కలిపిన బంగారం రేగిపళ్ళు
పసిపాపల దీవించు పసందైన భోగిపళ్ళు
భోగిపళ్ళు పోయగ భామలార రారండి.

కురులపై జాలువారు కమనీయ రేగిపళ్ళు
కుందనపు బొమ్మలపై కులుకులొలుకు భోగిపళ్ళు
మురిపాల చెక్కిళ్ళు ముద్దులాడు రేగిపళ్ళు
మగువల పాటలలో పరిమళించు భోగిపళ్ళు
భోగిపళ్ళు పోయగ భామలార రారండి.

దోసిళ్ళతో పోసేటి దోర దోర రేగిపళ్ళు
దిష్టితీసేటి దీటైన భోగిపళ్ళు
ముదితల చేతులలో ముత్యాల రేగిపళ్ళు
ముక్కోటి దేవతలు ఇచ్చేటి దీవెనలు
భోగిపళ్ళు పోయగ భామలార రారండి.

-కందాళం రజనీకృష్ణ
సెల్. 9487708043

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 408వ రోజు 'ముడుచుకుపోయే చలిలో మూడు పండుగల ముచ్చట' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'ముడుచుకుపోయే చలిలో మూడు పండుగల ముచ్చట' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా

- సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, *9441046839*

జాణగా వెలుగులీను

తే.గీ. పౌష్య లక్ష్మికి స్వాగత ప్రభలు పంచు
లేత కిరణాల రమణీయ పూత ప్రకృతి
సస్య రమ పులకించుచు హాస్యమాడు
తెలుగు సంక్రాంతి జాణగా వెలుగులీను!!.

-మాడుగుల నారాయణ మూర్తి

కం. గడగడ వణికించుటచే
ముడుచుకు పోయే చలిపులి ముగ్గుల వలపుల్
తడబడ తనువులు మనసులు
ముడివడు పండుగల తోడు ముచ్చుట మూడున్!.

మ. ధరనేనమ్మినరైతురాజుముదమున్ ధాన్యమ్మునింపారగా
మురిపెమ్మై తన బంధు మిత్రగణమున్ మోదమ్ములాలించుచున్
కరముల్ వెల్గుల తేలియాడు గృహముల్ సౌభాగ్య మానందమున్
సురలున్మెచ్చగ సంబరాలువరలున్ శోభించు సంక్రాంతియై!!.

నాలుగో రోజూ పండుగే..

తే.గీ. అపర కాశ్మీర ప్రకృతితో నతివలంత
పుష్య మాసపుటుదయాన భోగిమంట
వండు భోనాలు పొంగలి వైభవమ్ము
సంతసము జేయు హేమంత వింత ఋతువు!!

సీ. ధనువులై వంగుచు తనువుల తరుణులు
వాకిళ్ళ వర్ణాల పరుచుచుండ
కలలలో నూహల కల్యాణ ఘడియలు
తేనె భావాలను దించు ముగ్గు
కన్నియ చున్నీలు కటిలోన దోపుచు
రంగవల్లులు వేయ రాజసమ్ము
నవనవోన్మేష వనమయూరాలుగా
నాడు నవోఢల క్రీడ మనసు.

సంక్రాంతి సరదాలు

చలి పులిని తరుము
తొలి పొద్దు అంబులు !
చెడు తలపుల చితులు
భోగి మంటల సెగలు !
మార్తాండుని మకర ప్రవేశం
ఉత్తరాయణ తొలి దినం !
గాదె చేరిన ధాన్య రాశులు
కొత్త బియ్యపాయసాలు !
ఇంటిముంగిట రంగ వల్లులు
హరి దాసుల సంచార కీర్తనలు !
గంగి రెద్దుల వింత విన్యాసాలు
పడుచు పిల్లల పతంగి పందాలు !
కీడు తొలిచే భోగి పళ్ల దిష్టి తీతలు
కోడి పందాల వేడి గాలులు !
మినప గారెల పిండి వంటలు
కొత్త అల్లుళ్ల అలక పాన్పులు !
మూడు రోజుల సంక్రాంతి సరదాలు
తరతరాల చెదరని సాంప్రదాయాలు !.

- రామకృష్ణ చంద్రమౌళి

పేరులోనే ఉన్నది సం'క్రాంతి'

పండగ అంటే
ఎవరికైనా సంతోష సరాగాల సందడి
కుటుంబ సభ్యులంతా
ఒక్క దగ్గర చేరే తరుణమది
కొత్త బట్టలు ధరించి సంబరపడడం
వివిధరకాల తినుబండారాలతో
నోటికి పనిచెప్పడం
గుడులను సందర్శించుకోవడం
ఆపై సినిమాలూ షికార్లకు
చెక్కేయడం ఆనవాయితీ
తెలుగువారు జరుపుకునే
ముఖ్య పండుగ సంక్రాంతికి
ముందురోజు భోగి
తరువాత రోజు కనుమను కలుపుకొని
ముడుచుకు పోయే చలిలో
మూడు పండుగల ముచ్చట అచ్చట్లలో
ఎవరికి తప్పినా
ఇల్లాలికి తప్పని ఈతిబాధల కుంపటి
చలికి లేవలేక ముసుగుదన్ని పడుకుంటే అందరూ
వారు లేచేసరికి పనులన్నీ పూర్తి చేసి
టీ, టిఫిన్లతో రడీగుండాలి జరూరూ
పైకెవరూ చెప్పకున్నా
పడతులనాలి ఎప్పుడూ జీ హుజూరు
ముస్తాబైన ముంగిళ్ళు
మదిని మురిపిస్తుంటే
అందంగా తయారైన గంగిరెద్దులు
తమ విద్యలను ప్రదర్శిస్తుంటే
ఎన్ని రకాల పిండివంటలు చేసుకున్నా
పులగమూ, సకినాల సంప్రదాయంతో
మంచుతో నిండిన ప్రకృతి అందాలను
ఆస్వాదించే సంక్రాంతి!
నీ పేరులోనే ఉన్నది సం'క్రాంతి'

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

నవక్రాంతి

వణికించే చలి
అయినా సంబరమే..
ఇంటికీచేరిన ధాన్యపు రాసులు
ఇంటిముందు రకరకాల ముగ్గులు
ముగ్గులమధ్య
పూల తో అలంకరించిన గొబ్బెమ్మలు
హరిదాసుల కీర్తనలు
ఇంటిముందు నిలిచిన
గంగిరెద్దులు
పిండివంటలు
గాలిపటాలు
ఎగరేస్తూ పిల్లలకేరింతలు
సంక్రాంతి మూడురోజుల పండగ
ఒక్కోరోజు ఒక్కో విశిష్టత
భోగిరోజు భోగిమంటలు
సంక్రాంతి రోజు పొంగలి
పితృ దేవతారాధన
కనుమరోజు పశువుల పూజ..
ఉత్తరాయణ పుణ్య కాలం ఆరంభం
సంక్రాంతి లక్ష్మి ఇంట్లో
కొలువై తెచ్చిన సిరిక్రాంతి
ఈ సంక్రాంతి ఆరోగ్య క్రాంతి కావాలి.

- మోటూరి శాంతకుమారి

సంస్కృతి సందడి

మార్గశీర్షమాసం భక్తి సంపదలు
పుష్కలంగా లభిస్తూ..
సంప్రదాయం పండుగల సందడి
ఓర్వునేర్పుల ముదితలముగ్గులో గొబ్బెమ్మలు
ఎంతకీ రాని భానుణ్ణి ధిక్కరిస్తూ చలిమంటలు.
గాదెలు నిండిన గంభీరపు ధీమా
రైతుకి కూసింత ఉపశమనంగా
మలిపంట ఊహల్లో మదినిండి
పుట్టింటికి చేరే పిల్లల ఆత్రం
పండక్కి ఊరెళ్ళాలంటూ.
నలుగురు కలిసి చేసిన పిండివంటలు
గాలికి మంచాలడ్డుపెట్టి కట్టెలపొయ్యి
అరిసెలు, కజ్జి కాయలు
లడ్డులు, మణుగుబూలు
ఎందరికి పంచాలో లెక్కలు
ఇదికదా ముడుచుకొనిపోయే చలిలో
మూడుపండగల ముచ్చట.
కనుమరోజూ కాకికూడా కదలదు
మినుముతినే పద్ధతి
గారెలరుచి
ప్రతిఇంట్లో బెల్లంపాకం వాసనలు
హరిదాసు
కోడిపందేలు
తేగల తంపట్లు
ఇచ్చిపుచ్చుకునే ఇల్లాళ్ల ఉదారత
ఒకటారెండా ఎన్నో సందళ్ళు
అల్లుడొచ్చిన వేళ!!.

-ఎం. వి. ఉమాదేవి

మంచికి స్వాగతం

ముడుచుకు పోయే చలిలో
భోగి సంక్రాంతి కనుమలే కదా
సంబురంగా జరుపుకొనే
మూడు పండుగలు
సంక్రాంతి వచ్చెనంటె
చలి చంకలెత్తనివ్వదని
అన్నారు పెద్దలానాడు
బోగి మంటలతో
చలి కాచుకుంటారు ప్రతియేడు
రకరకాల తినుబండారాలు
సకినాల తయారీ అద్భుతం
ఈ పండుగకే ప్రత్యేకం
వంటింటిలో ప్రతి ఇంట
వారం రోజులు హడావిడే.
ధాన్య రాసుల ఆగమనానికి
ప్రతీక ఈ పండగంట
ముంగిట్లో ముగ్గుల ముచ్చట
రంగవల్లుల పోటీలతో
అలలారు అంతటా
ఊరంతా చూడ ముచ్చట
గంగిరెద్దుల విన్యాసాలు
హరిదాసుల గానమాధుర్యాలు
చూడ ముచ్చట
విన సొంపుగా.
భోగి మంటలతో
చెడును కాల్చి వేద్దాం
సంక్రాంతి పండుగను
సంబురంగా జరుపుకుంటూ
కనుమ పండుగ సాక్షిగా
మంచికి స్వాగతం పలుకుదాం.

-గుండం మోహన్ రెడ్డి

పండగ సంబరాలు

పెద్ద పండగొచ్చె శీతాకాలం
మూడు నాళ్ళ పర్వదినం
అది సంకురాత్రి సంబరం
బయట చంపుతున్న చలి
పంట ఇంటికొచ్చిన హాయి
గాదెల ధాన్యాలతో గలగల
దాని ముందు చలి వెలవెల.
పల్లె నిండిన పాడిపంటలు
కూడళ్లలో భోగిమంటలు
ఇంతుల ముగ్గుల తంటాలు
వంట ఇంట్లో పిండివంటలు
బసవన్న మెడలో చిరుగంటలు.
భోగిమంటలు చుట్టూ చేరి రైతన్నలు
చెప్పుకుంటారు ఊసుపోని కబుర్లు
మర్చిపోతారు చలిపెట్టే గిలిగింతలు
చేసుకుంటారు పండగ సంబరాలు.

-జె.వి.కుమార్ చేపూరి

ముచ్చటగా మూడురోజులు

మూడు పాయలు జడలా
ముచ్చటగా బంధాలను అల్లిన
మూడు రోజుల పండుగ
హేమంతంలో తుషారం
సంక్రమణంతో క్రాంతి
పంట ఇంటికొచ్చిన శుభ సమయం
హరిదాసుల కీర్తనలు
దూడూ బసవన్నల విన్యాసం
మూడు పండుగల సంబరం!!.
భోగభాగ్యాల వైభవం
చలిమంటల కాంతులు
ముగ్గుబుట్టతో కాంతులు
సప్తవర్ణాలతో రంగవల్లులు
నేలమీద అందమైన సింగిడి
భోగి ఇంటింటా వెన్నెల వాకిలి
ముగ్గుల మధ్య గొబ్బెమ్మల కాంతి
బంతి పూలు
మామిడాకుల తోరణాలతో
అలంకరింపబడిన దర్వాజాలు
చిన్నారుల తలపై భోగిపండ్లు
దృష్టి దోషాన్ని పారదోలు
ఆనందానికి ఆనవాలు
పులగం
విష్ణు చక్రాన్ని తలపించే సకినాలు
పతంగులతో పిల్లల కేరింతలు
కొత్త అల్లుళ్ల సందడి
వేడుకల్లో కుటుంబాలు!!.
రెండవ రోజు సంక్రాంతి
అందరి మనసులో కాంతి
రవి మకరరాశికి పయనం
పితృదేవతలకు తర్పణాలు
కుండలలో సంక్రాంతి లక్ష్మికి నోము
నువ్వులుండల నైవేద్యం
యమున్ని శాంతి పరచే వైనం!!.
మూడవ నాడు కనుమ
అలంకరించిన పశువులతో
ఆడి పాడి చిందులేసే రోజు
కనుము రోజు మినుము తింటే ఆరోగ్యం
పసుపు రంగు దుస్తులతో పసిడి దనం
పల్లెల్లో కనిపించే పండగ
పట్టణీకరణ మోజులో
మన సంస్కృతి ఎంత కరిగినా
ఇలకే ఆదర్శం
మన పండుగలు!!.

- డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

ముంగిట తోరణాలు- ముత్యాల ముగ్గులు

ముడుచుకుపోయే చలిలో
మూడు పండుగల ముచ్చట్లు
మురిపాల పండగ సంబరాలు
భోగి మంటల జ్వాలకు
అగ్ని దేవుడు సంతోషించి
భోగ భాగ్యాల సిరులను
కురిపిస్తాడు పుడమి పై.
ముంగిట తోరణాలుముత్యాల ముగ్గులు
ముగ్గుల్లో గొబ్బిళ్ళు
తేనెలొలికే చెరుకు గడలు
పంట ధాన్యాల పసిడి సిరులు
సంక్రాంతి పండగకు
ఘన స్వాగతం పలుకు
గంగిరెద్దుల ఆటలు, హరిదాసు కీర్తనలు
ఊరంతా సంక్రాంతికాంతి వెలుగు.
గాలిపటాల జోరుగగనం నిండు
పిల్లల కేరింతలు
పల్లె నిండు ఆడపడుచుల ఆనందం
మిన్నుముట్టు
కొత్త అల్లుళ్ల జోకులుఇల్లు నిండు
పిండి వంటల ఘుమ ఘుమలు
కడుపు నిండు.
కనుమ పండుగనాడు
ఉదయాన్నే లేచి నూలు బెల్లం తిని
నూరేళ్లు బతకమని
దీవిస్తారు పెద్దలు ప్రేమతోటి.
పాడి పశువులను నాడే
అనునయంతో అలంకరించి
పొంగళ్ళు పెట్టి వాటికి ముదము చేసి.
ఉరి బయటకు వెళ్లి
కోడి పందాలు పెట్టి
జనమంత గుమిగూడి
భోగి సంక్రాంతి కనుమ పర్వదినాలు
జరుపుకుంటారు
సంబరంతో జనులు.

-ప్రభాకర్ రావు గుండవరం

కాంతులు నిండాలి

సూర్య క్రమణంలో మార్పు
సంక్రమణ పండుగ
సంక్రాంతి
ఉత్తరాయణ పుణ్య కాలం
వెల్లువలా సాగే సంబరాలు
శాస్త్రీయతతో ముడిపడి
సంస్కృతి సౌరభాలు
గాలిపటాలు
కోళ్ల పందాలు
ఇంటింటా రంగవల్లులు
భోగి మంటల్లో పాపాలను
దహనం చేసి
ఒక సంక్రమణం
బాంతులు తొలిగి
కాంతులు నిండాలి

-వి.శేషారావు

ప్రయత్నం..

తేదీలు నెలలు మారుతూ
కొత్త సంవత్సరానికి చేరుతూ
గడిచిన గతాన్ని నెమరువేస్తూ
తరిగిన వయస్సును గుర్రుదేస్తూ
కరుగుతున్న జీవిత వెలుగు, చీకట్లు
అనుభవాలు, అనుభూతుల బేరీజు
కొత్తఏడాది మార్గదర్శనానికి స్వాగతం
ఆరోగ్యం, ఆనందాలే ఆశిద్దాం
మనవంతు ప్రయత్నం సాగిద్దాం.

- పత్తిశివప్రసాద్
సెల్: 94400 1224

నా మాతృభాష తెలుగంటే

నా మాతృభాష తెలుగంటే
అమ్మ నోట కమ్మని పాట కదా!
నాన్న ఇచ్చే మనోధైర్యం కదా!
గురువులిచ్చే అక్షర దానం కదా!
స్నేహాలనిచ్చే పాఠశాల కదా!
జ్ఞాన భాండాగారం కదా!
పున్నమి వెన్నెల వెలుగు కదా!
గిడుగు పిడుగు ఉద్యమం కదా!
అమ్మ భాష గొప్పదనం
ఆచంద్రతారార్కం కదా!

- పేరూరు బాలసుబ్రహ్మణ్యం
సెల్: 98492 24162



సాంస్కృతిక వార్తలకు తగ్గిన ప్రాధాన్యం

సభలు సమావేశాలు

పత్రికారంగంలో వచ్చిన మార్పుల కారణంగా సాంస్కృతిక వార్తలకు ప్రాధాన్యం తగ్గిందని, సాంస్కృతిక విలేకరులు రాసే వార్తలు అంటే పరోక్షంగా వారు తెలుగు సాంస్కృతిక చరిత్రను రికార్డు చేసినట్లేనని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. తెంగాణ భాషా సాంస్కృతిక సంస్థ సౌజన్యంతో కళాజ్యోతి సాంస్కృతిక సంస్థ కళావేదిక త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గానసభ కళా సుబ్బారావు కళావేదికలో మూడు రోజుల అంతర్జాతీయ స్థాయి వాగ్గేయాకర ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పత్రికల్లో స్థలాభావం వల్ల సాంస్కృతిక వార్తల సమీక్ష, విశ్లేషణలకు అవకాశం లేదని, డిజిటల్ మీడియాలో లోతైన సాంస్కృతిక వార్తల విశ్లేషణ, విమర్శలు, చర్చలకు అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా చాగంటి కపాలేశ్వరరావు జ్ఞాపకార్థం అవార్డుల ప్రధాన కార్యక్రమం జరిగింది. ప్రముఖ సంగీత విద్వాంసులు కొమాండూరి శేషాద్రి, పాత్రికేయులు ఏవీ జనార్దనరావు, సీహెచ్ రామమోహన్, ఆర్.వి. రమణ, ఎన్. సతీష్, సంగీతవేత్తలు ఉదయకుమార్ రఘునందన్‌లకు శ్రీనివాస్ అవార్డులు ప్రదానం చేసి సన్మానించారు. గానసభ అధ్యక్షులు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, సీనే కుమారుడు చాగంటి శశిధర్, నిర్వాహక సంస్థ కళాజ్యోతి ముఖ్య నిర్వాహకులు రవిశర్మ తదితరులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా వాగ్గేయకారులు త్యాగరాజస్వామి కీర్తనల ఆలాపన కార్యక్రమం జరిగింది.

త్యాగరాజ ఆరాధనోత్సవాలకు గవర్నర్‌కు ఆహ్వానం

వాగ్గేయకారుడు సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో పాల్గొనాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను త్యాగరాయ గానసభ కమిటీ సభ్యులుకోరారు. గానసభ అధ్యక్షుడుకళా జనార్ధనమూర్తి, ఉపాధ్యక్షుడు కళా సుబ్బారావు మేధా, సంయుక్త కార్యదర్శి కళాపద్మజ నీలిమ గవర్నర్‌ను రాజ్‌భవన్‌లో కలిశారు. ఈనెల 19 నుండి 23 వరకు ఉత్సవాలు జరుగుతాయని, చివరిరోజు కార్యక్రమంలో ప్రధాన అతిథిగా పాల్గొనాలని గవర్నర్ ఆహ్వానించినట్లు జనార్ధనమూర్తి వివరించారు.

చంద్రమౌళికి విశిష్ట పురస్కారం ప్రదానం

ముషీరాబాద్ శ్రీ మహంకాళి ఆలయ ప్రధాన అర్చకుడు, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు వై చంద్రమౌళికి సంక్రాంతి విశిష్ట పురస్కారం ప్రదానం చేశారు. కళానిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ సారస్వత పరిషత్‌లో హాస్యనటుడు తిక్కవరపు వెంకట రమణారెడ్డి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయనకు పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదనరావు, తెలంగాణరాష్ట్ర ప్రతినిధి వేణుగోపాలచారి పాల్గొన్నారు.

కందికండ రామస్వామి స్మారక పురస్కారం

కందికొండ రామస్వామి స్మారక పురస్కారం కోసం 2021లో ముద్రితమైన కవితా సంపుటాలు మూడు ప్రతులను జనవరి 31లోగా చిరునామాన పి. అబ్దుల్ వహీద్‌ఖాన్, ఇ.నెం. 15-120/4/1, రహత్ నాగర్ కాలనీ, నాగర్ కర్నూల్-509 209. సెల్: 944194609కు పంపాలి. బహుమతి పొందిన సంపుటికి నేల పొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక తరపున రూ.10 వేల నగదు పురస్కారం, జ్ఞాపిక ప్రదానం ఉంటుంది.

- వనపట్ల సుబ్బయ్య

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.
నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

ఉదయ సంధ్యలు

నిండిన కుండలు ఒకవైపు
మండే కడుపులు మరువైపు
ఆహార పృధాలు ఒకవైపు
ఆర్తనాదాలు మరువైపు.
ఆ దరినేమో వెలుగు జిలుగులు
ఈ దరినేమో వెలుగని దివ్వెలు
అటువైపేమో నూతన హంగులు
ఇటువైపేమో నెరిసిన రంగులు.
ఆ పంచనేమో పంచభక్ష్యాలు
అరగకముందే అరగింపులు
ఈ పంచనేమో అష్టకష్టాలు
పూటపూటకు వెతుకులాటలు.
ఆ పిల్లల మోములో దరహాసాలు
అనునిత్యం జరిగే ఆర్భాటాలు
ఈ పిల్లల మోములు విరహాసాలు
గడియ గడియలో దౌర్భాగ్యాలు.
సమ సమాజం సాధన ఎపుడు?
అసంతులిత బేధమె ఎపుడు
అసమానతల ఖేదమె కద ఇది
అసంఘటితుల జూదపు తీరిది.
ఎంతకాలమీ అగచాట్లు
ఎంతకాలమీ వెగచాట్లు
ఎంతకాలమీ ఎదురుచూపులు?
ఎంతకాలమీ ఆకలి కేకలు??

-గంగాపురం శ్రీనివాస్
9676305949

భారమైన కన్నీళ్లు...

కర్మభూమి పుణ్యభూమితో
పునీతమైన నేల
పిడికెడన్నంకోసం తపించే మానవాళి...!
సృష్టికి మూలమైన
శక్తిరూపు స్త్రీ! అనేక అవతారాల
ప్రేమమయి
కుటుంబంకోసం అహర్నిషలు
శక్తి పుంజుకొని
బతుకుబండిని ఎల్లదీస్తూ
కలిగిన దాంట్లోనే కలిమిని
పంచే తల్లీ..!
స్త్రీ ఓపికకు సాక్షాత్కారం
బాధ్యతలకు ఆకాశమంత అండ!
కన్నీళ్ళను దాచుకొనే
బడబాగ్ని అయినా
అమృత వర్షాన్ని కురిపించే
అమ్మ తత్వం...!
నాడైన, నేడైనా తారలు ఎన్ని మారినా
తలరాతలు మారని బడుగు జీవుల
జీవనం!
పంటిబిగువున,కన్నీటి ధారల్లో
కష్ట సుఖాల్ని అదిమి పెట్టి
నిత్యం పేదోని పేగుల ఆకలి
ఉన్నోడికి తీసిపోని
పంచభక్ష పరమాన్నం దొరికినా
కూటిలోని బుక్కెడు బువ్వ
పరబ్రహ్మ స్వరూపమే....!!.

-చిందం సునీత

కళలకు 'సంక్రాంతి' పండుగ ప్రతీక: సీఎం

అమరావతి, జనవరి 12:మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మనవైన? అచ్చ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు, సొంత గ్రామాల మీద మమకారానికి, రైతులకు, వ్యవసాయానికి మనమంతా ఇచ్చే గౌరవానికి, తెలుగువారికంటూ ప్రత్యేకమైన కళలకు సంక్రాంతి పండుగ ప్రతీక అని సీఎం అన్నారు.

భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్ళు, పైరు పచ్చల కళకళలు గ్రామాల్లో సంక్రాంతి శోభను తీసుకువచ్చాయని చెప్పారు. భోగి.. సంక్రాంతి.. కనుమ పండుగలను ప్రతి గ్రామంలో ఉన్న ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి జగన్ అభిలషించారు.

35ఏళ్ల లోపు మహిళలకే అండం ఫ్రీజింగ్ : డా.సునీత ఇలినాని

హైదరాబాద్, జనవరి 12:35 సంవత్సరాలు, అంతకంటే తక్కువ వయస్సున్న మహిళలు అండం ఫ్రీజింగ్ చేయించుకునేందుకు అనువైన వయస్సు అని బంజారాహిల్స్ అపోలో ఫెర్టిలిటీ, సీనియర్ కన్సల్టెంట్ ఇన్‌ఫెర్టిలిటీ అండ్ ఎఆర్‌టిస్పెషలిస్ట్ డా.సునీత ఇలినాని తెలిపారు. ఆమె మాట్లాడుతూ? మహిళలు పెద్దవారయ్యేకొద్ది సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. వయస్సుతో పాటు మహిళల్లో అండాల సంఖ్య, అండాల నాణ్యత తగ్గుతూ ఉంటుందన్నారు. శిశువుగా జన్మించడంతోనే నిర్ణీత సంఖ్య కలిగిన అండాలతో పుడతారు, పుట్టినప్పుడు వారిలో దాదాపు 1-2 మిలియన్ అండాలుంటాయన్నారు. కాలక్రమేణా, ఈ అండాలు క్షీణిస్తూ వస్తాయన్నారు. ఒకఅమ్మాయి యుక్త వయస్సు వచ్చే సమయానికి కేవలం 300 ? 4,00,000 వరకు మాత్రమే అండాలు మిగిలిఉంటాయన్నారు. ఆమె పెద్దయ్యాక ముఖ్యంగా 30 సంవత్సరాల వయస్సు తరువాత ఆమె ఈ అండాలను వేగంగా కోల్పోవడం జరుగుతుందన్నారు. అలాగే, కొంత మంది మహిళలు తమ సహచర మహిళల కంటే వేగంగా అండాలను కోల్పోతారన్నారు. తద్వారా వారిలో సహజంగా గర్భం దాల్చే అవకాశం సన్నగిల్లి పోతుందన్నారు.

30 ఏళ్లలోపు గర్భందాల్చడం సులభమే అయినప్పటికీ, సామాజిక, వృత్తిపరమైన లేదా అనారోగ్య కారణాల వలన ప్రస్తుత కాలంలో మహిళలు తమకు సరైన సమయం వచ్చేవరకు బిడ్డను కనడాన్ని వాయిదా వేసుకుంటున్నారన్నారు. ఇటువంటి మహిళలు తమ అండాలను ఫ్రీజింగ్ చేయడం ద్వారా భవిష్యత్తులో వాటిని ఉపయోగించుకొనడం ద్వారా వారి సంతానోత్పత్తి అవకాశాలను కాపాడుకోవచ్చన్నారు. చికిత్స ప్రక్రియ ఐవీఎఫ్ చికిత్స మాదిరిగానే ఉంటుందన్నారు. ఇందులో 10 ? 12 రోజుల వరకు రోజువారీ ఇంజెక్షన్లను తీసుకోవలసి ఉంటుందన్నారు. అండం పెరుగుదల అల్ట్రాసౌండ్, రక్తపరీక్షల ద్వారా పర్యవేక్షించబడుతుందన్నారు. అండాలు సిద్ధమైన తర్వాత, అనస్థీషియా ఇచ్చి ఆ తరువాత అల్ట్రాసౌండ్ సహాయంతో వాటిని ట్రాన్స్‌వాజినల్‌గా సేకరిస్తారు. ఈ ప్రక్రియకు సాధారణంగా 30-40 నిమిషాల సమయం పడుతుందన్నారు. దీనిని డేకేర్ ప్రక్రియగా అనగా ఒకేరోజు పూర్తయ్యేలా చేస్తారన్నారు. సేకరించిన ఈ అండాలను శిక్షణ పొందిన ఎంబ్రియాలజిస్ట్ అధ్యయనం చేసి తదుపరి ఉపయోగం కోసం వాటిని శీతలీకరణ చేస్తారన్నారు.

అండాలను ఫ్రీజింగ్ చేయడం అనేది భవిష్యత్తులో ఆ మహిళ శిశువుకు జన్మిస్తుందని హామీ ఇవ్వడం జరగదని, ఇక్కడ అర్థం చేసుకోవడం ముఖ్యమన్నారు. ఒక మహిళ గర్భం ధరించడానికి సిద్ధంగా ఉన్నా వెంటనే ప్రయత్నించడం ప్రారంభించాలన్నారు. అండాన్ని ఫ్రీజింగ్ ఎంపికకు పరిగణనలోకి తీసుకోవాలనే మహిళలు వివరణాత్మక అంచనా కోసం ఫెర్టిలిటీ నిపుణులను సంప్రదించాలన్నారు. ఫెర్టిలిటీ నిపుణుడు రక్తపరీక్ష, అల్ట్రాసౌండ్ చేయడం ద్వారా అండం ఫ్రీజింగ్ అయ్యే అవకాశాన్ని అంచనా వేస్తారని, వాటిని వేదికల ఆధారంగా మరింత మార్గనిర్దేశం చేయగలరని డా.సునీత ఇలినాని తెలిపారు.

కరోనా బారినపడ్డ కొడాలి నాని, వంగవీటి రాధా

అమరావతి, జనవరి 12: ఏపీ మంత్రి కొడాలి నాని, టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ కరోనా బారినపడ్డారు. ఇద్దరూ హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చేరారు. తనలో స్వల్పంగా లక్షణాలు కనిపించడంతో అనుమానంతో రాధా కరోనా పరీక్షలు చేయించుకోగా వైరస్ సోకినట్టు నిర్ధారణ అయింది. దీంతో ఆయన కూడా వెంటనే హైదరాబాద్ చేరుకుని ఏఐజీ ఆసుపత్రిలో చేరారు.

రాధా ఈనెల 9న కృష్ణా జిల్లా కంచికచర్లలో రంగా విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగానే ఆయనకు వైరస్ సంక్రమించి ఉంటుందని అనుమానిస్తున్నారు. కాగా, కొడాలి నాని, రాధా ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

పంట నష్టం అంచనా వేస్తున్నాం: వరంగల్ కలెక్టర్

వరంగల్, జనవరి 12:: జిల్లాలో వడగళ్ల వానతో నష్టపోయిన పంటలను జిల్లా కలెక్టర్ గోపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటనష్టం అంచనా వేస్తున్నామన్నారు. నల్లబెల్లి, దుగ్గొండి, నర్సంపేట, ఖానాపురం మండలాల్లో వడగళ్ల తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. మిర్చి, పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయన్నారు.

వరంగల్ జిల్లాలో మంగళవారం భారీ వర్షం కురిసిన సంగతి తెలిసిదే. ఈదురు గాలులతో వాన పడడంతో పంటలు దెబ్బతిన్నాయి. రాళ్లవానతో ఇళ్లు ధ్వంసమయ్యాయి. దుగ్గొండి, పర్వతగిరి, చెన్నారావుపేట, ఖానాపురం, తదితర మండలాల్లో భారీ వడగళ్ల వర్షం కురిసింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.